మంగళవారం
28-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 127
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కేసముడి గ్రామంలో సోడి భద్రు (41) అనే గిరిజనుడు హత్యకు గురయ్యారు. పోలీస్ ఇన్‌ఫార్మర్ అన్న అనుమానంతో మావోయిస్టులు అతడిని హతమార్చారు. పోలీసులకు ఇన్‌ఫార్మర్ కాబట్టే శిక్షించామని భైరంగఢ్ ఏరియా కమిటీ పేరుతో ఘటన స్థలంలో రాసి పెట్టారు. ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించే ఎవరికైనా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. భద్రు మృతదేహాన్ని భైరంగఢ్ పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమదు చేశారు.

అమోనియా జలాలపై నివేదిక ఇవ్వండి: ఈసీ

న్యూఢిల్లీ: ఢిల్లీకి అమోనియా మోతాదు అధికంగా ఉన్న జలాలు సరఫరా చేసిందని హర్యానా ప్రభుత్వంపై దేశ రాజధానిలోని ఆమ్ ఆద్మీ పార్టీ సర్కార్ ఆరోపణలు చేసింది. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది.

దీంతో మంగళవారం మధ్యాహ్నం లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలంటూ హర్యానా ప్రభుత్వానికి ఈసీ ఆదేశాలిచ్చింది. ఢిల్లీ అసెంబ్లీకి వచ్చే నెలలో ఎన్నికలు జరగనున్న క్రమంలో ఢిల్లీకి హర్యానా నుంచి వచ్చే జలాలు హాట్ టాపిక్‌గా మారాయి.

ఉదయనిధికి సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. సనాతన ధర్మంపై వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన మూడు రిట్ పిటిషన్లను విచారించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద వీటిని ఎలా పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నించింది. జస్టిస్ బేలా ఎం.త్రివేదీ, జస్టిస్ ప్రసన్న బి.వరాలేలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను తోసిపుచ్చింది. 2023

- మిగతా 2 లో

సీఎం సిద్దరామయ్య భార్యకు ఈడీ సమన్లు

బెంగళూరు : మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కేటాయింపుల కుంభకోణానికి సంబంధించి మంగళవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య భార్య పార్వతి బిఎంను తమ ముందు హాజరు కావాలని ఈడీ కోరింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అదనపు డైరెక్టర్ మురళీకన్నన్... ఆధారాలు, రికార్డులను సమర్పించాలని ఆమెకు లేఖ రాశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం-2002 నిబంధనల ప్రకారం ఈ విషయాన్ని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పీఎంఎల్ఏ

- మిగతా 2 లో

రాజ్యాంగాన్ని మార్చేందుకు
మోదీ కుట్ర

కలసికట్టుగా పోరాడి రక్షించుకుందాం
'సంవిధాన్' ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

విశాలాంధ్ర-హైదరాబాద్ : ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కానీ రాహుల్ గాంధీ... రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుతున్నారని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో సోమవారం జాతీయ కాంగ్రెస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" ర్యాలీలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. రాజ్యాంగ పరిరక్షణకు రాహుల్ గాంధీతో కలిసి మనం పోరాటం చేస్తున్నామన్నారు. ఇది ఎన్నికల ర్యాలీ కాదు... ఒక యుద్ధం అని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు పోరాడేవారికి, రాజ్యాంగాన్ని మార్చాలనుకునేవారికి మధ్య ఈ యుద్ధం జరుగుతోందని పేర్కొన్నారు. నాడు గజనీ మహమ్మద్ హిందుస్తాన్‌ను దోచుకోవడానికి ప్రయత్నించినట్లు నేడు రాజ్యాంగాన్ని మార్చాలని మోదీ కుట్రపన్నుతున్నారని విమర్శించారు. కానీ ఆయన ప్రయత్నం ఫలించడంలేదని అన్నారు. ఆనాడు బ్రిటిషర్ల నుంచి మహాత్మా గాంధీ దేశాన్ని రక్షించినట్లు భారతీయ జనతాపార్టీ పేరుతో చలామణి అవుతున్న బ్రిటిష్ జనతా పార్టీని ఎదుర్కొనేందుకు రాహుల్ నిలబడ్డారన్నారు. ఈ యుద్ధంలో మనమంతా రాహుల్ గాంధీతో కలసి నడవాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు మనమంతా కలిసికట్టుగా పోరాడాలని, ఇది రెండు పరివార్ ల మధ్య జరుగుతున్న యుద్ధమని అందులో ఒకటి గాంధీ పరివార్ అయితే మరొకటి గాడ్సే పరివార్ అన్నారు. గాడ్సే పరివార్ వైపు నుంచి మోదీ ఉంటే గాంధీ పరివార్ వైపు నుంచి రాహుల్ గాంధీ పోరాడుతున్నారన్నారు. అందుకే మనమంతా గాంధీ పరివార్‌కు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. రాహుల్ నేతృత్వంలో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రాజ్యాంగాన్ని పరిరక్షించాలన్నారు.

ఇది ప్రజా ప్రభుత్వం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందచేస్తాం
కేటీఆర్‌కు ఆవేశమెక్కువ... ఆలోచన తక్కువ: సీతక్క

విశాలాంధ్ర-హైదరాబాద్ : సంక్షేమ పథకాలు అందని గ్రామాలు రణరంగంగా మారుతాయన్న కేటీఆర్ వ్యాఖ్యలను మంత్రి సీతక్క సోమవారం ఖండించారు. నూతన పథకాలతో గ్రామాల్లో పండగ వాతావరణం కన్పిస్తుంటే కేటీఆర్ ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. కొత్త పథకాలను కేవలం ఒక్క గ్రామానికే పరిమితం చేసినట్లుగా కేటీఆర్ భ్రమలు కల్పిస్తున్నారని మండిపడ్డారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి మండలంలోని ఒక గ్రామంలో నాలుగు నూతన పథకాలను విజయవంతంగా ప్రారంభిస్తే కేటీఆర్ తట్టుకోలేక పోతున్నారని అన్నారు. ఒక గ్రామంలో పథకాల అమలును లాంఛనంగా మొదలు పెట్టి... ఇతర గ్రామాలకు విస్తరిస్తారన్న ఇంగిత జ్ఞానం లేకపోతే ఎలా అని ఆమె ప్రశ్నించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకాలు అర్హులందరికీ అందడం లేదా అని అడిగారు. ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడమే కేటీఆర్ పని అని మండిపడ్డారు. కేటీఆర్‌కు ఆవేశం ఎక్కువ... ఆలోచన తక్కువ అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ లాగా ఎన్నికల లబ్ధి కోసం తాము పథకాలు అమలు చేయడం లేదన్న విషయాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. దళిత గిరిజన కుటుంబాలకు మూడు ఎకరాల భూమి, అన్ని దళిత కుటుంబాలకు దళిత బంధు, బీసీలకు బీసీ బంధు, మైనారిటీలకు మైనారిటి బంధు హామీని ఎంత మేర నెరవేర్చారని ప్రశ్నించారు. గత సీఎం కేవలం చింతమడకకే సీఎం అయినట్లు వ్యవహరించి... ప్రతి ఇంటికి రూ.10 లక్షలు పంచి పెట్టారని మండిపడ్డారు. కానీ తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు. గత పదేళ్లలో పేదల గృహ నిర్మాణాన్ని విస్మరించి, కొత్త రేషన్ కార్డులను ఇవ్వని మీరు ఇప్పుడు మాయమాటలు చెబితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

పేదల సమస్యలపై ఉద్యమం

- ప్రభుత్వానికి రెండు మాసాలే గడువు
- అసెంబ్లీ ముట్టడికైనా వెనుకాడం
- సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హెచ్చరిక

విశాలాంధ్రబ్యూరో-కడప: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వచ్చి ఆర్నెల్లు గడిచినా... ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. వచ్చే రెండు మాసాలలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూముల పంపిణీ జరగకపోతే వచ్చే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పేదల పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున పేదలను సమీకరించి సీపీఐ అధ్వర్యంలో 'చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతామని' రామకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను

- మిగతా 2 లో

జగన్ కేసుల బదిలీకి
నిరాకరణ

రోజువారీ విచారణకు వర్తింపు
సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేసులను వేరే రాష్ట్రానికి బదిలీ చేసేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. అక్రమాస్తుల ఆరోపణల కేసులో జగన్ బెయిల్‌ను రద్దు చేయడంతో పాటు తెలంగాణ సీబీఐ కోర్టులో కొనసాగుతున్న కేసుల విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన రెండు పిటిషన్లపై సోమవారం సుప్రీంలో విచారణ జరిగింది. తెలంగాణ హైకోర్టులో జగన్ అక్రమాస్తుల కేసు విచారణ జరుగుతున్నందున వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని, బెయిల్ రద్దు చేయాలన్న పిటిషన్ పైనా ప్రత్యేకంగా విచారణ అవసరం లేదని న్యాయమూర్తులు జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర మిశ్రా ధర్మాసనం తేల్చి చెప్పింది. దీంతో రఘురామ న్యాయవాది ఆ పిటిషన్‌ను వెనక్కి తీసుకోగా, అందుకు ధర్మాసనం అనుమతి ఇచ్చింది. కాగా ఎంపీ, ఎమ్మెల్యేల కేసులను ప్రత్యేక కోర్టులు రోజు వారీగా చేపట్టాలని సుప్రీం కోర్టు

- మిగతా 2 లో

భోజన పథకంపై ప్రభుత్వానికి విద్యా కమిషన్ నివేదిక

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో పలు కీలక మార్పులు చేయాల్సి ఉందని విద్యా కమిషన్ అభిప్రాయపడింది. ఇటీవల పలు ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో వెలుగు చూసిన ఫుడ్ పాయిజన్ ఘటనలను దృష్టిలో ఉంచుకుని... రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలను విద్యా కమిషన్ సందర్శించింది. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, ఆహార నాణ్యత, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పన... తదితర అంశాలను కమిషన్ పరిశీలించి ఓ నివేదికను రూపొందించింది. సీఎస్ శాంతికుమారికి కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు నివేదిక అందించారు. నివేదికలో ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మెనూలో మార్పులపై నివేదికలో పలు సూచనలు చేసింది. 'వారంవారం బిల్లులను చెల్లించాలి. ఇంటర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలి. రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించాలి. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులకు అవసరమైన కాస్మొటిక్స్, ఇతరత్రా సామగ్రిని తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలి. ఇలా సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ విధానం వల్ల విద్యార్థులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించవచ్చు' అని నివేదికలో కమిషన్ పేర్కొంది.

యూజీసీ మార్గదర్శకాలు వ్యతిరేకిస్తున్నాం

తెలంగాణ ఉన్నత విద్యామండలి

విశాలాంధ్ర-హైదరాబాద్: వీసీల నియామకంలో యూజీసీ మార్గదర్శకాలపై తెలంగాణ ఉన్నత విద్యామండలి స్పందించింది. మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. వీసీలుగా బ్యూరోక్రాట్స్‌ను నియమించాలనుకోవడం సరికాదన్నారు. యూజీసీ గైడ్‌లైన్స్.. ప్రైవేటైజేషన్‌ను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. 'యూజీసీ మార్గదర్శకాల సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయి. రాష్ట్ర యూనివర్సిటీలను దెబ్బతీసేలా కేంద్రం నిర్ణయాలున్నాయి. వర్సిటీలు స్వతంత్రంగా ఉండాలి. ఈ అంశంపై మేం ఒక కమిటీ వేసుకున్నాం. కమిటీ ఇచ్చే రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం. వర్సిటీల్లో ఖాళీల భర్తీపై త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం' అని బాలకృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్రాల పరిధిలోని విశ్వవిద్యాలయాల మార్గదర్శకాల్లో మార్పులు చేస్తామంటూ యూజీసీ రాష్ట్రాలకు ప్రతిపాదనలు పంపగా, వీటి ప్రకారం వీసీలను నియమించే అధికారాలు కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది.

రాజ్యాంగం లేకుంటే
ఎవరూ మిగలరు

మోదీ పాలనలో అంబేద్కర్‌కు అవమానం
స్వాతంత్ర్య పూర్వ పరిస్థితి కోరుకుంటున్నారు
వారికి పేదలు ముఖ్యం కాదు
మోవ్ బహిరంగ సభలో నిప్పులు చెరిగిన రాహుల్

భోపాల్: బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు డా.బీఆర్ అంబేద్కర్‌ను, ఆయన రూపొందించిన రాజ్యాంగాన్ని అవమానించాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మండిపడ్డారు. అధికారంలో ఉన్నవారి నుంచి రాజ్యాంగాన్ని రక్షించాలని పార్టీ కార్యకర్తలను కోరారు. సోమవారం బీఆర్ అంబేద్కర్ జన్మస్థలమైన మధ్యప్రదేశ్‌లోని మోవ్ వేదికగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పేరుతో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. ఈ సందర్భంగా మోదీ పాలనలో అంబేద్కర్‌కు జరుగుతోన్న అవమానాన్ని ఆయన వివరించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేతోపాటు వయనాడ్ ఎంపీ ప్రియాంక వాద్రా తదితర అగ్రనేతలు హాజరయ్యారు. అలాగే వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఆ పార్టీ ముఖ్య నేతలు వచ్చారు. దాదాపు 2 లక్షల మంది కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రాహుల్ మాట్లాడుతూ... కేంద్రంలో అధికారం చేపట్టిన వెంటనే కాంగ్రెస్ దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహిస్తుందని ప్రకటించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దానిని నిర్వహించడానికి భయపడుతున్నందున దానిని ఎప్పటికీ పూర్తి చేయలేన్నారు. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించి... ఈ విషయంలో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

వక్ఫ్ బిల్లుకు 14 సవరణలు

- ఎన్‌డీఏ ప్రతిపాదనలకే జేపీసీ ఆమోదం
- ప్రతిపక్షాల ప్రతిపాదనలన్నీ తిరస్కృతి

న్యూఢిల్లీ: వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లుకు 14 సవరణలను ఆమోదిస్తూ బీజేపీ ఎంపీ, కమిటీ ఛైర్మన్ జగదాంబికా పాల్ నేతృత్వ సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) నిర్ణయం తీసుకుంది. వక్ఫ్ సవరణ బిల్లుకు ఎన్‌డీఏ చేసిన ప్రతిపాదనలను సోమవారం ఆమోదించింది. ప్రతిపక్ష సభ్యుల ప్రతిపాదనలు అన్నింటినీ తిరస్కరించింది. 'మొత్తం 44 సవరణలను చర్చించాం. మెజారిటీ ఆధారంగా 14 సవరణలను ఆమోదించాం. అన్ని సవరణలపై ఓటింగ్ జరిగింది. ప్రతిపక్షాల ప్రతిపాదనలకు అనకూలంగా 10, వ్యతిరేకంగా 16 ఓట్లు వచ్చాయి' అని పాల్ తెలిపారు. తాజా సవరణలతో మరింత మెరుగైన, సమర్థ చట్టం రూపుదిద్దుకుంటుందని వెల్లడించారు.

కమిటీ ఒట్టి బూటకం...ఇది ప్రజాస్వామ్యానికి బ్లాక్‌డే: విపక్షాలు

వక్ఫ్ బిల్లుకు తాము చేసిన ప్రతిపాదనలన్నీ తిరస్కరించి, ఎన్‌డీఏ సభ్యుల

- మిగతా 2 లో

బానిస సంకెళ్లు తెంచిన పోరాటం

తెలంగాణా సాయుధ పోరాటం మూడు శతాబ్దాల అసఫ్జాహీల పాలనా సంకెళ్లను పగులగొట్ట గలిగింది. ఆఖరి, ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అసఫ్జాహీ పాలకులలోకెల్లా నిరంకుశుడు. పిసినారితనంలో కూడా ఆయనను మించినవాడు లేడు. అప్పటికి ప్రపంచంలోకెల్లా సంపన్నుడైనప్పటికీ తన పైజమాల చిరుగులకు స్వయంగా తానే మాసికలు వేసుకుని తొడుక్కునేవాడు. పదహారు జిల్లాలు, కోటి 70 లక్షల జనాభాతో హైదరాబాద్ సంస్థానం దేశంలోని స్వతంత్ర సంస్థానాలలోకెల్లా పెద్దది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

ఉపాధి కూలీ విలవిల

- బడ్జెట్‌లో అరకొర కేటాయింపుల ఫలితం
- సమయానికి అందని వేతనాలు

న్యూఢిల్లీ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)కు నిధుల కొరత పెద్ద సమస్యగా మారింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ ఈ పథకానికి బడ్జెట్‌లో అదనపు కేటాయింపులు లేవు. ఫలితంగా కార్మికులకు సమయానికి వేతనాలు అందడం లేదు. పనుల కోసం అవసరమైన సామాగ్రిని సరఫరా చేసే వ్యాపారులకు చెల్లింపులు జరగడం లేదు. దీంతో ఉపాధి హామీ పథకం ఉద్దేశం దెబ్బతింటోంది. కార్మికులకు వేతనాలు చెల్లించడం కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు అదనంగా రూ.4,315 కోట్ల అవసరం ఏర్పడింది. దీంతో నిధుల బదిలీ ఉత్తర్వు (ఎఫ్‌టీఓ) అవసరమైంది. ఉపాధి హామీ చట్టంలోని సెక్షన్ 3(3) ప్రకారం కార్మికులకు పని పూర్తి అయిన వారం లేక పక్షం రోజుల్లోగా వేతనాన్ని చెల్లించాల్సి ఉంది. అయితే సామాగ్రి కోసం రూ.5,715 కోట్ల బకాయి కేంద్రానికి ఉంది. ఉపాధి హామీ పనుల కోసం వినియోగమయ్యే సామాగ్రికి అయ్యే వ్యయంలో 60శాతాన్ని కేంద్రం, 40శాతాన్ని రాష్ట్రాలు భరిస్తాయి. పనికి అవసరమైన వస్తువులను సమకూర్చడంలో జాప్యం వల్ల భవిష్యత్ ప్రాజెక్టులపై విఘాతం కలుగుతోంది. ఈ పరిస్థితుల్లో

- మిగతా 2 లో

వలసదారులపై ఉక్కుపాదం

ప్రత్యేక విమానాల్లో స్వదేశాలకు పంపుతున్న వైనం

వ్యతిరేకించే దేశాలపై చర్యలు తప్పవు: అమెరికా హెచ్చరికలు

వాషింగ్టన్: అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతోంది. పెద్ద సంఖ్యలో శరణార్థులను తిరిగి స్వదేశాలకు పంపివేస్తోంది. ఈ క్రమంలో కొన్ని దేశాలు అభ్యంతరం చెబుతుండటంతో అందుకు సహరించకపోతే ఆంక్షలు విధిస్తామంటూ అగ్రరాజ్యం హెచ్చరికలు చేసింది. సంబంధిత ఉత్తర్వులను అమెరికా కాంగ్రెస్ ఆమోదించినట్లు ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ వెల్లడించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చి రాగానే దేశంలో అక్రమంగా ఉంటున్న వారి కోసం తనిఖీలు చేపట్టారు. అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తూ.. ప్రత్యేక విమానాల్లో వారిని స్వదేశాలకు పంపించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ చర్యలను కొలంబియా వ్యతిరేకించింది. రెండు 'డిపోర్టేషన్' విమానాల ల్యాండింగ్‌కు నిరాకరించింది. దీంతో కొలంబియా నుంచి దిగుమతి చేసుకునే అన్ని వస్తువులపై 25 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. 'అమెరికా నుంచి చొరబాటుదారులను వెనక్కు పంపిన రెండు విమానాలను కొలంబియా దిగనివ్వలేదని నాకు ఇప్పుడే తెలిసింది. కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తిరస్కరణ అమెరికా భద్రతకు విఘాతం కలిగించడమే అవుతుంది. తక్షణమే కొలంబియాపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చా' అని 'ట్రూత్'లో ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ తాజా ఆదేశాలతో వెంటనే అమల్లోకి వచ్చే ప్రతిఘటన చర్యల్లో... కొలంబియా నుంచి దిగుమతయ్యే సరుకులపై 25శాతం సుంకం విధించడం, దీనిని వారంలోగా 50శాతానికి పెంచడం, ప్రమాణ నిషేధం విధించడం, కొలంబియా ప్రభుత్వ అధికారులు, మిత్రులు, మద్దతుదారుల వీసాల రద్దు, కొలంబియా ప్రభుత్వ మద్దతుదారులు, వారి కుటుంబ సభ్యులు, పార్టీ సభ్యుల వీసాలపై

ఆంక్షల అమలు, కొలంబియన్ పౌరులు, కార్గోలను క్షుణ్ణంగా తనిఖీ చేయడం, అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టపరమైన ఆంక్షలు విధించడం వంటివి ఉన్నాయి.

ముందు వ్యతిరేకించి.. ఆపై అంగీకరించిన కొలంబియా

ట్రంప్ తమ దేశంపై ఆంక్షలు ప్రకటించిన వెంటనే కొలంబియా దీటుగా బదులిచ్చింది. అమెరికా సరుకులపై 25శాతం సుంకం విధించాలంటూ ఉత్తర్వులు జారీచేసింది. వలసదారులను తీసుకొచ్చే విమానాలను తమ దేశంలోకి అనుమతించమని కొలంబియా చెప్పింది. అమెరికా నుంచి వలసదారులతో వచ్చే విమానాలు తమ దేశంలోకి రాకుండా ఆ దేశాధ్యక్షుడు పెట్రో నిషేధం విధించారు. వలసదారులను నేరస్థులుగా చిత్రీకరించకుండా, పౌర విమానాల్లో పంపిస్తేనే నుమతిస్తామని స్పష్టంచేశారు. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఆరంభమేనని, వ్యతిరేకిస్తే సుంకాలు తప్పబోవని హెచ్చరించారు. అయితే అమెరికా తీవ్రస్థాయిలో ప్రతికార చర్యలకు దిగడంతో కొలంబియా వెనక్కు తగ్గింది. తమ నిర్ణయాన్ని మార్చుకున్నది. అమెరికాతో ఏకీభవించింది. ఆ దేశం నుంచి వెనక్కి వచ్చిన వలసదారులను స్వాగతించింది. ఇదిలావుంటే, అమెరికా అనుసరిస్తున్న విధానంపై బ్రెజిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలా వలసదారుల చేతులకు సంకెళ్లు వేసి పంపించడాన్ని తీవ్రంగా పరిగణించింది.

శాంతించిన అమెరికా

కొలంబియా తమ నిబంధనలకు ఒప్పుకోవడంతో అమెరికా కూడా శాంతించింది. ఆ దేశంపై విధించిన సుంకాలు, ఆంక్షలను నిలిపి వేయనున్నట్లు ప్రకటించింది. ఇదే క్రమంలో శ్వేతసౌధం ఒక ప్రకటన చేసింది. అమెరికా సార్వభౌమత్వాన్ని పరిరక్షించడానికి అధ్యక్షుడు ట్రంప్ శ్రమిస్తున్నారని, ఇందులో భాగంగా అక్రమ వలసదారులను వారి స్వదేశాలకు తిప్పి పంపుతున్నామని, ఇందుకు ప్రపంచ దేశాలు సహకరించాలని పేర్కొంది.

గురుద్వారాల్లో తనిఖీలు: సిక్కు సంఘాల ఆగ్రహం

అక్రమ వలసదారుల్ని గుర్తించే క్రమంలో గురుద్వారాలో హోమ్‌ల్యాండ్ భద్రతా అధికారులు తనిఖీలు చేపట్టారు. న్యూయార్క్, న్యూజెర్సీల్లోని గురుద్వారాలను సోదా చేశారు. వేర్పాటువాదులు, అధికారిక పత్రాలు లేని వలసదారులు గురుద్వారాల్లో ఆశ్రయం పొందుతున్నారన్నది ట్రంప్ ప్రభుత్వ వాదన. అయితే గురుద్వారాల పవిత్రతను దెబ్బ తీసే విధంగా ట్రంప్ ప్రభుత్వం పనిచేస్తోందని తాజా చర్యలపై సిక్కు సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇప్పటికే వందల మంది వలసదారులను అరెస్టు చేసి వారిపై ఉగ్రవాదం, మాదకద్రవ్యాల రవాణా, లైంగిక నేరాలకు పాల్పడిన వారిగా ముద్ర వేసిన విషయం తెలిసిందే.

రైలు ప్రమాద బాధితులకు న్యాయమెప్పుడు?

- గ్రీస్ పార్లమెంటు వద్ద నిరసన: పాల్గొన్న 30వేల మంది
- పోలీసులపై రాళ్లు, పెట్రో బాంబులతో యువకుల దాడి
- నలుగురు పోలీసులకు గాయాలు

ఏథెన్స్: సెంట్రల్ గ్రీస్, టెంపీలో 2023లో జరిగిన రైలు ప్రమాద బాధితులకు న్యాయం జరిగేది ఎప్పుడు అంటూ గ్రీస్ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీశారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. విచారణను తప్పుదోవ పట్టిస్తూ పబ్బం గడుపుకుంటోందని ఆరోపించారు. తక్షణమే బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం భారీఎత్తున ఆందోళనలు చేపట్టారు. పార్లమెంటు వద్దకు 30వేల మంది చేరుకొని నిరసన తెలిపారు. బాధిత కుటుంబాల సమాఖ్య అధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలకు ప్రతిపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు మద్దతిచ్చాయి. కీలకాంశాలను కప్పిపుచ్చేందుకు 57 మంది ప్రాణాలు తీసిన ఈ రైలు ప్రమాదానికి సంబంధించిన విచారణను ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని మృతుల కుటుంబాలు ఆరోపించాయి. ఇది ప్రమాదం కాదు నేరమంటూ నినదించాయి. తగిన దెబ్బల కంటే ఊపిరి అందక చాలా మంది చనిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశాయి. మండే తత్వమున్న పదార్థాలను గూడ్స్ రైలులో అక్రమంగా తరలించడం వల్ల పేలుడు సంభవించిందని బాధితులు ఆరోపించారు. ఇది ప్రమాదం కాదు నేరమని మండిపడ్డారు. పార్లమెంటు సమీపంలోని పేవ్‌మెంట్ మీద ఎర్ర పెయింట్‌తో మృతుల పేర్లను రాసి నిరసన తెలిపారు. 'నాకు ఆక్సిజన్ అందలేదు' అంటూ నినాదాలిచ్చారు. ఏథెన్స్‌తో పాటు దాదాపు 100 నగరాల్లో పెద్దఎత్తున ఆందోళనలు, నిరసనలు జరిగాయి. ఈ క్రమంలో కొన్ని చోట్ల హింస చోటుచేసుకుంది. నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులపైకి కొందరు యువకులు రాళ్లు రువ్వారు. పెట్రో బాంబులు విసిరారు. దీంతో పోలీసులు బాష్పవాయువును ప్రయోగించి నిరసనకారులను చెదరగొట్టారు. ఈ క్రమంలో నలుగురు పోలీసులకు గాయాలయ్యాయని, 12 మంది నిరసనకారులను అరెస్టు చేశామని పోలీసు అధికారులు తెలిపారు. వార్తా సేకరణకు వెళ్లిన ఫొటోగ్రాఫర్ గాయపడగా ఆయనకు ది ఫారిన్ ప్రెస్ అసోసియేషన్ (ఎఫ్‌పీఏ) సంఘీభావం తెలిపింది. హింసపై తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపించాలని, దోషులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

మే 15 నుంచి సరస్వతీ నది పుష్కరాలు

విశాలాంధ్ర- హైదరాబాద్: సరస్వతీ నది పుష్కరాలు మే 15 నుంచి అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలంగాణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ మేరకు పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటి నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డికి కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు. స్నాన ఘట్టాలు, డ్రైనేజీల నిర్మాణం, రోడ్ల విస్తరణకు ఈ నిధులు వినియోగించనున్నారు.

వక్ఫ్ బిల్లుకు 14 సవరణలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపాదనలను మాత్రమే కమిటీ ఆమోదించిందని ప్రతిపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కమిటీ ఒట్టి బూటకమని విమర్శించారు. పాల్ ఒక నియంత వలే ఏకపక్షంగా అన్ని నిర్ణయాలు తీసుకున్నారని దుయ్యబట్టారు. ఇది ప్రజాస్వామ్యానికి బ్లాక్ డే అన్నారు. ప్రజాస్వామిక ప్రక్రియకు తూట్లు పొడిచే విధంగా పాల్ నేతృత్వ బూటకపు కమిటీ పని చేసిందని, తమ గళాన్ని వినిపించుకోలేదని, పాల్ ఓ నియంతలా వ్యవహరించారని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఆరోపించారు. ముసాయిదా శాసనాన్ని భాగస్వాముల్లో 95-98శాతం మంది వ్యతిరేకించినట్లు కాంగ్రెస్ ఎంపీ సయ్యద్ నసీర్ హుస్సేన్ తెలిపారు. 'చైర్మన్‌గానీ, మంత్రిత్వశాఖగానీ సభ్యులకు వివరణ ఇవ్వలేదు. భాగస్వాములతో భేటీ తర్వాత ఏ క్లాజుకు ఆ క్లాజును చర్చించాలి కానీ అలాంటివేమీ జరగలేదు. కీలకాంశాలు మాకు తెలియనివ్వలేదు' అని ఆయన చెప్పారు. చర్చలు... వివరణ లేకుండా ఓటింగ్ నిర్వహించి చిన్నపాటి మార్పులతో బిల్లును ఆమోదించారని హుస్సేన్ దుయ్యబట్టారు. అందుకే దీనిని వ్యతిరేకించాం, బహిష్కరించామని ఆయన చెప్పారు. పాల్ అసలు చర్చలకు అనుమతివ్వలేదని కల్యాణ్ బెనర్జీ తెలిపారు. 'సవరణ తీర్మానాన్ని తెచ్చారు. మమ్మల్ని మాట్లాడనివ్వలేదు. ఆయన (పాల్) ఏకపక్షంగా వ్యవహరించారు. తీర్మానం ప్రవేశం, ఓట్ల లెక్కింపు, ప్రకటన అంతా ఆయనే చూశారు. ప్రతిపక్షాల ప్రతిపాదనలు అన్నింటిని తిరస్కరించారు. వాళ్ల (ఎన్‌డీఏ) ప్రతిపాదనలను మాత్రమే అంగీకరించారు. అన్ని సవరణలను ఆమోదించారు. ఇది ప్రజాస్వామ్యానికి బ్లాక్‌డే' అని బెనర్జీ అన్నారు. కాగా, సమావేశం అజెండాలో పాల్ చివరి నిమిషంలో మార్పులు చేయడాన్ని వ్యతిరేకించిన కమిటీలోని పది మంది విపక్ష సభ్యులు శుక్రవారం ఒక రోజు కోసం సస్పెండైన విషయం తెలిసిందే. ఇండియా ఐక్య సంఘటనతో పాటు జమాతే ఉలేమా ఏ హింద్ సహా ముస్లిం సంఘాలన్నీ వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాయి. మత స్వేచ్ఛకు విఘాలం కలిగించే విధంగా సవరిత బిల్లు ఉన్నట్లు ఆరోపించాయి. మరోవైపు తనపై విపక్ష సభ్యుల ఆరోపణలను పాల్ తోసిపుచ్చారు. ఈ బిల్లుకు సంబంధించిన క్లాజుల్లో ఎన్‌డీఏ సభ్యులు సూచించిన 14 సవరణలను ఆమోదించినట్లు తెలిపారు. మొత్తం 44 క్లాజుల్లో వందల సవరణలను ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించారని, ఓటింగ్‌లో వాటికి మద్దతు లభించలేదని పాల్ చెప్పారు.

పేదల సమస్యలపై ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

గాలొకొదిలి... పేద, బడుగు బలహీనవర్గాలను ఈ ప్రభుత్వం అణగదొక్కుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కడప కలెక్టరేట్ వద్ద పేదల సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలతో కలిసి మహావీర్ సర్కిల్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... ఇళ్లు లేని పేద వారికి పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలం ఇస్తామన్నారు... అదే విధంగా రూ.1.80,000 ఇంటి నిర్మాణానికి సరిపోవని రూ.4లక్షలు ఇస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గత ఐదేళ్లు పాలించిన జగన్ రెడ్డి రాష్ట్రంలో 30లక్షల ఇళ్లు నిర్మిస్తామని రాబోయే కాలంలో ఇంటి స్థలాలు, ఇళ్లు అడిగే పేదవారు లేకుండా చేస్తానని వాగ్దానం చేసి చేతులెత్తేశాడన్నారు. పేదలను మరింత పేదవారిని చేసి గద్దె దిగిపోయాడని విమర్శించారు. తరువాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రెండు సెంట్లు...మూడు సెంట్లు...రూ.4లక్షలు అని చెప్పి... ఇంతవరకు దాని గురించి పట్టించుకున్న పాపానపోలేదన్నారు. టీడీపీ, వైసీపీ కేంద్రానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ఎత్తిన ఎర్రజెండాను దించే ప్రసక్తే లేదన్నారు. కడప గడపలో పేదల కోసం తొలి ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని... ఫిబ్రవరి 10వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి పేదల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు. కడప జిల్లాకు సంబంధించి బద్వేల్ నియోజకవర్గంలో భారీగా భూకబ్జాలు జరిగాయని పోరుమామిళ్లలో గత 15 ఏళ్ల క్రితం కామ్రేడ్ తిరుపతిరెడ్డి పేరుపైన కాలనీలు ఏర్పాటు చేస్తే... వేల మంది నివాసం ఉన్నా ఇంతవరకు వారికి పట్టాలు ఇవ్వలేదన్నారు. ఎక్కడైనా కాలనీలు ఏర్పాటు చేస్తే మౌలిక సదుపాయాలైన మంచినీరు, కరెంటు వంటి వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేదలకు రెండు సెంట్లు మూడు సెంట్లు స్థలం ఇవ్వడానికి సంశయించే ప్రభుత్వం... పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం నియోజకవర్గాల్లో వేల ఎకరాలు కబ్జాలకు గురైనా అతీగతీ లేదని విమర్శించారు. నిరుపేదలైన రైతులకు రెండు నుంచి మూడు ఎకరాల వ్యవసాయ భూమిని తప్పక కేటాయించాలని వారికి కావాల్సిన సదుపాయాలను కల్పించే వరకు ఉద్యమం ఆగదన్నారు. ఫ్రీహోల్డ్‌లో ఉన్న భూములను తప్పించి వాటిని రాజకీయ నాయకులు పంచుకోవాలని చూస్తున్నారని అది నెరవేరదన్నారు. పేదల పోరాటానికి ఎవరైనా అడ్డు తగిలితే ఎదురొడ్డి పోరాడడానికి ఎర్రజెండా ఎప్పుడు భయపడదని ఆయన హెచ్చరించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రాయలసీమ, ఉత్తరాంధ్ర మొదలుకొని పేదలకు చెందాల్సిన భూములను వారికి చేర్చే వరకు ఎర్రజెండా పోరాటం ఆగదని దీనికి అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కడప జిల్లాలో జరిగిన భూ ఆక్రమణలు ఎక్కడా జరగలేదని వాటన్నింటిని పోరాటాల ద్వారా మెడలు వంచి వెనక్కు తెస్తామని ధీమా వ్యక్తం చేశారు. పులివెందుల నియోజకవర్గంలో 400 ఎకరాలు కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రిలో 500 ఎకరాలు ఇలా లెక్కలేనన్ని ఎకరాలు కబ్జాలకు గురవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పేదలు 2 సెంట్లు 3 సెంట్లు అడిగితే లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కడప గడపలో ప్రారంభమైన ఈ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతాయని అప్పటికీ పాలకులు కన్ను తెరవకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య, ఎల్.నాగసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, వీరశేఖర్, వేణుగోపాల్, చంద్రశేఖర్, విజయలక్ష్మీ, శ్రీరాములు, సుబ్బరాయుడు, బాదుల్లా, గంగాసురేష్, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ బాదుడు!

ఏపీలో 1వ తేదీ నుంచి భూమి విలువల పెంపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రిజిస్ట్రేషన్ చార్జీల బాదుడుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఫిబ్రవరి 1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగిపోనున్నాయి. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. దీని ఆధారంగా 15 నుంచి 20 శాతం వరకు రిజిస్ట్రేషన్ చార్జీలు ప్రాంతాల వారీగా పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో కొన్ని చోట్ల చార్జీల తగ్గుదల, మరికొన్ని చోట్ల పెరుగుదల లాంటి హెచ్చుతగ్గులు ఉంటాయి. రాజధాని పరిధిలోని అమరావతిలో 29 గ్రామాల్లో మాత్రం భూముల విలువ పెంపును ప్రభుత్వం మినహాయించింది. విజయవాడ, భోగాపురం పరిసర ప్రాంతాల్లో భూముల విలువలు పెరగనున్నాయి. దీని ప్రభావంతో భూములతో పాటు నిర్మాణాల విలువలు పెంపు నిర్ణయానికి జాయింట్ కలెక్టర్ల కమిటీలు ఆమోదించాయి. రాష్ట్రంలో గ్రోత్ సెంటర్లుగా ఉండి, మార్కెట్ విలువ 10 రెట్లు అదనంగా ఉన్న ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువలు పెరుగుతాయి. కొన్ని ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువలు అక్కడి మార్కెట్ విలువ కన్నా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో విలువలు తగ్గుతాయి. ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన వెంటనే వచ్చే నెల ఒకటో తేదీ నుంచే పెంచిన రిజిస్ట్రేషన్ చార్జీలను ప్రభుత్వం వసూలు చేయనుంది. ఈ నిర్ణయంతో నివాస, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల విలువ భారీగా పెరగనుంది. దీంతో క్రయ, విక్రయ దారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే డిమాండ్ ఉన్న ఏరియాల్లో భూముల విలువ ఆధారంగా రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుపై సమగ్ర నివేదిక అందించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. భూముల మార్కెట్ విలువ, బుక్ విలువ మధ్య బాగా ఎక్కువ తేడాను ప్రభుత్వం గుర్తించింది. దీంతో బుక్ విలువ పెంచి... రిజిస్ట్రేషన్ రేట్లు నిర్ణయించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్, ఇతర అభివృద్ధి అవసరాల కోసం నిబంధనలు మరింత సులభతరం చేయనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది జనవరి నుంచే రిజిస్ట్రేషన్ల చార్జీల పెరుగుతాయన్న ప్రచారం వచ్చింది. దీంతో గత ఏడాది డిసెంబరులో పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్లు కొనసాగాయి. ఆ తర్వాత భూముల విలువల పెంపు ఫిబ్రవరికి వాయిదా పడింది.

సీఎం చంద్రబాబు ఆమోదం అనంతరం రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు విలువలపై అధికారికంగా ఉత్తర్వులు వెలువడతాయి. దీనిపై పూర్తి కసరత్తు జరకపోతే మరికొన్ని రోజులు వాయిదా పడే అవకాశం ఉంది. ఎన్నికల ముందు ప్రజలపై ఎలాంటి భారాలో మోపబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం... ఇప్పుడు రిజిస్ట్రేషన్ చార్జీల బాదుడుకు రంగం సిద్ధం చేసిందన్న విమర్శలున్నాయి. అయితే రాష్ట్రాభివృద్ధికి అవసరమైన రెవెన్యూ ఆదాయం కోసం రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచుతున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

ఫిబ్రవరి 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు : మంత్రి సత్యప్రసాద్

ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలులోకి వస్తాయని, దీనికి సంబంధించి ఇప్పటికే సుదీర్ఘ కసరత్తు చేశామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. రాజధాని గ్రామాల్లో మాత్రం రిజిస్ట్రేషన్ విలువల్లో ఎలాంటి మార్పు ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు.

ఏపీలో తెల్లకార్డుంటే...ఇంటి స్థలం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : దారిద్ర్య రేఖకు దిగువున (బీపీఎల్) పేద కుటుంబాల అందరికీ ఉచిత ఇంటి స్థలం ఇవ్వాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెల్ల కార్డు కలిగిన వారందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా సోమవారం జీవో నంబరు-23 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా అందరికీ ఇళ్లు ప్రాతిపదికన కేటాయించిన స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం కన్వేయన్స్ డీడ్ ఇస్తుందని వెల్లడించారు. 10 ఏళ్ల కాల పరిమితితో ఫ్రీ హోల్డ్ హక్కులను కల్పించేలా ఈ కన్వేయన్స్ డీడ్ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఏపీ ఎస్‌హెచ్‌సీఎల్ అన్ని జిల్లా కలెక్టర్‌లకు కమ్యూనికేట్ చేయాలని ఆదేశాలు జారీ

అయ్యాయి. జీవిత కాలంలో ఒక్కసారే ఉచిత ఇంటి పట్టా ఇచ్చేలా విధివిధానాలు రూపొందించారు. ఇంటి పట్టా ఇచ్చిన రెండేళ్లలోగా ఇంటి నిర్మాణం చేపట్టాలన్న నిబంధన విధించారు. లబ్ధిదారులకు రాష్ట్రంలో ఎక్కడా నివాస స్థలం, లేదా సొంత ఇల్లు ఉండకూడదని నిబంధనల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఏ గృహ నిర్మాణ పథకంలోని లబ్ధిదారులు దీనికి అర్హులు కాదని తెలిపింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో అందరికీ ఇళ్లు పథకం కింద పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున ఇళ్ల పట్టాల పంపిణీపై చర్చించిన విషయం విదితమే. ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకుగాను మార్గదర్శకాల జారీకి మంత్రివర్గం ఆమోదించింది. గత ప్రభుత్వం పేదలకు సెంటు స్థలంలో ఇల్లు కట్టి ఇచ్చేలా ప్రణాళిక చేసిన విషయం తెలిసిందే. సెంటు స్థలం ఇంటి నిర్మాణానికి ఏ మాత్రం సరిపోదని గ్రామాల్లో పేదలకు 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేబినెట్‌లో చర్చలు జరిపిన అనంతరం అందరికీ ఇళ్ల పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అందరికీ ఇళ్ల కార్యక్రమం నిర్వహణకుగా రెవెన్యూ శాఖ మంత్రి చైర్మన్‌గా, పురపాలక, గృహ నిర్మాణ శాఖ మంత్రి, ఇతర ఉన్నతాధికారులు సభ్యులుగా ఏర్పాటయిన ఈ కమిటీ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తుందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కోసం అధికారుల కమిటీని నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

రాజ్యాంగం లేకుంటే ఎవరూ మిగలరు

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంటులో ఒక చట్టాన్ని తీసుకువస్తుందని గాంధీ నొక్కి చెప్పారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్రం బిలియనీర్ల కోసం పని చేస్తోందని ఆరోపిస్తూ, ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని. దేశ సంపదను కొంతమంది ఆశ్రిత పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారని, దళితులు, వెనుకబడినవారు, గిరిజనులు, పేదలు మరోసారి బానిసలుగా మారుతున్నారని తెలిపారు. 'దేశంలో స్వాతంత్ర్యానికి ముందు లాంటి పరిస్థితిని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కోరుకుంటున్నాయి. అక్కడ పేదలకు ఎటువంటి హక్కులు లేవు. ధనికులకు మాత్రమే హక్కులు ఉన్నాయి' అని గాంధీ అన్నారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తోందన్నారు. అందుకే గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికల్లో వారు '400 పార్' నినాదాన్ని ఇచ్చారని అన్నారు. 'మన రాజ్యాంగం మారిన రోజు, వెనుకబడిన వారికి, దళితులకు, గిరిజనులకు దేశంలో ఏమీ మిగలదు' అని గాంధీ ర్యాలీలో అన్నారు. అదానీ, అంబానీ లాంటి వాళ్లకు దేశ సంపదను దోచి పెడుతోన్నారంటూ ప్రధాని మోదీపై ఆయన మండిపడ్డారు. రాజ్యాంగం లేకుంటే దేశంలో ఎవరూ మిగలరని ఆయన పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు జీతు పట్వారీ మాట్లాడుతూ... ప్రజల హక్కులు.. మరి ముఖ్యంగా 'భావ ప్రకటనా స్వేచ్ఛ'ను కాపాడటంతోపాటు రాజ్యాంగాన్ని రక్షించడమే లక్ష్యంగా చేసుకొని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశాన్ని నిరంతరం ప్రజల మధ్యకు తీసుకు వెళ్తామన్నారు. మరోవైపు స్వాతంత్ర్య సమరయోధులను అవమానించడం...రాజ్యాంగాన్ని బలహీన పరుస్తోందంటూ బీజేపీపై కాంగ్రెస్ పార్టీ నేతలు తరచూ ఆరోపణలు గుప్పిస్తున్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను సైతం బీజేపీ నేతలు అవమానిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఈ అంశాన్ని ప్రజల మధ్యకు బలంగా తీసుకు వెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపట్టింది. అందులోభాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఆ క్రమంలో గ్రామాలు, మండలాలు, జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించి... ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా చొచ్చుకు వెళ్లేలా ఆ పార్టీ అడుగులు వేస్తోంది. కాగా జనవరి 26వ తేదీ 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్.. బీఆర్ అంబేద్కర్ జన్మించిన మోవ్‌ను సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని పరోక్షంగా విమర్శించారు. కొంత మందికి బీఆర్ అంబేద్కర్ జన్మస్థలం మోవ్ పర్యాటక ప్రాంతమైందంటూ ఆయన వ్యంగ్యంగా పేర్కొన్నారు.

ఇక మోవ్‌లో రాహుల్ గాంధీ ప్రసంగించే సభలో రాజకీయ ప్రసంగాలపై స్థానిక జిల్లా యంత్రాంగం ఆంక్షలు విధించడంపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అప్రజాస్వామికమని ఖండించారు.

జగన్ కేసుల బదిలీకి నిరాకరణ

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించిందని... కోర్టుకు జగన్ న్యాయవాది ముకుల్ రోహత్గి చెప్పారు. దీనికి న్యాయమూర్తులు స్పందిస్తూ, గతంలో సుప్రీం కోర్టు ఎమ్మెల్యే, ఎంపీల కేసుల విషయంలో ఇచ్చిన తీర్పు ఈ కేసుకూ వర్తిస్తుందని స్పష్టం చేశారు. ట్రయల్ కోర్టు రోజు వారీ విచారణకు తీసుకోవాలని, హైకోర్టు పర్యవేక్షణ చేయాలని, అందువల్ల మరో రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని తెలిపింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ మాత్రం జరగడం లేదని రఘురామ కృష్ణరాజు న్యాయవాది వాదించారు. కేవలం శుక్రవారం, శనివారం మాత్రమే విచారణ చేపడుతున్నారని ధర్మాసనానికి వివరించారు. పదేళ్లుగా ఒక్క డిశ్చార్జ్ పిటిషన్ పరిష్కారానికి నోచుకోలేదని రఘురామ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేసుల విచారణ వేగంగా జరగడం లేదని, అందుకే బదిలీ కోరడం జరిగిందన్నారు. పదేళ్ల క్రితం తెలంగాణ ఏర్పాటయిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు కేసులో ఒక్క అడుగు ముందుకు కదలలేదని, డిశ్చార్జ్ పిటిషన్ల విషయంలో ఆర్డర్ రిజర్వ్ చేసిన తర్వాత తీర్పు రాకుండానే జడ్జీలు ఆరు సార్లు బదిలీ అయ్యారని న్యాయవాది తెలిపారు. అయితే హైకోర్టు పర్యవేక్షిస్తున్నందున ఈ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సి అవసరం లేదని, త్వరితగతిన ఈ పిటిషన్‌పై విచారణ జరపాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

ఉపాధి కూలీ విలవిల

(మొదటిపేజీ తరువాయి)

వస్తువుల సరఫరాకు స్థానిక వ్యాపారులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా పనికి ఆటంకం కలుగుతోంది. 2024 తాత్కాలిక బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకం కోసం రూ.86వేలను కేంద్రం కేటాయించింది. గ్రామీణాభివృద్ధి శాఖ అనేకసార్లు విన్నవించినా, నిధుల కొరత ఉందని తెలిసినా ఈ పథకానికి బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ పెంచలేదు. దీంతో కేంద్రంపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఇది డిమాండు ఆధారిత పథకమని, అవసరమైనప్పుడు అదనపు కేటాయింపులు చేస్తామని వివరణ ఇచ్చుకుంది. 2020-21లో కోవిడ్ మహమ్మారి వేళ చాలా మంది పట్టణాల నుంచి గ్రామాలకు తిరిగి వచ్చారు. దీంతో ఉపాధి హామీ పనులకు డిమాండ్ పెరిగింది. తొలుత రూ.61,500 కోట్లను ఈ పథకం కోసం కేటాయించగా... డిమాండ్ దృష్ట్యా దానిని రూ.1,11,500 కోట్లకు పెంచింది. ఇప్పటివరకు ఈ మేరకు పెంపుదల ఎన్నడూ జరగలేదు.

నిధుల కొరత వల్ల ఉపాధి పనుల డిమాండ్‌ను కృత్రిమంగా అణిచివేస్తున్నారన్నది నిపుణుల అభిప్రాయంగా ఉంది. కాగా, 2024 ఫిబ్రవరిలో ఇచ్చిన నివేదికలో ఈ సమస్య గురించి గ్రామీణాభివృద్ధిపై పార్లమెంటరీ స్థాయి సంఘం పేర్కొంది. బడ్జెట్ అంచనాల సమయంలోనే నిధుల కొరత వల్ల అనేక అంశాలు ప్రభావితం అవుతున్నాయని వెల్లడించింది. సమయానికి వేతనాలు చెల్లించలేకపోవడం, సామాగ్రిని సమకూర్చలేకపోవడంతో ఈ పథకం పురోగతి దెబ్బతింటున్నట్లు స్థాయి సంఘం పేర్కొంది. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పథకం సజావుగా సాగాలంటే సముచిత నిధులు అవసరమని, అవి లేకపోవడంతో ఈ పథకం నీరుగారుతోందని నివేదికలో పార్లమెంటరీ స్థాయి సంఘం నొక్కిచెప్పింది.

ఉదయనిధికి సుప్రీంలో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

సెప్టెంబరులో తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని, ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకమని అన్నారు. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారడంతో ఎవరి మనోభావాలు దెబ్బతీసే ఉద్దేశం తనకు లేదని ఉదయనిధి చెప్పారు. అయినప్పటికీ ఆయనపై క్రిమినల్ చర్యలు కోరుతూ సుప్రీంలో పిటిషన్లు దాఖలయ్యాయి.

సీఎం సిద్ధరామయ్య భార్యకు ఈడీ సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

కింద దర్యాప్తు లేదా విచారణకు సంబంధించి సాక్ష్యం ఇవ్వడానికి, రికార్డులను సమర్పించడానికి పార్వతి హాజరు అవసరమని తాను భావిస్తున్నట్లు మురళీకన్నన్ చెప్పారు. ముడా స్థల కేటాయింపు కేసులో మైసూరులోని ఒక ఖరీదైన ప్రాంతంలో సిద్ధరామయ్య భార్యకు పరిహార స్థలాలు కేటాయింపు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ముడా... ఆమె భూమిని కొనుగోలు చేసిన ప్రాంతం కంటే ఇది ఎక్కువ ఆస్తి విలువను కలిగి ఉంది. పార్వతికి 3.16 ఎకరాల భూమికి బదులుగా 50:50 నిష్పత్తి పథకం కింద ప్లాట్లను కేటాయించిన ముడా, అక్కడ నివాస లేఅవుట్‌ను అభివృద్ధి చేసింది. వివాదాస్పద పథకం కింద, నివాస లేఅవుట్ల ఏర్పాటు కోసం వారి నుంచి సేకరించిన అభివృద్ధి చేయని భూమికి బదులుగా, భూమిని కోల్పోయిన వారికి ముడా 50 శాతం అభివృద్ధి చేసిన భూమిని కేటాయించింది. అయితే మైసూరు తాలూకాలోని కసబా హుబ్లీలోని కసరే గ్రామంలోని సర్వే నంబరు 464 వద్ద ఉన్న ఈ 3.16 ఎకరాల భూమిపై పార్వతికి చట్టబద్ధమైన హక్కు లేదని ఆరోపణలు వచ్చాయి. లోకాయుక్తతో పాటు ఈడీ ఈ విషయాన్ని ఏకకాలంలో పరిశీలిస్తున్నాయి.

జాతరను ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

విశాలాంధ్ర - కొమురం భీం : జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం జాతర వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఈనెల 11 నుండి 13 వరకు జరగనున్న శ్రీశ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం జాతర ఉత్సవాల సంబంధిత ఆహ్వాన పత్రికలు, గోడ ప్రతులను దేవాదాయ శాఖ అధికారులు, నాయకులు, కమిటీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతర ఉత్సవాల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని, భక్తులకు ఎలాంటి అసౌ కర్యం కలగకుండా సదుపాయాల కల్పనకు అధికారులు, కమిటీ ప్రతినిధులు సమన్వయంతో కృషి చేసి, జాతరను విజయవంతం చేయాలని తెలిపారు.

ప్రతిఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలి : ఎస్సై

విశాలాంధ్ర - గార్ల : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రమాదాలకు తావు లేకుండా బాధ్యతగా మెలగాలని ఎస్సై రియాజ్ పాషా అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశంతో మాసోత్సవాల సందర్భంగా గార్ల పట్టణ పురవిధుల్లో పోలీసులు హెల్మెంట్ ధరించి ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రహదారులు నీడనిచ్చే చెట్లతో మెరిసిపోవాలి కానీ నిర్లక్ష్యపు నీడలో రక్తపు మరకలతో తడిసిపోవద్దన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ తమ కుటుంబాలను తలుచుకుంటూ వివేచనతో వాహనాలను నడపాలని కోరారు. మద్యం మత్తులో డ్రైవింగ్, రాంగ్ రూట్, ట్రిపుల్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చెయ్యొద్దని సూచించారు. లైసెన్స్ లేకుండా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రమాదాల గురికావద్దన్నారు. ఈ ర్యాలీలో హెడ్ కానిస్టేబుల్ శ్యామ్, పోలీస్ సిబ్బంది నాగరాజు, సిరాజ్ పాషా, విష్ణు, సుధాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇమ్దాదుల్ ఉలూమ్ క్యాలెండర్ ఆవిష్కరించిన నయీమ్ ఖురేషి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : మదర్సా అలా అరబియా ఇమ్దాదుల్ ఉలూమ్ క్యాలెండర్‌ను రాష్ట్ర మైనార్టీ నాయకులు, కొత్తగూడెం ఉర్దూగర్ అధ్యక్షులు నయీమ్ ఖురేషి ఆవిష్కరించారు. స్థానిక ఓల్డ్ డిపోలోని ఖురేషి కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ క్యాలెండర్ ను ముస్లిం సోదరుల అరబిక్ నెలలు, పండగలు ముఖ్య ప్రస్థానాలను ఇందులో పొందుపరిచారని ఖురేషి తెలిపారు. మరిపెడ బంగ్లా, మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాలో గల మదర్సా అరబియా ఇమ్దాదుల్ ఆధ్వర్యంలో ఈ క్యాలెండర్ ఏర్పాటు చేసారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉర్దూఘర్ సెక్రెటరీ షరీఫ్, ముస్లిం నాయకులు జావిద్, హమీద్, అన్వర్, జమల్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : గిరిజనుల వ్యవసాయాభివృద్ధి కోసం ప్రభుత్వం సాగునీటి సౌకర్యం కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాష కోరారు. లక్ష్మీదేవిపల్లి మారు మూల ఏజెన్సీ గ్రామాల పోడు రైతులకు సాగునీటి సౌకర్యంతోపాటు విద్యుత్ లైన్లు, మోటార్లు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలోని లక్ష్మిపురం, బొజ్జలగూడెం, చింతకుంట గ్రామ పంచాయతీల్లో ఆయన సోమవారం పర్యటించారు. పోడు రైతుల సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు వినతిపత్రం అందించి ఐటిడిఎ అధికారులకు రైతుల సమస్యను ఆయన వివరించారు. సాగునీటి సౌకర్యం లేక పంటలు వెయ్యక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలి పారు. సుమారు 120 మంది గిరిజన రైతులు విద్యుత్ లైన్లు, బోర్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఏర్పాటు చేయాలనీ సాబీర్ కోరారు. ఆయన వెంట మండల నాయకులు దార శ్రీనివాస్, వర్స రామస్వామి, జోగా రామయ్య, కంటెం సత్యనారాయణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడిన విద్యుత్ ఏఈ

విశాలాంధ్ర బ్యూరో -మెదక్ : గత కొన్ని రోజులుగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మెదక్ జిల్లా కళ్ళకల్ విద్యుత్ ఏఈ క్రిష్ణ ఏసీబీకి చిక్కాడు. సోమవరం మెదక్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి ఏఈ కృష్ణను ట్రాప్ చేసి పట్టుకున్నారు. 20వేల రూపాయలతో పట్టుబడినట్లు డిఎస్పి తెలిపారు. స్థానిక పరిశ్రమకు 3 ఫేజ్ విద్యుత్ సరఫరా ఏర్పాటుకు ఒక వ్యక్తి నుండి యాభై వేల రూపాయలు డిమాండ్ చేయగా 30 వేలకు ఒప్పందం కుదిరింది. ఒప్పందం మేరకు ఏఈ కృష్ణకు ఈ నెల 18వ తేదీన బాధితుడు అడ్వాన్స్ గా 10 వేలు చెల్లించాడు. అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా సోమవారం మరో 20 వేల రూపాయలు ఏఈకి చెల్లించగా ఏసీబీ అధికారులు రైడ్ చేసి ఏఈ కృష్ణను పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి తెలిపారు. ఏసీబీ తనిఖీలలో ఇన్స్పెక్టర్ లు వెంకటేష్, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

జాకబ్ విగ్రహానికి శంకుస్థాపన

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: ప్రజా నాట్యమండలి కళాకారుడు, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ జాతీయ నాయకులు అమరజీవి జాకబ్ విగ్రహ ప్రతిష్టాపన కొరకు సోమవారం గోదావరిఖని న్యూ అశోక్ టాకీస్ ముందు సామూహిక శంకుస్థాపన చేశారు. ప్రజానాట్యమండలి గాయకుడు కవ్వంపల్లి స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, నాయకులు దీటి బాలరాజు, పి.శ్రీనివాస్, అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, ఇప్టా జాతీయ కౌన్సిల్ సభ్యులు కన్నం లక్ష్మి నారాయణ వందన సమర్పణ చేశారు. ఆర్జీ 2 బ్రాంచి కార్యదర్శి జీగురు రవిందర్, అంబెద్కర్ సంఘం నాయకులు మైస రాజేశ్, సాంస్కృతిక కళా విభాగం గాయకురాలు ఈదునూరి పద్మ, టీబిజికెఎస్ నాయకులు మాదాసు రాంమూర్తి, సిపిఐ నగర కార్యదర్శి కే.కనకరాజులు మాట్లాడుతూ జాకబ్ కళా రంగానికి,గోదావరిఖని పారిశ్రామిక ప్రాంత ప్రజలకు, కార్మిక వర్గానికి చేసిన సాంస్కృతిక సేవలను కొనియాడారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ఈనెల 29 నుండి ఫిబ్రవరి 22 వరకు, అలాగే మార్చి 5 నుండి మార్చి 25 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షల నిర్వహణపై సోమవారం ఆమె ప్రజావాణి కార్యక్రమం అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సంవత్సరం నిర్వహించనున్న ఇంటర్మీడియట్ రెగ్యులర్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల సందర్భంగా ప్రతి ల్యాబ్‌లో తప్పనిసరిగా 2 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు ల్యాబులలో ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుందని, ప్రైవేటు కళాశాలల్లో నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు ల్యాబులలో తప్పనిసరిగా యాజమాన్యాలు ఏర్పాటు చేయాలని ఒక వేళ లేనట్లయితే ఆ కళాశాలలకు ప్రాక్టికల్, థియరీ పరీక్షల కేంద్రాలను రద్దు చేయడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. ఈనెల 29న ఎథికల్, హ్యూమన్ వాల్యూస్ ఎగ్జామినేషన్, 30న ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్, ఈనెల 31, ఫిబ్రవరి 1న ఇంగ్లీష్ ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ పరీక్షలు ఉంటాయని తెలిపారు.

ఫిబ్రవరి 3 నుండి 22 వరకు ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ప్రతిరోజు రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులకు రెండు పూటల ఉదయం 9 నుండి 12 వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించను న్నట్లు ఆమె తెలిపారు. పరీక్షల నిర్వహణకు జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. అలాగే మార్చి 5 నుండి 25 వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలకు కూడా ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, తాగునీరు, బందోబస్తు, జిరాక్స్ కేంద్రాల మూసివేత, 144వ సెక్షన్ విధింపు, తదితర విషయాలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దశ్రునాయక్, జిల్లా పరిశ్రమల అధికారి కోటేశ్వరరావు, గృహ నిర్మాణశాఖ పీడీ రాజకుమార్, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డిఓ వై.అశోక్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

కేసుల విచారణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: పోలీస్ స్టేషన్లో వచ్చే కేసుల విషయంలో నిర్లక్ష్యం, జాప్యం చేస్తే సహించేది లేదని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అధికారులను హెచ్చరించారు. బాధ్యతారహితంగా వ్యవహరించే అధికారులపై ఇకనుంచి క్రమశిక్షణా చర్యలు తప్పవని ఎస్పీ వార్నింగ్ ఇచ్చారు. సోమవారం జరిగిన నేర సమీక్షా సమావేశంలో ఆయన పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడేలా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలన్నారు. అప్పుడే ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం, గౌరవభావం ఉంటుందన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నిషేధిత గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమరవాణా, మట్కా జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉండాలని కోరారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా నిర్లక్ష్యం చేసే పాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్, డిఎస్పీలు రెహమాన్, సతీష్ కుమార్, చంద్ర భాను, రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, సిఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ బీమాను ఉపయోగించుకోండి

పొలిట్ బ్యూరో సభ్యులు నరసింహులు

విశాలాంధ్ర - ఇల్లందు : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి రూ. లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని అదేవిధంగా సభ్యులుగా చేరిన వారికి పార్టీ అండగా ఉంటుందని పోలిట్ బ్యూరో సభ్యులు మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు తెలిపారు. ఇల్లందు ఆ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు సభ్యత్వ కార్డులు సోమవారం అందించారు. కార్యకర్తల కోసం ఎంతో ఆలోచించి ఈ ప్రక్రియను మొదలు పెట్టినట్లు చెప్పారు. ఇప్పటికే కోటి పైగా సభ్యత్వాలు పూర్తి చేసుకొని ముందుకు సాగుతుందన్నారు. తెలంగాణలో తమ పార్టీ క్రియాశీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ఇల్లందులో ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో సభ్యత్వాలు గత పదేళ్ల కంటే ఎన్నడు లేని విధంగా భారీ స్థాయిలో జరుగుతున్నట్లు అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎన్టీఆర్ చేసిన అభివృద్ధి ఈరోజుకు గ్రామాల్లో కనిపిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ కొండపల్లి రాంచందర్‌రావు, ముద్రగడ వంశీ, చాందావత్ రమేష్ బాబు, ప్రేమ్ చంద్ వ్యాస్, చిలిమేల బాబు, శ్యామ్ తీవరి, నర్సన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పెనుబల్లి : పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రి నీ సత్తుపల్లి శాసన సభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పేషెంట్స్‌కి అందిస్తున్న చికిత్స, సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రిలోని వైద్యులతో చర్చించి వైద్య సేవలను గురించి అడిగి తెలుసు కున్నారు. ఆసుపత్రిలో పలు రకాల రికార్డులను తనిఖీ చేశారు. నూతన వాటర్ ట్యాంక్, వాటర్ పైప్లు ఏర్పాటు వెంటనే పూర్తి చేయాలని మండల అధికారి అన్నపూర్ణను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ప్రధాన వైద్యుడు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ అనిత, డాక్టర్ బి.యన్.రెడ్డి, డాక్టర్ వరుణ్ కుమార్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ స్రవంతి, డాక్టర్ విజ్ఞ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుడి పూరిల్లు దగ్ధం..

విశాలాంధ్ర - చర్ల : మండల పరిధిలోని ఉంజుపల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో గిరిజనుడి పూరిల్లు దగ్ధమైంది. బాధితుడు ఇరప ముత్తయ్య చెప్పిన వివరాలప్రకారం తెల్లారు 4 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. కుటుంబంతో గాఢ నిద్రలో ఉండగా పక్కింటి వారు కేకలు వేయడంతో నిద్రలేచి భయంతో బయటికి వచ్చామన్నాడు. లేకుంటే కుటుంబం మొత్తం అగ్నికి ఆహుతి వాళ్ళమన్నాడు. అప్పటికే ఇంటి చుట్టూ మంటలు అంటుకున్నట్లు చెప్పాడు.తమ బంగారం, వెండి ఆభరణాలు, ఫర్నిచర్ తన కుమారుడు దిలీప్ పది, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లు కూడా కాలిపోయాయన్నాడు. సిఐ రాజు వర్మ ఆ సమయంలో వెంటనే స్పందించి ఫైర్ ఇంజన్ రప్పించారని అప్పటికే ఇల్లు మొత్తం కాలిపోయిందన్నాడు. మండల కేంద్రంలో అగ్నిమాపకేంద్రం ఇలాంటి పరిణామాలకు కారణమవుతుందని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు, దొడ్డి హరి నాగ వర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ముత్తయ్యకు ఇందిరమ్మ ఇల్లు వెంటనే మంజూరు చేసి ఆదుకోవాలని అధికారులను కోరారు. ప్రతి ఏటా వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరిగి గిరిజనుల పూరి గుడిసెలు కాలిపోయి అనేక కుటుంబాలకు నష్టం జరుగుతుందని వెల్లడించారు.

గ్రామ సమాఖ్య భవనం ప్రారంభించిన సీపీఐ నేత సాబీర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : మహిళలు ఆర్థిక సాధికారిత వైపు పురోగతి సాధించినప్పుడే కుటుంబాల్లో ఆర్థిక వెసులు బాటు కలుగుతుం దని సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాష అన్నారు. చుంచుపల్లి లోని విధ్యానగర్లో దాతల సహకారంతో నిర్మించిన వెలుగు కిరణం గ్రామా సమాఖ్య కార్యాలయాన్ని సోమవారం అయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా తమ నైపుణ్యాలతో అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా బలపడాలని సూచించారు. సమాఖ్య ద్వారా బ్యాంకు రుణాలు పొంది వృధా ఖర్చులు చేయకుండా ఏదో ఒక వ్యాపారాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని కోరారు. బ్యాంకులు సకాలంలో రుణాలు మంజూరు చేసి మహిళా సంఘాలను ప్రోత్సహించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో నియోజకవర్గం ఎన్నడు లేని విధంగా వేగంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందన్నారు. అనంతరం సమాఖ్య సభ్యులు సాబీర్ పాషను పూలమాలలు వేసి శాలువాతో ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వాసిరెడ్డి మురళి, నాయకులు దాతలు వర్ధన్ రావు, శ్యామ్, కృష్ణ, కృష్ణమూర్తి, నాగేశ్వర్ రావు, రాంబాబు, మని, రామకృష్ణ, ప్రభ, సామినేని రామారావు, మాగోరెడ్డి, రాణి, ప్రసాద్, వివిధ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న చింతపల్లి

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : హైదరాబాద్లోని నారాయణగూడ భారతి డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ 92వ జయంతి సందర్భంగా దేవరకొండ మండలం కొమ్మపల్లి గ్రామానికి చెందిన సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్‌కు ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ రాష్ట్ర స్థాయి అవార్డును సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, అరుణోదయ విమలక్క అధ్యక్షులు కోరే సాయిరాం చేతులమీదుగా అవార్డును అందించారు. ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ జయంతి సందర్భంగా గత 25 సంవత్సరాల నుండి సమాజ సేవలను గుర్తించి కొంతమందిని తెలంగాణ అమరవీరుల ఆశయ సాధన రాష్ట్ర కమిటీ ఎంపిక చేశారు అవార్డు అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సినీ రచయిత రఫీ, మాస్టర్ జి తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ నాయకులు శంకర్ నాయక్ మృతికి నివాళి

విశాలాంధ్ర - కారేపల్లి : సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు గుగులోతు శంకర్ నాయక్ హార్ట్ ఎటాక్‌తో ఆదివారం రాత్రి అకాల మరణం చెందారు. మండల పరిధిలోని భాగ్యనగర్ తండా గ్రామానికి చెందిన గుగులోతు శంకర్ నాయక్ అకాల మరణం చెందారని విషయం తెలుసుకున్న సిపిఐ పార్టీ జిల్లా నాయకులు ఎర్ర బాబు మృతదేహంపై పుష్పగుచ్ఛ ఉంచి స్థానిక నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎర్రబాబు మాట్లాడుతూ సింగరేణి మండలంలో సిపిఐ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషిచేసిన నేతాలలో శంకర్ నాయక్ ఒకరిని ఆయన మృతి పార్టీకి తీరని లోటని గుర్తు చేశారు. అలాగే శంకర్ నాయక్ కుటుంబ సభ్యులను ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

చెరువుగట్టుజాతర పారిశుధ్య పనులకు టెండర్ పక్రియ ప్రారంభం

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్లగొండ జిల్లా పరిధిలో ఈ నెల 02-02-2025 నుండి 09-02-2025 వరకు జరుగు శ్రీశ్రీశ్రీ జడల రామలింగేశ్వర స్వామి జాతర,చెరువుగట్టు, నార్కెట్ పల్లి మండలము యందు పారిశుధ్య పనులు చేపట్టుటకు గాను టెండర్ పిలుస్తున్నట్లు మునేష్, జూనియర్ అసిస్టెంట్, జిల్లా పంచాయతి కార్యాలయం నల్లగొండ ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమగు మెటీరియల్ అనగా బ్లీచింగ్ పౌడర్, సున్నం పౌడర్ బస్తాలు, ఫినాయిల్, చెత్త బుట్టలు (చిన్నవి, పెద్దవి), ముఖానికి మాస్క్ లు, చేతికి గ్లౌజులు, టీ-షర్ట్ (తెల్లనివి), చీపుర్లు, చీపురు కట్టలు, త్రాగు నీటికి అవసరమగు గ్లాసులు (స్టీల్), జగ్గులు, నీటి నిల్వ కోసం డ్రమ్ములు, బకెట్లు, మగ్గులు కొనుగోలు చేయుటకు, క్యాటరింగ్, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయుటకు గాను ఆసక్తి గల వారి నుండి బిడ్స్ కోరబడుచున్నవి అని అన్నారు.కావున, ఆసక్తి గల వారు, వారి యొక్క ఫర్మ్ లెటర్ పాడ్ (జి ఎస్ టి నెం.) తో పాటు వ చూపిన సమాచారంతో కూడిన కొటేషన్లను తేది 29-01-2025 నాటి మధ్యాహ్నం 03:00 గంటల వరకు జిల్లా పంచాయతి అధికారి వారి కార్యాలయం, నల్లగొండ యందు సమర్పించుటకు కోరనైనది. (9014643085) సంప్రదించాలన్నారు.

సైబరాబాద్‌లో స్ట్రాబెర్రీ మూడు రోజుల వేడుక

విశాలాంధ్ర-హైదరాబాద్ : ఇనార్బిట్ మాల్ సైబరాబాద్ ఇటీవలే ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్ట్రాబెర్రీ ఫెస్ట్‌ను ముగించింది. ఇది జనవరి 24 నుండి 26, 2025 వరకు జరిగింది. ఈ ఉత్సవం మూడు రోజుల పాటు బెర్రీల రుచి, ఉత్సాహభరితమైన వినోదం, ఉత్తేజకరమైన కార్యకలాపాలను అందించింది, ఆహార ప్రియులు, సంగీత ప్రియులు, కుటుంబాలకు నిజంగా మరపురాని వేడుకగా ఈ స్ట్రాబెర్రీ ఫెస్టివల్ స్ట్రాబెర్రీ వేడుక జరుపుకుంది.

దేశంలో 11వ స్టోర్‌ను ప్రారంభించిన అపెరల్ గ్రూప్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాదులోని నెక్సస్ మాల్‌లో సరికొత్త విక్టోరియా సీక్రెట్ బ్యూటీ స్టోర్‌ను ప్రారంభిస్తున్నట్లు అపెరల్ గ్రూప్ వెల్లడించింది. ఇది భారతదేశంలో 11వ విక్టోరియా సీక్రెట్ స్టోర్‌గా నిలుస్తుంది. దేశంలో బ్రాండ్ కార్యకలాపాలను వినియోగదారులకు ప్రపంచ స్థాయి షాపింగ్ అనుభవాన్ని అందించడంలో అపెరల్ నిబద్ధతను ఇది మరింతగా పునరుద్ఘాటిస్తుంది.

సౌండ్ బార్స్‌ను విడుదల చేసిన ఎల్‌జీ

విశాలాంధ్ర - న్యూఢిల్లీ : వైర్ లెస్ డాల్బీ అట్మోస్ ట్రూ వైర్ లెస్ రియర్ సరౌండ్ స్పీకర్స్ తో తమ కొత్త సౌండ్ బార్స్ ఎల్‌జీ ఎస్95టీఆర్, ఎల్‌జీ ఎస్90టీవై విడుదలను ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ ప్రకటించింది. మంచి సౌండ్ నాణ్యత, వినూత్నమైన ఫీచర్లు, నాజూకైన, ఆధునిక డిజైన్‌తో హోమ్ ఎంటర్టైన్మెంట్‌ను మెరుగుపరచడానికి రూపొందించబడిన ఈ మోడల్స్ ఎల్‌జీ టీవిలతో సమన్వయం అందిస్తున్నాయి, మెరుగుపరచబడిన సినిమా వంటి ఆడియో అనుభవం నిర్ధారిస్తున్నాయి.

తెలంగాణలో రుణాలలో బలమైన వృద్ధిని ఆశిస్తోన్న ఫ్లెక్సీలోన్స్

విశాలాంధ్ర-హైదరాబాద్ : భారతదేశంలోని ప్రముఖ డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫారమ్ ఫ్లెక్సీలోన్స్.కామ్ 2025లో తెలంగాణలో తమ రుణ వితరణలను గణనీయంగా పెంచడానికి ప్రణాళికలను వెల్లడించింది. ముఖ్యంగా, కంపెనీ తెలంగాణలో 2024 వరకు మొత్తం మీద రూ. 200 కోట్లను పంపిణీ చేసింది. తద్వారా తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థకు మద్దతు ఇవ్వడం పట్ల తమ నిబద్ధతను వెల్లడించింది.

గెలాక్సీ ఎస్ 25 సిరీస్‌ను విడుదల చేసిన సామ్‌సంగ్ ఇండియా

విశాలాంధ్ర - బెంగుళూరు : భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్సంగ్, వినియోగదారులు తమ తాజా గెలాక్సీ ఎస్ 25 అల్ట్రా, గెలాక్సీ ఎస్ 25 ప్లస్, గెలాక్సీ ఎస్ 25 స్మార్ట్ ఫోన్లను ముందస్తు ఆర్డర్ చేయవచ్చని ప్రకటించింది. ఇవి సామ్సంగ్ ఇప్పటివరకు సృష్టించిన అత్యంత సహజమైన, సందర్భోచిత మొబైల్ అనుభవాలతో నిజమైన ఏఐ కంపానియన్‌గా కొత్త ప్రమాణాన్ని నిర్దేశిస్తాయి. గెలాక్సీ చిప్ సెట్ కోసం మొట్టమొదటిసారిగా అనుకూలీకరించిన స్నాప్ డ్రాగన్ ఆర్ 8 ఎలైట్ మొబైల్ ప్లాట్ఫామ్ గెలాక్సీ ఏఐ కోసం అత్యున్నత ఆన్-డివైస్ ప్రాసెసింగ్ శక్తిని, గెలాక్సీ యొక్క తదుపరి తరం ప్రో విజువల్ ఇంజిన్‌తో ఉన్నతమైన కెమెరా పరిధి, నియంత్రణను అందిస్తుంది.

దేశంలో మొట్టమొదటి లిథియం రిఫైనరీ బ్యాటరీ తయారీ ఫ్యాక్టరీ

విశాలాంధ్ర-ముంబయి: మహారాష్ట్రలోని నాగపూర్‌లో అదనపు బుటీబోరిలో దేశంలోని మొదటి లిథియం రిఫైనరీ, బ్యాటరీ తయారీ ఫ్యాక్టరీ నిర్మించబడనుంది. ఈ అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్ట్ కోసం రూ. 42,532 కోట్ల భారీ పెట్టుబడి పెట్టబడుతుంది. ఇది భారతదేశం యొక్క ఎనర్జీ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించి, గ్లోబల్ స్థాయిలో దేశం యొక్క స్థానాన్ని బలపరుస్తుంది. సునీల్ జోషి (చైర్మన్), వేదాంశ్ జోషి (మ్యానేజింగ్ డైరెక్టర్) ఈ ఆత్మవిశ్వాస భరితమైన ప్రాజెక్ట్‌ను ప్రకటిస్తూ గర్వంగా ఉన్నారు. ఇది భారతదేశానికి ఒక చారిత్రాత్మక మైలురాయి అవుతుంది.

ప్రపంచ పికిల్‌బాల్ లీగ్‌లో హైదరాబాద్ సూపర్ స్టార్స్ విజయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రపంచ పికిల్‌బాల్ లీగ్‌లో హైదరాబాద్ సూపర్ స్టార్స్ 4-1 తేడాతో పూణే యునైటెడ్‌పై విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో పూణే ఓటమి చెందినప్పటికి వన్షిక్ కపాడియా గొప్ప ఆట తీరును ప్రదర్శించారు. ఈ మ్యాచ్‌లో పురుషుల సింగిల్స్‌లో పూణే యునైటెడ్‌కు చెందిన విలియం సోబెక్, హైదరాబాద్ తరపున మ్యాక్స్ ఫ్రీమాన్ తలపడ్డారు. సోబెక్ 2-9 తేడాతో వెనుకబడి ఉన్నప్పటికి, అద్భుత ఫోర్హాండ్‌తో స్కోర్‌ను 9-9కి సమం చేశారు. కానీ ఫ్రీమాన్ స్థిరమైన ఫోర్హాండ్లు, మెస్మరైజింగ్ స్ట్రోక్ ప్లే ద్వారా 22-17తో విజయాన్ని సొంతం చేసుకొని హైదరాబాద్‌కు తొలి లీడును అందించారు.

ఫ్లెక్సిబుల్ ఫైనాన్సింగ్ ఆప్షన్లతో విద్యార్థులకు టాటా క్యాపిటల్ మద్దతు

విశాలాంధ్ర - వరంగల్ : రాబోయే విద్యా సంవత్సరానికి విద్యార్థులు సన్నద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో, టాటా గ్రూప్ వారి ఫ్లాగ్‌షిప్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ టాటా క్యాపిటల్ లిమిటెడ్ (టీసీఎల్) తన విద్యా రుణ ఆఫర్లతో కుటుంబాల ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి అడుగులు వేస్తోంది. మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్స్ (క్యాట్, ఎక్స్ఏటీ, స్నాప్), విదేశాల్లో ఉన్నత విద్యకు ప్రామాణిక పరీక్షలు (జీఆర్ఈ, శాట్, జీమ్యాట్), ఇంగ్లీషు భాష ప్రావీణ్య పరీక్షలు (ఐఈఎల్ టీఎస్, టోఫెల్) వంటి క్లిష్టమైన పోటీ పరీక్షల ఫలితాలు ప్రకటించడంతో దేశవ్యాప్తంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం మంచి కోర్సులను ఎంచుకుంటున్నారు.విద్యాఖర్చుల భారాన్ని తగ్గించడానికి రూపొందించిన టాటా క్యాపిటల్ వారి విద్యా రుణాలు రూ.85 లక్షల వరకు పూచీకత్తు లేకుండానే అందుతాయి. మొత్తం చదువుకయ్యే ఖర్చును కవర్ చేయడానికి రూ.2 కోట్ల వరకు సెక్యూర్డ్ రుణాలను అందిస్తాయి. ట్యూషన్ ఫీజులు, జీవన ఖర్చులు, స్టడీ మెటీరియల్, ఇతర ఖర్చులతో సహా విస్తృత శ్రేణి ఖర్చులను కవర్ చేసే దేశీయ, విదేశీ విద్యా అవసరాలను ఈ సంస్థ తీరుస్తుంది.

విజయాలతో వీటీ మార్కెట్స్

విశాలాంధ్ర - హైదరాబాద్ : 'వీటీ మార్కెట్స్' 2024 సంవత్సరాన్ని విప్లవాత్మక, అత్యుత్తమ విజయాలతో జరుపుకుంటుంది. ట్రేడింగ్ వాల్యూమ్‌లో భారీ వృద్ధి, వినూత్న భాగస్వామ్యాలతో ముందుకు సాగుతుంది. ఈ ఏడాది గ్లోబల్ బ్రోకరేజ్ రంగంలో మార్గదర్శక సంస్థగా వీటీ మార్కెట్స్ ఎదుగుదలకు ఒక కీలక మలుపు అయింది. వీటీ మార్కెట్స్ 30 పైగా గ్లోబల్, ప్రాంతీయ పురస్కారాలు అందుకుంది. ఫైనాన్షియల్ కమిషన్ నుంచి అప్రూవ్డ్ బ్రోకర్ మెంబర్ హోదాను పొందడం సంస్థ నమ్మకాన్ని, పారదర్శకతను చాటి చెప్పింది. 2024 ఏడాదిలో వీటీ మార్కెట్స్ అసాధారణ పెరుగుదలతో ఎన్నో కీలకమైన మైలురాళ్లను చేరుకుంది. ప్రపంచవ్యాప్తంగా 27 కార్యాలయాలతో 600 మందికి పైగా సిబ్బందితో తన కార్యకలాపాలను విస్తరించింది. ట్రేడింగ్ వాల్యూమ్ 150 శాతం సంవత్సరానికి ఒకసారి పెరగడం ద్వారా సంస్థ నమ్మకాన్ని, ప్రాముఖ్యతను ట్రేడింగ్ కమ్యూనిటీకి చేరవేసింది.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సీఐ

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : రోడ్డు భద్రతా వారోత్సావాల సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రోడ్ వేస్, ఫెయిర్ వేస్ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. బసంత్ నగర్ టోల్‌ప్లాజా ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో టోల్ ప్లాజా సిబ్బంది 30 మంది ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్, ఈసీ మెంబర్ ఎరబాట్టి వెంకటేశ్వర్‌రావు, బసంత్ నగర్ సిఐ స్వామిగారు, టోల్ ప్లాజా మేనేజర్ కన్నారావు, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సంపాదకీయం

అడగవలసిన ప్రశ్న

నదులు పవిత్రమైనవన్నది ఆధ్యాత్మిక భావన. కానీ నదులు జీవనాధారం. జీవనాధారాన్ని, ప్రకృతిని పూజించడం అనాదిగా ఉన్నదే. శాస్త్ర విజ్ఞానం పెరిగే కొద్దీ ఆధ్యాత్మిక భావనలు తగ్గి భౌతికవాద భావనలు వ్యాప్తి చెందాలి. కానీ అలా జరగడం లేదు. శాస్త్రీయ స్ఫూర్తి అన్న మాట వింటేనే ప్రస్తుత పాలకులు గంగవెర్రులెత్తి పోతారు. దైవ చింతన, ఆధ్యాత్మిక భావన జనం కష్టాలు మరిచిపోవడానికి బాగా ఉపయోగపడ్తాయి. ఆధ్యాత్మిక భావనను భౌతికవాద దృష్టిలో బౌద్ధిక ఆలోచన అనొచ్చు. కానీ తరతరాల నుంచి చెలామణిలో ఉన్న ఆధ్యాత్మిక అన్న పదం పాతుకు పోయింది. నదులకు 12 ఏళ్లకు పుష్కరాలు వస్తాయి. ఆధ్యాత్మిక భావాలు ఉన్నవారు ఆ సమయాన్ని పవిత్రమైందిగా భావిస్తారు. నదుల్లో పుణ్య స్నానాలు చేసి తరించి పోతారు. పుణ్య స్నానాలు వ్యక్తిగతం. వాటిని పవిత్ర స్నానాలు అనడం మాత్రం విచిత్రమే. ఎందుకంటే గంగానది నుంచి మొదలు పెట్టి దేశంలోని అనేక నదులు కలుషితమై పోయాయి. పరిశుద్ధత లేని చోట పవిత్రత ఉండడానికి అవకాశమే లేదు. గంగానదిని శుద్ధి చేయడానికి మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ఓ మంత్రిత్వ శాఖనే ఏర్పాటు చేశారు. ఉమా భారతిని ఆ శాఖకు మంత్రిని చేశారు. ఇప్పుడు ఆమె అడ్రసు బీజేపీలో ఎక్కడా దొరకదు. గంగా నదిని ఏ మేరకు శుభ్రం చేశారన్నది సమాధానం లేని ప్రశ్నే. కరోనా సమయంలో ఎన్ని వేల శవాలు పవిత్రం అనుకునే ఆ జలాల్లో తేలియాడాయో లెక్కేలేదు. మృత దేహాలకు గౌరవప్రదమైన పద్ధతిలో అంత్యక్రియలకు కూడా ఏర్పాటు చేయలేని పాడు కాలంలో ఉన్నాం. ఈ పరిస్థితిలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే కుంభమేళాలో స్నానం చేస్తే పేదరికం పోతుందా అని అమాయకంగా ప్రశ్నిస్తున్నారు. ఆయన ప్రశ్నకు భౌతికవాదంలో మూలాలు ఉన్నాయి. కానీ ఆయన ఈ ప్రశ్న ఆధ్యాత్మికత పొంగి పొరలుతున్న దశలో అడిగారు. మధ్యప్రదేశ్ లో "జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీలో మాట్లాడుతూ ఖడ్గే కుంభమేళాలో స్నానం చేస్తే పేదరికం పోతుందా అని అడగడంలో ఔచిత్యం ఎంత ఉన్నా అమాయకత్వం కూడా అంతే ఉంది. ఫొటోల కోసమే ఈ స్నానాలు చేస్తున్నారని కూడా అన్నారు. మరి ప్రముఖులు కుంభ మేళాలో స్నానమాచరించిన దాఖలాలు, ఫొటోలు, వీడియోలు లేకుండా చరిత్రలో ఎలా మిగులుతాయి. గోదీ మీడియా ప్రసార మాధ్యమాలకు ముడి సరుకు ఎక్కడి నుంచి వస్తుంది? కుంభ మేళాలో పవిత్రం అనుకునే నదుల్లో మునకలేసినంత మాత్రాన పేదరికమూ పోదు. ఆకలీ తీరదు. తాను ఎవరి విశ్వాసాన్నీ ప్రశ్నించడం లేదు అని ఖడ్గే వివరణ కూడా ఇచ్చారు. ఎవరి భావోద్వేగాలకైనా విఘాతం కలిగితే క్షమించండి అని కూడా అడిగారు. పిల్లలు ఆకలికి అలమటిస్తుంటే, కార్మికులకు సరైన వేతనాలు అందని స్థితి ఉంటే కుంభ మేళా కోసం వేలాది కోట్ల ప్రభుత్వ ధనం ఎందుకు వెచ్చిస్తున్నారు అన్న అనుమానం ఖడ్గేకు రావడం సహజమే. కానీ ఆయన ప్రశ్నకు సమాధానం ఇచ్చే వారు సనాతనధర్మాయులు కదా! కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుంభ మేళాలో పవిత్ర స్నానం ఆచరించిన సందర్భంలో ఖడ్గే ఈ ప్రశ్న వేశారు. మతం పేరుతో పేదలను దోపిడీ చేస్తున్నారని ఖడ్గే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెహ్రూ శాస్త్రీయ స్ఫూర్తి గురించి మాట్లాడే వారు. సమాజంలో శాస్త్రీయ స్ఫూర్తి పెంపొందింప చేయడానికి రాజ్య వ్యవస్థ కృషి చేయాలని కూడా రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో రాసుకున్నాం. కానీ వినాయకుడికి తొండడం ఉండడం మన దేశంలో యుగాల కిందే ప్లాస్టిక్ సర్జరీ ఉందనడానికి నిదర్శనం, మేఘాల ఉంటే మన రాడార్లు పని చేయవు అని, మురికి కాలవల నుంచి ఉత్పత్తి అయ్యే గ్యాస్ నుంచి టీ కాచుకోవచ్చు అని చెప్పే ప్రధానమంత్రి ఉన్న చోట శాస్త్రీయ స్ఫూర్తి గురించి మాట్లాడడం దండగ.

కాంగ్రెస్ నాయకులు ముఖ్యంగా రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖడ్గే ఎప్పుడు ఏ మాట మాట్లాడతారా అని ఎదురు చూస్తూ ఆ మాటలను ఖండించడానికి సనాతన ధర్మం రాతి మీద కత్తులు నూరే వారు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. తన పేరు ముందు డాక్టర్ అన్న పేరు తగిలించుకున్న సంవిద్ పాత్ర అనునిత్యం అదే పని మీద ఉంటారు. ఖడ్గే మాటలు కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బ తీసేలా ఉన్నాయని సంవిద్ పాత్ర తన ఒరలోంచి కత్తి తీసి వితండ వాదానికి తెగబడ్తున్నారు. యుగయుగాలుగా సనాతన ధర్మంపై జనానికి విశ్వాసం ఉందంటున్నారు. మొత్తం ప్రపంచం ఈ కుంభమేళాను పవిత్రమైందిగా భావిస్తోందట. దమ్ముంటే ఖడ్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ ఇతర మతాల గురించి ఇలాంటి విమర్శలు చేయాలని సంవిద్ పాత్ర సవాలు విసిరారు. శాస్త్రీయమైన ప్రశ్న అడిగినందుకు సనాతన ధరం వెనక దాగి దాడికి దిగే వారినుంచి హేతుబద్ధమైన సమాధానం ఆశించడం దండగ. ఇఫ్తార్ పార్టీలవల్ల పేదరికం దూరం అవుతుందా అని కూడా సంవిద్ పాత్ర ప్రశ్నిస్తున్నారు. గుళ్లో ప్రసాదాలవల్ల ఆకలి తీరే అవకాశం ఉంటే ఇఫ్తార్ పార్టీలవల్ల కూడా ఆకలి తీరుతుంది. మల్లికార్జున ఖడ్గేది సనాతన వ్యతిరేక ఆలోచనా ధోరణట. శాస్త్రీయమైన భావజాలానికి, సనాతన ధోరణికి ఎలా పొసుగుతుంది! "సనాతన ధర్మం జాతీయ మతం" అని కూడా సంవిద్ పాత్ర అంటున్నారు. సనాతన ధర్మం మానవతావాద మతమట. ఆరాధనా పద్ధతులు వేర్వేరు కావొచ్చట. కానీ సనాతన ధర్మం ఒక్కటే మతమట. కుంభ మేళా సనాతన ధర్మానికి ప్రతీక అని కూడా అన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్య నాథ్ కూడా మరో ఇంటర్వ్యూలో ఇలాంటి వాదనే చేశారు. ప్రయాగ్ రాజ్ (అలహాబాద్)లో జరుగుతున్న కుంభ మేళ ఏదో ఒక మతానికి చెందింది కాదని, ఇది సర్వ మత, సర్వ సంస్కృతుల, అన్ని జాతుల సమాహారం అని యోగీ అదిత్యనాథ్ సనాతన ధర్మం అంటే మరింత పకడ్బందీగా వివరించారు. కుంభ మేళాను సనాతన వాదులు మహా పర్వంగా భావిస్తున్నారు. మకర సంక్రాంతి రోజున ఆరు కోట్ల మంది పవిత్ర స్నానాలు చేశారని మురిసి పోతున్నారు. కుంభ మేళా ఐక్యతకు చిహ్నం అంటున్నారు. ముస్లింలను నిరంతరం ద్వేషించే వారు ఐక్యత గురించి మాట్లాడడం విడ్డూరమే. కుంభ మేళా ఔన్నత్యాన్ని గుర్తించని వారిని ఆదిత్యనాథ్ ధృతరాష్ట్రుల కింద జమ కట్టేశారు. ఖడ్గే అడిగిన ప్రస్న నిజానికి ప్రజల మనోభావాలను, భక్తిప్రపత్తులను ప్రశ్నించడం కాదు. మత సంబంధ వ్యవహారాలకు ప్రజాధనం వెచ్చిస్తుండడమేమిటని ఆయన అభ్యంతరం.

తీపి హల్వా చేదు

చింతపట్ల సుదర్శన్

ముఖానికి ఎరుపురంగు పూసుకుని సూర్యుడు కొండ వెనుక దాక్కుంటున్నప్పుడు అరుగుఎక్కింది డాగీ. వేసవికాలం వస్తున్నది కదా లోకం కళ్లకు కాటుక పెట్టుకోడానికి ఇంకా టైం ఉన్నది. రోజువారీ పనులు ముగించుకుని వచ్చి అరుగు ఎక్కింది డాగీ. అలా ఎక్కీ ఎక్కగానో ఏదో తేడాగా ఉందనిపించింది. రుచీ, రంగు సంగతేమోకాని వాసన పసిగట్టడంలో కుక్కలకు ప్రత్యేక ప్రతిభుండే మాట నిజం. ముక్కు ఉబ్బిస్తూ, గాలి ఎగాదిగా పీలుస్తూ అరుగుమీద ఆ మూల నుంచి ఈ మూలకు కవాతు చేయసాగింది డాగీ.

మైదానంలో ప్రవేశిస్తూనే అరుగుమీద అసహనంగా తిరుగుతున్న డాగీ కనిపించింది డాంకీకి. ఇది ఎందుకో ముక్కు గోడకు రాస్తున్నది అనుకుంటూ వచ్చి అరుగుఎక్కింది డాంకీ. డాంకీ అరుగు ఎక్కడాన్ని పట్టించుకోకుండా బిజీబిజీగా అనీజీగా, ధ్యాసంతా ముక్కమీదేఉంచి, తోక పైకి ఎత్తి అరుగుమీద పరుగుతీస్తున్న డాగీతో ఏంటి బ్రో! ముక్కుమీదే నడుస్తున్నావు. పక్కచూపు లేకుండా, నేను వచ్చానన్న సంగతే పట్టించుకోకుండా అన్నది డాంకీ, వెనక్కి తిరిగి డాంకీ వైపు ఓ లుక్కు వేసుకుని,మళ్లీ తన ముక్కు ధ్యాసలో పడిపోయింది డాగీ.

ఇలాగైతే లాభంలేదు.అసెంబ్లీలో ప్రతిపక్షం వాళ్లు పోడియమ్ దగ్గరికి దూసుకుపోయి అరిచి గోలచేసి, సభను రసాభాస చేస్తారు కదా అలాగే ఏమన్నా

రంగస్థలం

చెయ్యాలి అనుకుని గొంతువార నిలబడి ఒక్క 'ఓంద్ర' ఒలికించింది డాంకీ. ఆ కర్ణ కఠోర ధ్వనికి ఉలిక్కిపడింది డాగీ. ఏమిటన్నా ఎర్లీ మార్నింగ్ కాదు కదా, మ్యూజిక్ ప్రాక్టీసు ఇప్పుడే మొదలు పెట్టావుఅంది. ప్రాక్టీసా! పాడా! నేనున్నానని, నేనొచ్చానని చెప్పడానికి పద్ధతిప్పలు ఇది. ఇంతకీ ముక్కుమీదే కళ్లు పెట్టి చూస్తున్నావు. వాసన పసికట్టడంలో మీ జాతికి ఉన్న ఖ్యాతి నాకు తెల్సులే. ఇక్కడ ఎక్కడైనా మాంసం ముక్క కానీ ఉందా? అంది డాంకీ. కాదు బ్రో. మాంసం వాసన చూసీ చూడగానే అదెక్కడుందో కనిపెట్టేయగలను. కానీ అదేం కాదు. ఏదో వాసన. అరుగు ఎక్కినప్పట్నించీ వస్తున్నది. ఏంటో అర్థం కావడంలేదు. అదేంటి నీకూ అర్థం కావడంలేదా? ఉండు నే చూస్తాను అంటూ తలపైకెత్తి ముక్కులోకి ముంతెడు గాలి పీల్చింది, డాంకీ, అవును డాగీ! నువ్వన్నది నిజమే ఏదో వాసన గాలిలో, ఎట్నుంచో కాని కొట్టుకువస్తున్నది అలలు అలలుగా అలవోకగా అదో రకంగా అంది డాగీ.

చెప్పానా! ఎన్నడూలేనిది చూడండి ఈ వింత వాసన. ఇదేంటో తెలీక గోడకు తలబాదుకోవాలనిపిస్తున్నది అని డాగీ అంటుండగానే అరుగు ఎక్కాడు అబ్బాయి. ఏమిటి ఇద్దరూ ముక్కులు చూసుకుంటూ నిలబడ్డారు. పోయిన జన్మలో చేసిన కుంభకోణం కారణంగా పందికొక్కుగా జన్మించిన నాయకుడెవడైనా అర్థాంతరంగా చచ్చి ఈ గోడ పక్కన కళేబరం అయి మీ ముక్కులపై పగబట్టలేదుకదా అన్నాడు అబ్బాయి. అదేం లేదు బ్రదర్. ఇందాకట్నించి ఏదో తెలీని వాసన వస్తున్నదని డాగీ అంటే నేనూ మోమెత్తి చూశా నాకూ ఏదో వాసన లీలగా తగుల్తున్నది అంది డాంకీ, అది నేను ఎప్పుడూ చూడని వాసన ఎమిటా అని ముక్కు తెగ గోడకి రాశా సగం అరిగిపోయినట్టుంది అది డాగీ.

అబ్బాయి ఒక్కసారి ముక్కు ఎగబీల్చి ఓస్ ఇదా! ఇదేనా! అన్నాడు. ఇదనగానేది? ఇదే ననుగానదేది! అని జమిలిగా అరిచాయి డాగీ, డాంకీ. నాకు అర్థమైంది ఇది హల్వా వాసన. ప్రతి ఏడూ ఫిబ్రవరి ఒకటో తారీఖుకి ముందు వచ్చే హల్వా వాసన. ఇది మీ ముక్కుల్లోనే కాదు, ఈ దేశంలో ఉండే జనాలందరి ముక్కుల్లోనూ దూరే వాసనే. అవునా! హల్వా వాసనా! అందరి ముక్కుల్లోకీ దూరే వాసనా! అదెలా సాధ్యం అనడిగింది డాగీ. సాధ్యమే. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు ఆర్థిక మంత్రులు తయారుచేసే హల్వా. ఈ హల్వా వాసన కోట్లాది జనం దగ్గరికి వ్యాపిస్తుంది అన్నాడు అబ్బాయి. ఒట్టి వాసనేనా లేక హల్వా అందరికీ పంచేదేమయినా ఉందా అంది డాగీ. నోట్లోనుంచి నాలుక బైటకు వేలాడేస్తూ. ఇది సర్కారువారు మాత్రమే సేవించే హల్వా, తీపి హల్వా. జనాలకు దక్కేది ఒట్టి వాసనే. ఇప్పుడు నాకర్థమైంది. హల్వా కనపడదు కానీ, హల్వా వాసన ముక్కుల్ని బాదుతుంది డాగి. నాకు హల్వా వాసన రావడం లేదు, ఏదో కాగితాల వాసనయితే వస్తున్నది గాడిదను కదా అంది డాగీ. కరెక్టు నీకు నచ్చేది కాగితాల వాసనే. జనాన్ని ఆహా ఓహో అనిపిస్తుంది హల్వా వాసన కానీ ఆ కాగితాల్లో ఉండే పన్నులునెత్తిన పిడుగులైపడి అబ్బా, అయ్యో, అమ్మో, చస్తిన్రో అనిపిస్తయి అన్నాడు అబ్బాయి. నోట్లో ఉండే పన్నుల సంగతీ, మాంసం నమిలే పన్ను సంగతి తెలుసుకాని ఈ పన్ను లేమిటన్నా అని అమాయకంగా అడిగింది డాగీ. పన్నులంటే ప్రభుత్వం నడిపించడానికి ప్రజల వీపు మీద కొరడాదెబ్బలు. ఆదాయపు పన్ను, ఇంటిపన్ను, కారు పన్ను, వస్తువుల పన్ను, టోల్ పన్ను, రెస్టారెంట్ పన్ను, పార్కింగ్ పన్ను, నీటి పన్ను , మరుగుదొడ్డి పన్ను, చదువుపన్ను, పుస్తకాల పన్ను, చెత్తా, చెదారం పన్ను ఇలాగ సవాలక్ష పన్నులుంటాయి. అబ్బో! మనమే నయం ఏ పన్నూ లేకుండా బ్రతికేస్తున్నాం అంది డాంకీ, పన్నులంటే ఏమిటో నాకు అర్థంకాలేదు కొరడా దెబ్బలా అంది డాగీ. అలాంటివే. చిన్నా, చితకా, మధ్య రకం మనుషులు సంపాదించేదంతా లాక్కోడం అన్నమాటం. లాక్కుంటేనే మరి సర్కారు అజమాయిషీ నడిపించేది అన్నాడు అబ్బాయి. జీతాలూ, భత్యాలూ, పథకాలూ, స్కాములూ, అన్నింటికీ డబ్బు కావాలి కదా మరి అంది డాగీ. సర్కారు నడిపేవారి సౌకర్యాలు, విదేశీయాత్రలు, ఎన్నో ఖర్చులు. ప్రతి ఏడూ ధరలు తగ్గుతాయని, పన్ను భారం తగ్గుతుందని, ఉద్యోగాలు వస్తాయని, సౌకర్యాలు పెరుగునని ఎదురుతెన్నులు చూసే ప్రజలకు హల్వా వాసన తగుల్తుంది కానీ వాళ్ల నోటికి అందేది మాత్రం చేదుగానే ఉంటుంది అన్నాడు అబ్బాయి. నా కెందుకో కాగితాల వాసన నచ్చటం లేదు అంది డాంకీ.

నోటికి అందకుండా, ముక్కుకి మాత్రం తగిలే హల్వా వాసన కోసం ముక్కు గోడకు రాయలేను అంది డాగీ.

అధిక పిల్లలు కావాలన్న సాధువులు

అరుణ్ శ్రీ వత్సవ

హిట్లర్ పాలనా కాలంనుంచి ఆర్ఎస్ఎస్, విశ్వహిందు పరిషత్ ఆగ్నేయాసియా ప్రాంతంలో హిందుత్వ భావజాలాన్ని విస్తరింపచేసేందుకు ఎంత కృషి చేసినా, ఇంతవరకు సాధ్యం కాలేదు. ఇప్పుడు భారత దేశంలో బీజేపీ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశంలో ఎలాగైనా హిందు రాష్ట్రను నెలకొల్పేందుకు కుట్రలు, కుహకాలు పన్నుతున్నారు. మితవాద శక్తులు వేస్తున్న ఎత్తుగడలను ఇతర పురోగామి, ప్రజాస్వామ్యశక్తులు అడ్డుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. ఇండియాను మురికి నేలమాళిగగా తయారుచేద్దామని పూనుకుంటున్నారు. ఇప్పటికే ఈ శక్తులు అన్ని రంగాలను ఆక్రమించుకున్నాయి. ప్రయాగ్ రాజ్‌లో సాధువులు రెండు రోజులు సమావేశం జరిపి హిందు తల్లిదండ్రులు ఎక్కువ పిల్లలను కనాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే పెరిగిన జనాభాను గురించి వీరేమీ పట్టించుకోకుండా తమ ఇష్టానుసారంగా పిలుపునిచ్చారు. ఈ అంశాన్ని ప్రజలకు తెలియజేసేందుకు విశ్వహిందుపరిషత్ జాతీయస్థాయిలో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెక్యులర్ శక్తులు బలహీనపడిన నేపథ్యంలో ఈ మితవాద శక్తులు విజృంభించాయి. హిందుత్వం, మతశక్తులు రాజకీయాలను ఆక్రమించుకుని హిందు సమాజాన్ని మాత్రమే నిర్మించేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నాయి. హిందుత్వం, మతవాదంను పునర్నిర్మించేందుకు ఏ మాత్రం వెనుకాడడంలేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బహుళ సమాజాన్ని నిర్మించేందుకు సమరయోధులు, వామపక్ష శక్తులు ఎనలేని కృషి చేశాయి. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనని హిందుత్వ మితవాద శక్తులు ఇప్పుడు అధికారం చేజిక్కడంతో అన్నిఅవకాశాలను వినియోగించుకుంటున్నాయి. బాబ్రి మసీదును కూలగొట్టేందుకు చాలాకాలంగా ప్రయత్నించి చివరకు కూల్చివేశారు. హిందువుల విశ్వగురువుగా, రాజకీయ శక్తిగా ఒక వ్యక్తిని పెంచిపోషించారు.

శంకరాచార్యులను తాము అనుసరిస్తున్నట్లుగా నటించేందుకు వీహెచ్‌పీ ప్రయత్నిస్తోంది. మార్గదర్శక మండల్ సమావేశంలో సాధువులు, ధర్మాచార్యులు, ఒక్కొక్కరు కనీసం ఇద్దరు, ముగ్గురు తప్పనిసరిగా పిల్లలను కనాలని ఒక ఆదేశం జారీ చేశారు. ప్రస్తుతం హిందు జనాభా తగ్గిపోతోందని ప్రచారం సాగిస్తున్నారు.

విశ్వహిందుపరిషత్ శక్తులు తాము హిందువుల ప్రతినిధులం మాత్రమేనని, ఉమ్మడి హిందుయిజంతో తమకు సంబంధంలేదని దూరంగా ఉన్నట్లుగా చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. హిందుత్వను తాము పూర్తిగా తిరస్కరిస్తున్నట్లుగా ప్రకటించడానికి ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులకు ఏమాత్రం నైతిక ధైర్యంలేదు. అలాగే సనాతనధర్మ మౌలిక సూత్రాలను కూడా పట్టించుకోకుండా సనాతన ధర్మాన్ని తాము అనుసరిస్తున్నామని చెపుతారు. మౌలిక సనాతన హిందుఇజంను రాజకీయ హిందుత్వగా పూజిస్తున్నారు. ప్రయాగలో జరుగుతున్న మహాకుంభ్ మార్గదర్శక మండల్ రెండురోజులు సమావేశమై ఒక తీర్మానం చేసింది. ఈ సమావేశంలో మహా మండలేశ్వర్లు, ధర్మప్రచారక్‌లు పాల్గొన్నారు. శంకరాచార్యులకు ఉన్న అధికారాలన్నింటినీ వీరు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని వృద్ధిచేసేందుకూ, అలాగే హిందుత్వను రక్షించుకునేందుకు ఈ శక్తులు ప్రచారానికి పూనుకున్నాయి. శంకరాచార్యులను తాము అనుసరిస్తున్నట్లుగా నటించేందుకు వీహెచ్‌పీ ప్రయత్నిస్తోంది. మార్గదర్శక మండల్ సమావేశంలో సాధువులు, ధర్మాచార్యులు, ఒక్కొక్కరు కనీసం ఇద్దరు, ముగ్గురు తప్పనిసరిగా పిల్లలను కనాలని ఒక ఆదేశం జారీ చేశారు. ప్రస్తుతం హిందు జనాభా తగ్గిపోతోందని ప్రచారం సాగిస్తున్నారు.

హిందువులకు మైనారిటీలు ముప్పుగా పరిణమిస్తున్నారని అబద్ధాలను విస్తరింప చేస్తున్నారు. వీరిచేసే వాదం ఏ మాత్రం వాస్తవంకాదని వారికికూడా తెలుసు. అయితే పూర్తి అధికారాన్ని చేజిక్కించుకుని హిందు రాష్ట్రను ఏర్పాటు చేయడమే వారికున్న దుష్ట ఆలోచన. మిత, మత వాదుల ప్రచారానికి అడ్డు ఆపు లేకుండా ఉంటోంది.

తొమ్మిదేళ్ల క్రితమే 2015, జనవరి 15వ తేదీన వీహెచ్‌పీ అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా బళ్లారిలో వీహెచ్‌పీ 50వ వార్షికోత్సవం సందర్భంగా మనోహర్‌భూషణ్ ఇంటర్ కాలేజీలో ప్రసంగిస్తూ ముస్లింలతో సహా అందరూ ఇద్దరు పిల్లలను కనాలని ఆదేశం జారీ చేశారు. అంతేకాకుండా, హిందు కుటుంబంలో మంచి హిందువునని అనిపించుకునేందుకు పిల్లలకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీలు నిరంతరం హిందువులు, హిందుత్వ తీవ్ర ప్రమాదంలోఉన్నాయని అబద్ధాలను ప్రచారం సాగిస్తూనే ఉన్నారు. వాస్తవంగా హిందువులకు ఇలాంటి ముప్పు ఏమీ లేదు. కావాలనే ముస్లింలను నేరుగా ప్రస్తావించకుండా అందుకు సూచించే మాటలు మాట్లాడుతుంటారు. మొఘలుల పరిపాలనలో రాజపుట్‌లు, బ్రాహ్మణులు ఉన్నతకులాలు ఎన్నో అవమానాలకు గురయ్యారని ప్రచారం సాగిస్తున్నారు. రాజపుట్‌ల మహిళ జోధాభాయ్ అక్బర్‌ను, ఆయన ప్రధాని సోదరుడు అయిన మాన్‌సింగ్‌ను వివాహం చేసుకున్నారని చెప్తున్నారు. బ్రిటిష్ పాలనలో ఉన్నత కులాల హిందువులు ఉన్నతస్థాయినే అనుభవించారు. బ్రిటీష్‌వారి కళ్లు, చెవులలాగా వ్యవహరించారు. వీహెచ్‌పీ అధ్యక్షుడు అలోక్ కుమార్ మాట్లాడుతూ, దేశంలో సంతానోత్పత్తి హిందువులలో 2.1శాతం కాగా, దక్షిణ భారతదేశంలో 1.7శాతం మాత్రమేఉందని ఇది ఆందోళన కలిగిస్తుందన్నారు. దేశంలో నిరుద్యోగ రేటు అత్యధికంగా ఉంది. ఆర్థికవృద్ధి పడిపోయింది. నిరుద్యోగులు, వివాహం చేసుకోవాలని ఎలా ఆసక్తి చూపిస్తారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా పనిచేస్తున్న ప్రధానమంత్రి ఆర్థిక వృద్ధి ఎందుకు పడిపోతుంది. యువతకు ఎందుకు ఉద్యోగాలు ఎందుకని కల్పించలేకపోతున్నారని అలోక్ కుమార్ ప్రశ్నించగలరా?

బానిస సంకెళ్లు తెంచిన పోరాటం

ఆర్వీ రామారావ్

1948లో కలకత్తాలో జరిగిన కమ్యూనిస్టు పార్టీ మహాసభ

తెలంగాణా సాయుధ పోరాటం మూడు శతాబ్దాల అసఫ్జాహీల పాలనా సంకెళ్లను పగులగొట్ట గలిగింది. ఆఖరి, ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఆసఫ్జాహీ పాలకులలోకెల్లా నిరంకుశుడు. పిసినారితనంలో కూడా ఆయనను మించినవాడు లేడు. అప్పటికి ప్రపంచంలోకెల్లా సంపన్నుడైనప్పటికీ తన పైజమాల చిరుగులకు స్వయంగా తానే మాసికలు వేసుకుని తొడుక్కునేవాడు. పదహారు జిల్లాలు, కోటి 70 లక్షల జనాభాతో హైదరాబాద్ సంస్థానం దేశంలోని స్వతంత్ర సంస్థానాలలోకెల్లా పెద్దది. కానీ హైదరాబాద్ సంస్థానంలో ఆంతరంగిక పరిస్థితి మాత్రం దయనీయంగా ఉండేది. సంస్థానంలో 40 శాతం జాగీర్లు, మక్తాలు, పాయగాలు, ఇనాంలు. ఈ సంస్థానాల్లో పోలీసులు, జైళ్లు, కోర్టులు సహా అన్నీ సంస్థానాధీశుల అధీనంలోనే ఉండేవి. 1947కు ముందు నిజాం కమ్యూనిస్టు పార్టీని, కాంగ్రెస్ ను నిషేధించాడు. కాంగ్రెస్ మీద నిషేధం 1946లో ఎత్తివేసినా కమ్యూనిస్టు పార్టీ మీద తొలగించలేదు. పోలీసు యాక్షన్ తరవాత కేంద్ర కాంగ్రెస్ నాయకత్వం అనుసరించిన రాజకీయ పంథా తెలంగాణా ప్రాంతంలో కొత్త సమస్యలు తెచ్చింది. కమ్యూనిస్టు పార్టీ విముక్త ప్రాంతాలను సృష్టించి భూస్వామ్య విధానాన్ని తుదముట్టించడం కేంద్ర ప్రభుత్వానికి నచ్చలేదు.

హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్లో విలీనం చేయడానికి నిజాం ససేమిరా అంగీకరించలేదు. ఆయనను బలవంతంగా గద్దె దించడానికి కేంద్ర ప్రభుత్వం పోలీసు చర్య పాటించింది. పేరుకు అది పోలీసు చర్యే కానీ వాస్తవానికి వినియోగించింది సైన్యాన్నే. నిజాం ను గద్దె దించడానికి ఈ సైన్యం ఒక్క తూటా కూడా పేల్చలేదు కానీ కమ్యూనిస్టులను, రజాకార్లను ఏరిపారేసింది. నిజాం బేషరతుగా లొంగి పోయాడు. నిజానికి సాయుధ పోరాటం కారణంగా నిజాం జీవచ్ఛవంగా మారాడు. వందలాది మంది కమ్యూనిస్టులు ఈ పోలీసు చర్యకు బలయ్యారు. నిజాం గద్దె దిగినా కేంద్ర ప్రభుత్వం ఆయనకు 17

కోట్ల రూపాయల నష్ట పరిహారం చెల్లించింది. జాగీర్దారీ వ్యవస్థను రద్దు చేశారు. నిజాం కు ఏడాదికి కోటి రూపాయలు చెల్లించారు. 1969లో రాజభరణాలు రద్దు చేసే దాకా నిజాంకు ఈ పరిహారం అందుతూనే ఉంది. హైదరాబాద్ జిల్లాలో 20 వేల ఎకరాల భూమి వదిలేశారు. ఆయన ఇతర ఆస్తులను మాత్రం ముట్టుకోలేదు. అయితే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో జరిగిన సాయుధ పోరాటంవల్ల కొన్ని మార్పులు అనివార్యమైనాయి. 1950లో కౌలుదారీ చట్టం పేరిట భూసంస్కరణలు అమలులోకి వచ్చాయి. పోలీసు చర్య తరవాత సాయుధ పోరాట తీవ్రత తగ్గింది. పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తాయి. 1948 నుంచి 1951 దాకా సాయుధ పోరాటం చాలా అనుకూలమైన పరిస్థితుల్లో సాగింది. స్వాతంత్ర్యం తరవాత జాతీయోద్యమం కాలంలో కన్న కలలు నిజం చేసుకోవాలన్న ఆకాంక్షతో ప్రజలు నెహ్రూ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్న రోజులవి. 1948లో కలకత్తాలో జరిగిన కమ్యూనిస్టు పార్టీ మహాసభ ఈ వాస్తవాలను గుర్తించడానికి నిరాకరించింది. దేశమంతటా నూతన ప్రజాతంత్ర విప్లవ స్ఫూర్తి, చైతన్యం కట్టలు తెంచుకుని ప్రవహిస్తోందని, విప్లవ పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ పిలుపు ఇవ్వడమే తరువాయి అని, ఆ పిలుపు కూడా ఇచ్చింది. ఈ పిలుపు కారాణంగా అనేకమంది ఆత్మ బలిదానం చేయాల్సి వచ్చింది. పార్టీ బలం తగ్గుతూ పోయింది కాని విస్తరించలేదు. భారత విప్లవం చైనా పంథాలో కొనసాగుతుందని గ్రామీణ ప్రాంతాలలో గెరిల్లా దళాలు ఏర్పడిన తరవాత పట్టణ ప్రాంతాలకు విస్తరించి, చుట్టుముట్టి విముక్తం చేయాలని వాదించారు. కమ్యూనిస్టు పార్టీలో ఒక వర్గం వైఖరి ప్రజల చైతన్య స్థాయికి అందని విధానాలు, పొసగని నినాదాలుగా మిగిలిపోయాయి. ఆధునిక ఆయుధాలు కలిగిన భారత సేనలను ఎదుర్కోలేక పోయారు. 1951-52లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోరాటం ముగిసింది. పోరాటం విరమిస్తున్నట్టు అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. పోరాట కాలంలో కోస్తా ఆంధ్ర ప్రాంతం సాయుధ పోరాటానికి సరఫరా కేంద్రంగా ఉండకుండా చేయడానికి కోస్తా ఆంధ్రలో కూడా విపరీతమైన దమనకాండ కొనసాగింది. వేలాది మంది కమ్యూనిస్టు కార్యకర్తలను అరెస్టు చేశారు. జైళ్లు చాలక క్యాంపులు పెట్టారు. కమ్యూనిస్టు పార్టీకి బలమైన గ్రామాలలో వందలాదిమంది పోలీసులు చుట్టుముట్టారు. ప్రజలందరినీ గుంపుకట్టి లాఠీలు ప్రయోగించారు. నగ్నంగా ప్రదర్శనలు చేయించారు. స్త్రీల మీద అత్యాచారాలు చేశారు. కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరుల పొలాలను నాశనం చేశారు. 1949 జులై నాలుగున ఎలమర్రులో, 16న కాటూరులో పళనియప్పన్ నేతృత్వంలో పోలీసులు అమానుష దాడులు చేశారు. ప్రాచీన, ఆధునిక ఆంధ్ర, సంస్కృత గ్రంథాలు, భగవద్గీత, వివేకానందుడి రచనలు బుగ్గి చేశారు. గురజాడ అముద్రిత రచన "రుతుశతకం" రాత ప్రతి కూడా నాశనమైంది. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం సంపుటాలు గాంధీ, నెహ్రూ ఆత్మ కథలు, పట్టాభి సీతారామయ్య రాసిన కాంగ్రెస్ చరిత్ర ప్రతులు పచారీ దుకాణాల్లో అమ్మేశారు. ప్రసిద్ధ రచయిత నార్ల చిరంజీవి ఇంటిని కొల్లగొట్టారు. అప్పటికి 89 ఏళ్ల వృద్ధుడైన ఆయన తండ్రిని అనేక సార్లు నిర్బంధించి హింసించారు. 1949 జులై 16న కాటూరు గ్రామాన్ని ఆరువందలమంది సైనికులు చుట్టుముట్టారు. వయోభేదం లేకుండా ప్రతి పురుషుణ్ని వీధుల్లో నడిపించి ఒక చోటికి చేర్చారు. చితగ్గొట్టారు. ఈ కొట్టడంలో రెండు బండ్ల పై చిలుకు ములుగర్రలు విరిగి పోయాయి. స్పృహ తప్పిన వారిని దిగంబరులను చేశారు. చేతులు అడ్డం పెట్టుకున్న వారి చేతులు నిలువుగా పైకెత్తించారు. వారి వెనక ఆడవారిని నిలబెట్టారు. గాంధీ విగ్రహం చుట్టూ నగ్నంగా ప్రదర్శన చేయించారు. తేలప్రోలు గ్రామంలో వేమన గ్రంథాలయం, ప్రజాశక్తి ప్రచురణాలయం ధ్వంసం చేశారు. ముందడుగు నాటక రచయిత సుంకర సత్యనారాయణను నెత్తురు కక్కేట్టు కొట్టి ఆయన అముద్రిత రచనల్ని నాశనం చేశారు. వాసిరెడ్డి భాస్కరరావు విషయంలోనూ అంతే కిరాతకంగా వ్యవహరించారు. ఆయన రాసిన సారస్వత చరిత్ర ధ్వంసం చేశారు. ప్రసిద్ధ రచయిత తుమ్మల వెంకట్రామయ్యను నిర్బంధించారు. గంగినేని, అవసరాల సూర్యారావు, కోగంటి గోపాల కృష్ణయ్యను జైలులో కుక్కారు. ఆ తరవాత జరిగిన ఎన్నికలలో ప్రజలు ఓటుతో ప్రభుత్వానికి సమాధానం చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఎన్.జి.రంగా గుండా దళాలను ఏర్పాటు చేశారు. సాయుధ పోరాటం సాధించిన విజయాలూ ఉన్నాయి. మొదటిది నిజాం ను గద్దె దించడం. రెండవది భూపంపిణీ సమస్యను ఎత్తి చూపడం. స్టేట్ కాంగ్రెస్ కూడా గణనీయమైన పాత్ర పోషించడం. కాస్ట్రో నాయకత్వంలో క్యూబా పోరాటానికి కూడా తెలంగాణా సాయుధ పోరాటం స్ఫూర్తినిచ్చింది. ఈ పోరాటంలో ప్రతి అనుభవం ఓ గ్రంథం. ప్రతి నష్టం, ప్రతి కష్టం ఒక సైద్ధాంతిక కిరణం. ప్రతి విజయం ఒక విజయ పతాకం. ఒక విజ్ఞాన దీపం.

గృహహింస చట్ట సవరణ పిటిషన్ 'సుప్రీం' తిరస్కరణ

న్యూఢిల్లీ: వరకట్నం, గృహహింస చట్టాల్లో సంస్కరణలు చేయాలంటూ న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. సమాజమే మారాలని... అందులో ఏమీ చేయలేమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. వరకట్న, గృహహింస చట్టాలు దుర్వినియోగమవుతున్నాయని... వాటిని సంస్కరించాలని న్యాయవాది పిటిషన్‌లో కోరారు. చట్టాలను సమీక్షించేందుకు ఓ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల బెంగళూరులో ఓ టెకీ ఆత్మహత్య చేసుకోగా... చట్టబద్ధంగానే తన భార్య వేధింపులకు గురి చేస్తుందంటూ చట్టంలోని లొసుగులను బయటపెట్టాడు. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఉన్న చట్టాలను సమీక్షించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేయాలని న్యాయవాది డిమాండ్ చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్రలతో కూడిన ధర్మాసనం తిరస్కరించింది. సమాజమే మారాలని.. ఇందులో కోర్టులు ఏం చేయలేమని బెంచ్ స్పష్టం చేసింది.

ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలు

డెహ్రాడూన్: బీజేపీ పాలిత రాష్ట్రం ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. దాని విధివిధానాలకు సంబంధించిన పోర్టల్‌ను ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి ఆవిష్కరించారు. ఉమ్మడి పౌరస్మృతి ద్వారా పౌరులందరికీ సమానమైన హక్కులు, బాధ్యతలు దక్కేలా చూస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశంలో యూసీసీని అమలుచేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచిందన్నారు. ఉమ్మడి పౌరస్మృతి అమలుతో నిజమైన మహిళా సాధికారత కనిపిస్తుందని పేర్కొన్నారు. వారి హక్కులను కాలరాసే బాల్య వివాహాలు, ట్రిపుల్ తలాక్, విడాకులు, ఆస్తుల వారసత్వం, బహుభార్యత్వం వంటి దురాచారాలను పూర్తిగా రూపుమాపడానికి యూసీసీ తోడ్పడుతుందని ధామి తెలిపారు. ఉమ్మడి పౌరస్మృతి ఏ మతానికి, వర్గానికి వ్యతిరేకం కాదనే విషయాన్ని స్పష్టం చేయాలనుకుంటున్నట్లు వివరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 కింద పేర్కొన్న వివిధ షెడ్యూల్డ్ తెగలను దీనినుంచి దూరంగా ఉంచామని.. తద్వారా ఆ తెగలు వారి హక్కులను పరిరక్షించుకోవచ్చని అన్నారు. కాగా, అన్ని మతాలకు చెందిన స్త్రీ, పురుషులకు కనీస వివాహ వయస్సు ఒకేలా ఉంటుంది. బహుభార్యత్వాన్ని నిషేధించారు. హలాల్ విధానంపై నిషేధం విధించారు.

పాముకాటు మరణాలు తగ్గించండి

కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పాము కాటు మరణాలు ఎక్కువగా నమోదౌతున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. వీటిని తగ్గించే అంశంలో రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి కేంద్రం చర్యలు తీసుకోవాలని సోమవారం సుప్రీం ధర్మాసనం సూచన చేసింది. అన్ని వైద్య కేంద్రాల్లో పాముకాటుకు చికిత్స అందుబాటులో ఉండేలా చూడాలని కోర్టు చెప్పింది. జస్టిస్ బీఆర్ గవాయి, ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పాము కాటుకు విరుగుడు అయిన యాంటీ వినోమ్ లేకపోవడం వల్ల దేశంలో ప్రజా ఆరోగ్య సంక్షోభం ఏర్పడినట్లు ఓ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ పిటిషన్‌పై కోర్టులో వాదనలు జరిగాయి. పాముకాటు సంఘటనల గురించి అన్ని రాష్ట్రాలతో చర్చించాలని, దేశవ్యాప్తంగా ఈ సమస్య ఉన్నదని సుప్రీం బెంచ్ చెప్పింది. అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మరణాలు తగ్గించే చర్యలు తీసుకోవాలని సుప్రీం పేర్కొంది. తాము తీసుకున్న అన్ని చర్యలను కౌన్సిల్ ముందు పెట్టనున్నట్లు కేంద్రం తెలిపింది. ఆరు వారాల తర్వాత తమ అభిప్రాయాలను కౌంటర్ ఫైల్ చేయనున్నట్లు కొన్ని రాష్ట్రాలు కోర్టుకు చెప్పాయి. అడ్వకేట్ శైలేంద్ర మణి త్రిపాఠి... పాముకాటు ఘటనలపై కోర్టులో దావావేశారు. అయితే ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో పాము కాటుకు విరుగుడు మందు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆ పిటిషన్‌లో కోరారు. గత ఏడాది డిసెంబర్ 13న దీనిపై వాదనలు జరిగాయి. భారత్‌లో అత్యధిక స్థాయిలో పాముకాటు మరణాలు సంభవిస్తున్నట్లు అడ్వకేట్ చాంద్ ఖురేషి తెలిపారు. ప్రతి ఏడాది 58 వేల మంది మరణిస్తున్నట్లు చెప్పారు. మరణాల సంఖ్య ఎక్కువగా ఉందని... ప్రాణాలను దక్కించుకునే యాంటీ-వినోమ్ కొరత తీవ్రంగా ఉన్నట్లు ఆ పిటిషన్‌లో తెలిపారు.

చరిత్ర వక్రీకరణ సరికాదు

'ఛావా'పై మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్



ముంబై: విక్కీ కౌశల్, రష్మిక జంటగా నటించిన చిత్రం 'ఛావా'... ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా బాలీవుడ్ దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ సినిమా తీశారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌లోని కొన్ని సన్నివేశాలు వివాదాస్పదమైన క్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. చరిత్రను వక్రీకరించడం సరికాదని వ్యాఖ్యానించారు. "ఛత్రపతి శంభాజీ మహరాజ్ జీవిత చరిత్రను సరిగ్గా చూపించాలి. చరిత్రను వక్రీకరించడం సరికాదు. శంభాజీ మహరాజ్‌పై ప్రతి ఒక్కరికి అమితమైన ప్రేమ, గౌరవం ఉంది. అది ఎక్కడా దెబ్బతినకూడదు" అని మీడియా ప్రతినిధులతో అన్నారు. 'ఛావా' చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల చిత్రబృందం ట్రైలర్ విడుదల చేసింది. అందులోని ఓ సన్నివేశంలో విక్కీ కౌశల్ డ్యాన్స్ చేయడంపై అంతటా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్ కూడా అసహనం వ్యక్తం చేశారు.

మోదీ సర్కార్‌లో 'ఉపాధి' నిర్వీర్యం

- వేతనాలు పెంచండి... సాంకేతిక లోపాలు పరిష్కరించండి
- కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉద్యోగ హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) ను నిర్వీర్యం చేసేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ సోమవారం ఆరోపించారు. కేంద్ర బడ్జెట్ ఈ పథకానికి కేటాయింపులను పెంచాలని, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థలోని సాంకేతిక లోపాలను పరిష్కరించాలని, పని దినాల సంఖ్యను పెంచాలని అన్నారు. దేశంలోని కోట్లాది మంది పేద కుటుంబాలకు ఈ పథకం ఇప్పటికీ జీవనాధారంగా ఉందని ఆయన అన్నారు. '2015లో పార్లమెంటులో ఎంజీఎన్ఆర్ఈజీఏను ఆయన ఎగతాళి చేయడం ప్రధాని మోదీ నిర్లక్ష్యం, దూరదృష్టి లేకపోవడమనేది తొలి సూచనలలో ఒకటి' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ వ్యవహారాలు) జైరాం రమేశ్ పేర్కొన్నారు. 'ఆ తర్వాతి సంవత్సరాల్లో, ముఖ్యంగా కోవిడ్-19 మహమ్మారి సమయంలో ప్రభుత్వం అమలు చేయగల కొన్ని సామాజిక భద్రతా జోక్యాలలో ఒకటిగా ఎంజీఎన్ఆర్ఈజీఏ దాని ప్రయోజనాన్ని స్పష్టంగా ప్రదర్శించింది. 2019-20లో మహమ్మారికి ముందు ఈ పథకం కింద పని కోరిన మొత్తం 6.16 కోట్ల కుటుంబాలు ఉండగా, 2020-2021 నాటికి ఈ సంఖ్య దాదాపు 33 శాతం పెరిగి 8.55 కోట్లకు చేరుకుంది. ఈ కోట్లాది కుటుంబాలకు ప్రభుత్వం ప్రణాళిక లేని లాక్‌డౌన్‌ల గందరగోళం మధ్య ఎంజీఎన్ఆర్ఈజీఏ మాత్రమే జీవనాధారం' అని తెలిపారు. 'కొనసాగుతున్న ఆర్థిక మందగమనం నడుమ జనవరి 2025 నాటికి ఈ కార్యక్రమం కింద 9.31 కోట్ల మంది క్రియాశీల కార్మికులు పని చేస్తున్నారు. ఈ కార్మికులలో దాదాపు 75 శాతం మంది మహిళలు. ఈ వాస్తవికత ఉన్నప్పటికీ, ప్రభుత్వం వారి దుస్థితి పట్ల ఉదాసీన వైఖరిని కొనసాగిస్తూనే ఉంది' అని పేర్కొన్నారు. ఈ లేఖలో ఆయన కొన్ని అంశాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.

'జీడీపీలో వాటాగా ఎంజీఎన్ఆర్ఈజీఏ కి కేటాయింపులు 2024-25లో 0.26 శాతానికి తగ్గాయి' అని ఆయన రాశారు. అయితే జీడీపీలో కనీసం 1.7 శాతం ఈ కార్యక్రమానికి కేటాయించాలని ప్రపంచ బ్యాంకు సిఫార్సు చేసింది. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయింపులలో, బడ్జెట్‌లో దాదాపు 20 శాతం గత సంవత్సరాల నుంచి క్లియరింగ్ బకాయిల కోసం చెల్లించబడుతుందని అంచనాలు సూచిస్తున్నాయి. వినియోగదారుల ధరల సూచిక (సీపీఐ) ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతం ఉంటుందని అంచనా వేసిన సమయంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో కనీస సగటు నోటిఫైడ్ వేతన రేటు 7 శాతం పెరిగింది. అందువల్ల వాస్తవ వేతన పెరుగుదల చాలా తక్కువగా 2 శాతంగా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అందువల్ల వాస్తవ వేతన పెరుగుదల చాలా తక్కువగా 2%. 2019-20 అలాగే 2023-24 మధ్య దాదాపు 4 కోట్ల జాబ్ కార్డులను తొలగించారు. కాగా, గత రెండు సంవత్సరాలలో 1.2 కోట్ల జాబ్ కార్డులు మాత్రమే ఇచ్చారు. ఒక రాష్ట్రం నుంచి వచ్చిన అంచనాల ప్రకారం తొలగింపులలో 15 శాతం తప్పుగా ఉన్నాయి. 'జనవరి 1, 2024న ఉపాధి పథకం కోసం అన్ని చెల్లింపులు ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఏబీపీఎస్) ద్వారా జరగాలని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అయితే 27 శాతం మంది కార్మికులు ఏబీపీఎస్ ద్వారా చెల్లింపునకు అనర్హులు. వారి పని డిమాండ్ నమోదు కాలేదు. పని చేస్తున్నప్పటికీ చాలామంది తమ వేతనాలను కూడా కోల్పోతారు' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. 'కార్మికులు హాజరు నమోదు చేసుకోవడానికి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) కూడా అవసరం. అయితే యాప్‌లోని లోపాలు, స్మార్ట్‌ఫోన్‌లకు పరిమితి ప్రాప్యత, క్రమరహిత అనుసంధానం ఫలితంగా నమోదు కాని హాజరు విస్తృతంగా ఉంది. నమోదు కాని పని, ఆలస్యమైన వేతన చెల్లింపులు జరిగాయి' అని వివరించారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా ఉపాధి హామీ పథకం కార్మికులు ఫిబ్రవరి 14, 2024న జార్ఖండ్‌లోని గర్వా జిల్లాలోని రాంకాలో జరిగిన జన్ సున్వైలో ఈ సమస్యలను లేవనెత్తారు. ఎనిమిది నెలల తర్వాత కూడా ఈ సమస్యలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం సృష్టించిన మానవ, ఆర్థిక, సంస్థాగత విషాదం' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర బడ్జెట్ నుంచి ఈ క్రింది డిమాండ్లను చేస్తుంది. వీటిలో చాలా వరకు ఇప్పటికే గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ కోసం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రతిపాదించిన డిమాండ్ ఫర్ గ్రాంట్స్ రిపోర్ట్ (2024-2025)లో చోటు చేసుకున్నాయని ఆయన రాశారు. ఉపాధి హామీని డిమాండ్ ఆధారిత పథకంగా భావించారని, ప్రభుత్వ బడ్జెట్‌ల కంటే పని కోసం దరఖాస్తు చేసుకునే వ్యక్తులపై ఆధారపడి పనిదినాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా తీవ్రమవుతున్న ఆర్థిక మాంద్యం దృష్ట్యా, ఈ దార్శనికతను సాకారం చేసుకోవడానికి బడ్జెట్ తగిన ఆర్థిక సదుపాయాన్ని కల్పించాలన్నారు. దశాబ్ద కాలంగా కొనసాగుతున్న వేతనాల స్తబ్దత సంక్షోభం మధ్య 2024 లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ న్యాయ్ పాత్రలో ఊహించినట్లుగా ఉపాధి పథకం వేతనాల పెరుగుదల కొత్త ప్రాముఖ్యతను సంతరించుకుంది. 'జాతీయ కనీస వేతనంగా రోజుకు రూ. 400 చేరుకునే లక్ష్యంతో రాబోయే కేంద్ర బడ్జెట్ ఉపాధి వేతనాలను పెంచాలి' అని అన్నారు. 'ఎంజీఎన్ఆర్ఈజీఏ వేతనాలను ప్రభుత్వ ఏకపక్ష ఇష్టాల ద్వారా నిర్ణయించలేం.

వేతన రేటులో మార్పుల అవసరాన్ని అంచనా వేయడానికి ఒక స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలి. 'ఆధార్ ఆధారిత చెల్లింపు వంతెన వ్యవస్థ (ఏబీపీఎస్) తప్పనిసరి చేయకూడదు. వేతనాలను 15 రోజుల చట్టబద్ధమైన వ్యవధిలోపు చెల్లించాలి. చెల్లింపులో ఏదైనా జాప్యాన్ని భర్తీ చేయాలి. ఉపాధి పథకం కింద పనిదినాల సంఖ్యను 100 నుంచి 150 రోజులకు పెంచాలి' అని ఆ లేఖ పేర్కొన్నారు.

మహారాష్ట్రలో జీబీఎస్ వైరస్ విజృంభణ

సోలాపూర్‌లో తొలి మరణం నమోదు

ముంబై: గుల్లెయిన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కారణంగా మహారాష్ట్రలోని సోలాపూర్‌లో తొలిమరణం నమోదైనట్టు ఆరోగ్యశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. అతడు కొద్దిరోజుల కిందట పుణే వచ్చాడని... ఆ సమయంలోనే సిండ్రోమ్ సోకినట్లుగా భావిస్తున్నారు. రాష్ట్రంలో సిండ్రోమ్ బారినపడుతున్న రోగుల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. పుణేలోనే వంద మందికిపైగా రోగులున్నారు. ఇమ్యునోలాజికల్ నరాల వ్యాధి గుల్లెయిన్ బారే సిండ్రోమ్ వ్యాప్తి పుణేలో ఎక్కువగా కనిపిస్తున్నది. పుణేలో జీబీఎస్ సోకిన వారి సంఖ్య 101కి పెరిగింది. 68 మంది పురుషులు, మరో 33 మంది మహిళలు ఉన్నారు. 16 మంది రోగుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వారికి వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందిస్తున్నారు. పుణే మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన రాపిడ్ రెస్పాన్స్ టీం, ఆరోగ్యశాఖ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. పూణేలోని సింఘాడ్ రోడ్డులో గరిష్ఠ సంఖ్యలో రోగులను గుర్తించారు. ప్రత్యేక నిఘా వేశారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 25,578 ఇళ్లు సర్వే చేశారు. 15,761 ఇళ్లు పుణే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. మరో 3,719 చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. 6,098 ఇండ్లు రూరల్ ప్రాంతానికి వస్తాయి. జీబీఎస్ అనేది రోగనిరోధక నాడీ వ్యాధి. ఇది సోకితే చేతులు, కాళ్లు అకస్మాత్తుగా తిమ్మిరి వస్తాయి. కండరాలు బలహీనంగా మారుతాయి. బలహీనత... విరేచనాలు ఉంటాయి. పిల్లలు, యువత ఎక్కువగా ఈ వ్యాధి బారినపడుతున్నారు. వారంతా కోలుకుంటుండడం విశేషం. మరిగించి చల్లార్చిన నీటినే తాగాలని, ఆహారం సైతం శుభ్రంగా ఉంచుకోవాలని, కూరగాయాలను శుభ్రంగా కడుక్కోవాలని, బాగా ఉడికించి తినాలని వైద్యశాఖ అధికారులు సూచించారు.

78 ఏళ్ల తర్వాత విద్యుత్ వెలుగులు!

ఉబ్బితబ్బిబ్బవుతున్న చిల్కపల్లి గ్రామ ప్రజలు

రాయ్‌పూర్: మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి సుమారు 78 ఏళ్లు పూర్తయింది. ఎనిమిది దశాబ్దాల్లో దేశంలో ఎంతో అభివృద్ధి జరిగింది. దాదాపు అన్ని రంగాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. అయితే వివిధ రాష్టాల్లోని కొన్ని మారుమూల గ్రామాలకు మాత్రం ఇంకా అన్ని రకాల అభివృద్ధి ఫలాలు అందలేదు. ఇప్పటికీ సరైన రవాణా సౌకర్యం, తాగునీటి వసతి లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాకు చెందిన చిల్కపల్లి గ్రామం ఆ కోవకు చెందినది. ఆ గ్రామానికి రవాణా, తాగునీటి సంగతి దేవుడెరుగు... ఇప్పటిదాకా కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏళ్ల తర్వాత ఇప్పుడు ఆ గ్రామం విద్యుత్ వెలుగులకు నోచుకుంది. బీజాపూర్ జిల్లా కలెక్టర్ సంబిట్ మిశ్రా ఈ నెల 23న చిల్కపల్లి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. దాంతో ఆ గ్రామ ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. తమ ఇళ్లలో విద్యుత్ వెలుగులను చూసుకుని సరికొత్త అనుభూతి చెందుతున్నారు. నియాద్ నెల్నార్ పథకం కింద చిల్కపల్లి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు సంబిట్ మిశ్రా చెప్పారు. ఈ పథకం కింద విద్యుత్ సౌకర్యం పొందిన ఆరో గ్రామం అని వెల్లడించారు.

ఢిల్లీ వాసులపై కేజ్రీవాల్ వరాల జల్లు

ఆప్ మేనిఫెస్టో విడుదల

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేయడంతో పాటు హామీల వర్షం కురిపిస్తున్నాయి. అధికారంలోకి వస్తే ఉపాధి, మహిళా సాధికారతతో పాటు 13 ఇతర హామీలతో సహా ఢిల్లీ ఓటర్లకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సోమవారం అనేక వాగ్దానాలు చేసింది. 'ఆప్ దీనిని మేనిఫెస్టో అని కాకుండా 'కేజ్రీవాల్ కి హామీ'గా పేర్కొంది. - 'గ్యారంటీ' అనే పదాన్ని మొదట అరవింద్ కేజ్రీవాల్ ఉపయోగించారు' అని సౌరభ్ భరద్వాజ్ అన్నారు. ఆప్ అధికారంలోకి వస్తే ఆరు పునరుద్ధరణలు... అంటే, ఉచిత విద్య, ఆరోగ్య సంరక్షణ, మహిళలకు బస్సు ప్రయాణం, నీరు, విద్యుత్ యథావిధిగా కొనసాగుతాయని కూడా పార్టీ తెలిపింది. 15 హామీలను పరిశీలిస్తే... రాబోయే ఐదు సంవత్సరాల పాటు యువతకు ఉపాధి అత్యంత ప్రాధాన్యతగా ఉంటుంది. ప్రతి మహిళకు 'మహిళా సమ్మాన్ యోజన' కింద నెలకు రూ. 2,100. ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రులలో సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్య చికిత్స. తప్పుడు నీటి వినియోగ బిల్లులు రద్దు. ప్రతి ఇంటికి నిరంతరం శుభ్రమైన తాగునీటి సరఫరా. యమునా నదిని శుభ్రం చేయడం. విదేశాలలో చదువుతున్న దళిత విద్యార్థుల కోసం అన్ని ఖర్చులను (ట్యూషన్, ప్రయాణం, వసతి) ప్రభుత్వం భరిస్తుంది. అలాగే విద్యార్థులకు బస్సులలో ఉచిత ప్రయాణం, మెట్రో చార్జీపై 50 శాతం తగ్గింపు. ఢిల్లీ అంతటా ప్రపంచ స్థాయి రోడ్ల నిర్మాణం. ఆలయం, గురుద్వారా పూజారులకు రూ. 18 వేల నెలవారీ గౌరవ వేతనం. అద్దెదారులకు ప్రత్యేక విద్యుత్ మీటర్లు అందించడం. ఆధునిక మురుగునీటి వ్యవస్థ నిర్మాణం. కొత్త రేషన్ కార్డుల జారీ. ఆటో, టాక్సీ మరియు ఇ-రిక్షా డ్రైవర్ల కుమార్తెల వివాహాలకు రూ. లక్ష సాయం. వారి పిల్లలకు ఉచిత కోచింగ్. వారి కుటుంబాలకు రూ.10 లక్షల జీవిత బీమా, రూ.5 లక్షల వైద్య బీమా. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను నియమించుకోవడానికి రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు (ఆర్‌డబ్ల్యూఏలు) నిధులు మంజూరు. కాగా, గత వారం ప్రారంభంలో బీజేపీ దేశ రాజధాని కోసం తన మానిఫెస్టోను మూడు భాగాలుగా విడుదల చేసింది. వీటిలో ప్రధాన వాగ్దానాలు నిరుపేదలకు ఉచిత విద్య, మహిళలకు ఆర్థిక సహాయం, నగరంలో నీటి సమస్యలను పరిష్కరించడం. ఇదిలాఉండగా, నిరుద్యోగ యువతకు ఒక సంవత్సరం పాటు నెలకు 8,500 రూపాయల స్టైఫండ్‌తో మద్దతు ఇవ్వడానికి కాంగ్రెస్ 'యువ ఉడాన్ యోజన'ను ప్రకటించింది. మరోవైపు, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ బీజేపీ, ఆప్, కాంగ్రెస్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ప్రతి పార్టీ రాజధానిలో ఇతరుల పాలనపై విమర్శలు గుప్పిస్తోంది. ఫిబ్రవరి 5న జరగనున్న ఈ ఎన్నికల్లో 70 అసెంబ్లీ స్థానాలకు దాదాపు 699 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారు. ఫలితాలు ఫిబ్రవరి 8న లెక్కిస్తారు. గతంలో 15 సంవత్సరాలుగా ఢిల్లీలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇటీవలి ఎన్నికల్లో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంది. గత రెండు అసెంబ్లీ పోటీలలో ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. దీనికి విరుద్ధంగా, 2015, 2020 ఎన్నికలలో వరుసగా 67, 62 సీట్లను గెలుచుకుని ఆప్ విజయం సాధించింది. రాబోయే ఎన్నికలు అన్ని పార్టీలకు కీలకమైన పరీక్షగా మారనున్నాయి.

కేంద్రానికి ఏడు డిమాండ్లు

కేంద్ర ప్రభుత్వం త్వరలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నందున మధ్యతరగతి ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి అరవింద్ కేజ్రీవాల్ ఏడు డిమాండ్లు లేవనెత్తారు. 'విద్యా బడ్జెట్‌ను రెండు నుంచి పది శాతానికి పెంచాలి. ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి. మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా ఉన్నత విద్యకు సబ్సిడీలు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి. ఆరోగ్య బడ్జెట్‌ను పది శాతానికి పెంచాలి. ఆరోగ్య బీమాపై పన్ను తొలగించాలి. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ. 7 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలి. నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తొలగించాలి. సీనియర్ సిటిజన్లకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టాలి. రైళ్లలో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు 50 శాతం రాయితీ ఇవ్వాలి' అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ బడ్జెట్‌ను మధ్యతరగతి ప్రజలకు అంకితం చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని ఆయన అన్నారు.

త్రివేణి సంగమంలో 14 కోట్ల మంది పుణ్యస్నానాలు

మహాకుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు. గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు అంచనాలకు మించి తరలివస్తున్నారు. ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 14 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. జనవరి 13 నుంచి 26వ తేదీ వరకు త్రివేణీ సంగమంలో 13.21 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు వెల్లడించింది. అందులో 10 లక్షల మంది కల్పవాసీలు కూడా ఉన్నట్లు పేర్కొంది. సోమవారం ఉదయం 8 గంటల వరకూ దాదాపు 46.64 లక్షల మంది స్నానాలు ఆచరించినట్లు అధికారులు తెలిపారు. మహా కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ముగుస్తుంది. 45 రోజులపాటు సాగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేసింది .

అమిత్ షా... ప్రత్యేక పూజలు

కేంద్ర హోం మంత్రి అమిత్ షా గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి అధికారులతో సమావేశాలు నిర్వహించి మహాకుంభ్ ఏర్పాట్లపై సమీక్షించారు.

పోలీసులకు చిక్కిన లిక్కర్ స్మగ్లర్

మహాకుంభమేళాలో పుణ్య స్నానం చేసేందుకు వెళ్లిన లిక్కర్ స్మగ్లర్ ప్రవేశ్ యాదవ్(22)ను పోలీసులకు చిక్కాడు. మద్యం స్మగ్లింగ్ కేసులో అతడు 2023 జులై నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. ప్రయాగ్‌రాజ్‌లోని సివిల్ లైన్స్ ఏరియాలో నిఘా పోలీసులకు అతడు దొరికాడు. బదోయి ఎస్పీ అభిమన్యు మాంగలిక్ ... వివరాలు వెల్లడించారు. స్మగ్లర్ ప్రవేశ్ యాదవ్‌ది రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లా. ఏడాదిన్నర నుంచి అతడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. 2023, జులై 29న జాతీయ రహదారిపై ... అల్వార్ నుంచి బీహార్ వెళ్లే మార్గంలో వాహనాలు చెకింగ్ చేస్తున్న సమయంలో నకిలీ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసులో రాజ్ దొమోలియాను అరెస్టు చేయగా ప్రవేశ్ యాదవ్ పరారీ అయ్యాడు. అల్వార్ జిల్లాకు చెందిన నిందితులందరూ... చాలాకాలంగా బీహార్‌కు అక్రమ మద్యాన్ని తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఐపీసీతో పాటు ఎక్సైజ్ శాఖ చట్టంలోని 419, 420, 468, 471, 272, 273, 207 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రవేశ్ యాదవ్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఇక నుంచి భారత్‌లో 'వన్ టైమ్.. వన్ నేషన్'



న్యూఢిల్లీ: దేశంలో ఒకే సమయం అమలు చేయాలని కేంద్రప్రభుత్వం యోచిస్తోంది. దేశం మొత్తం ఒకే సమయం పాటించాలనే నిబంధనతో కొత్త ముసాయిదా విడుదల చేసింది. ఇండియన్ స్టాండర్డ్ టైం (ఐఎస్‌టి) ప్రకారం ప్రస్తుతం అమల్లో ఉన్న సమయపాలనను ప్రామాణీకరించడానికి దేశవ్యాప్తంగా ఒకే సమయాన్ని తప్పనిసరి చేసేందుకు సన్నాహాలు ప్రారంభించింది. అన్ని అధికారిక, వాణిజ్య ప్లాట్‌ఫాంలలో భారతీయ ప్రామాణిక సమయాన్ని తప్పనిసరిగా ఉపయోగించేలా కేంద్ర ప్రభుత్వం సమగ్ర నియమాలను రూపొందించింది. భారతదేశం నేషనల్ టైం కీపర్ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ & ఇండస్ట్రియల్ రీసెర్చ్- నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ (సిఎస్ఐఆర్-ఎన్‌పిఎల్) వన్ టైం వన్ నేషన్ ప్రతిపాదన చేసింది. ప్రస్తుతం మన దేశం 82ళీ33ఃఇ గుండా వెళుతున్న రేఖాంశం ఆధారంగా ఐఎస్‌టి సమయాన్ని లెక్కిస్తోంది. కొత్త ప్రతిపాదన ప్రకారం, ఐఎస్‌టి-1 రేఖాంశాలు 68 డిగ్రీల 68ం7ఃఇ , 89ళీ52ఃఇఇ మధ్య పడే ప్రాంతాలను కవర్ చేస్తూనే, ఐఎస్‌టి-2 89ళీ52ఃఇ, 97ళీ25ఃఇల మధ్య ప్రాంతాలను కవర్ చేస్తూ ఒకే సమయాన్ని లెక్కిస్తుంది. ఇందులో అన్ని ఈశాన్య రాష్ట్రాలతో పాటు అండమాన్, నికోబార్ దీవులు కూడా ఉంటాయి. ఇలా రెండు టైం జోన్లను అనుసరించడం వల్ల ఇంధన వినియోగ పొదుపు సంవత్సరానికి 20 మిలియన్ కిలోవాట్లు సాధించవచ్చని అంచనా. వినియోగదారుల వ్యవహారాల విభాగం, నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ, ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) సహకారంతో పటిష్ఠమైన సమయాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 14లోగా ముసాయిదా నిబంధనలపై ప్రజలు తమ అభిప్రాయాలు, సూచనలు ఇవ్వాలని మంత్రిత్వ శాఖ కోరుతోంది.

రాళ్లు విసిరి... కాల్పులు జరిపి...

ఉత్తరాఖండ్‌లో మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యే మధ్య విభేదాలు

డెహ్రాడూన్: బీజేపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే, స్వతంత్ర ఎమ్మెల్యే మధ్య నెలకొన్న విభేదాలు తీవ్రస్థాయికి చేరడంతో ఒకరి కార్యాలయంపై మరొకరు రాళ్లు రువ్వడంతోపాటు కాల్పులు జరుపుకున్నారు. బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లోని రూర్కీలో ఈ సంఘటన జరిగింది. బీజేపీ మాజీ ఎమ్మెల్యే కున్వర్ ప్రణవ్ సింగ్ ఛాంపియన్ ఆదివారం తుపాకులు చేతపట్టి తన అనుచరులతో కలిసి ఖాన్‌పూర్ స్వతంత్ర ఎమ్మెల్యే ఉమేష్ కుమార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కున్వర్, ఆయన అనుచరులు అక్కడ హంగామా చేశారు. ఎమ్మెల్యే ఉమేష్ కుమార్ కార్యాలయంపై కాల్పులు జరుపడంతోపాటు రాళ్లు రువ్వి దుర్భాషలాడారు. కాగా, ఎమ్మెల్యే ఉమేష్ కుమార్ కూడా ధీటుగా స్పందించారు. తన అనుచరులతో కలిసి కున్వర్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ రాళ్లు రువ్వడంతోపాటు పిస్టల్‌తో కాల్పులు జరిపి దూషించారు. ఇంతలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పరస్పరం ఫిర్యాదులు చేసుకున్న మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యేను అరెస్ట్ చేశారు. మరోవైపు ఎమ్మెల్యే ఉమేష్ కుమార్ శనివారం రాత్రి లంధౌరాలోని తన భవనంపై దాడి చేశాడని, తనను దుర్భాషలాడినట్లు బీజేపీ మాజీ ఎమ్మెల్యే కున్వర్ ప్రణవ్ సింగ్ ఛాంపియన్ ఆరోపించారు. దీనిపై స్పందించిన తనను పోలీసులు అరెస్ట్ చేశారని, ఇది అన్యాయమని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా తాను పోరాడతానని అన్నారు. కాగా, బీజేపీ మాజీ ఎమ్మెల్యే కున్వర్ ప్రణవ్ సింగ్ ఛాంపియన్, ఇండిపెండెంట్ ఎమ్మెల్యే ఉమేష్ కుమార్ మధ్య చాలా కాలంగా విరోధం నెలకొన్నది. దీంతో ఒకరిపై మరొకరు ఆరోపించుకోవడంతోపాటు సోషల్ మీడియాలో విమర్శించుకోవడం ఈ ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో వారిద్దరి వద్ద ఉన్న పిస్టల్స్ లైసెన్స్ రద్దు కోసం జిల్లా మేజిస్ట్రేట్‌కు సిఫార్సు చేస్తామని పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. మరోవైపు వీరి మధ్య ఘర్షణకు సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజావాణిలో ప్రజలు అందచేసిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డితో కలసి అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం 1411 దరఖాస్తులు అందచేశారని తెలిపారు. అట్టి అర్జీలను సత్వరమే పరిష్కారం చేయాలని సంబంధిత జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 1411 దరఖాస్తులు అందగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 1052, రేషన్ కార్డుల కోసం 271, పెన్షన్ 47, డిఈఓ 03, ఎస్సీ కార్పొరేషన్ 04, రెవెన్యూ 11, ఐసిడీఎస్ 4, ఇతర శాఖలకు సంబంధించినవి 19 దరఖాస్తులు అందాయని పేర్కొన్నార్ను. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ. వెంకటచారి, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం జిల్లా అధికారులు జి ఆశన్న, ఆర్ రోహిణి, పవన్ కుమార్, కోటాజీ, సుబ్రహ్మణ్యం, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించాలి : సీపీఐ

విశాలాంధ్ర - హైదరాబాద్ : నిరుపేదలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలని మహబూబ్ నగర్ సిపిఐ జిల్లా కార్యదర్శి బి బాలకిషన్ కోరారు. సోమవారం నగరంలోని షాషాబ్ గుట్ట ప్రాంతంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి బాల్‌కిషన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా 6 గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26 నుండి ప్రారంభమైన ఇందిరమ్మ ఇల్లు, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్స్ పంపిణీ పథకంలో భాగంగా అర్హులైన నిరుపేదలకె సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. మహిళలకు 2,500 అందించే విధంగా ప్రభుత్వము పారదర్శకతతో గ్రామసభలలో లబ్ధిదారుల జాబితాను ప్రవేశపెట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కే.పద్మావతి, మాధవి, డబుల్ బెడ్ రూమ్ ఏరియా కార్యదర్శి గౌలి ఆనంద్, టీచర్స్ కాలనీ ఏరియా కార్యదర్శి శ్రావణ్ కుమార్, మాజీ నాయకులు మహేష్, మహిళా సమాఖ్య సభ్యులు, సత్యమ్మ, జ్యోతి, గీతమ్మ, కొలిమిపద్మమ్మ, లక్ష్మికళ, అరుణ, అంజమ్మ, వరలక్ష్మి, రహమతిబేగం పాల్గొన్నారు.

800 మందితో రన్ ఫర్ యూనిటీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమాజ స్ఫూర్తిని ప్రదర్శించడానికి, తమ నివాసితులు, పొరుగు సమాజాలలో ఫిట్‌నెస్ సంస్కృతిని ప్రోత్సహించడానికి, రన్ ఫర్ యూనిటీ పేరిట మారథాన్‌ను పోచారంలోని ఎస్బియల్ స్ప్రింగ్స్ వద్ద నిర్వహించింది. దాదాపు 800 మందికి పైగా ఈ రన్‌లో పాల్గొన్నారు. ఎస్బియల్ సీఈఓ, వ్యవస్థాపకుడు అజితేష్ కొరుపోలు తన ఆలోచనలను పంచుకుంటూ, అనుసంధానిత, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలనే మా ముఖ్య విలువలను మారథాన్ ప్రతిబింబిస్తుందన్నారు. ఇక్కడ ప్రదర్శించిన ఉత్సాహం, ఆధునిక జీవనశైలిలో ఫిట్‌నెస్, సవాలును కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమాల ద్వారా ఉత్తమంగా ఎదుర్కోగలరని రుజువు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టోన్ టేల్స్ ఉత్సాహపూరితమైన ప్రదర్శనలను చేసింది. కార్యక్రమానికి మరింత ఉత్సాహం అందిస్తూ ప్రసిద్ధ సంగీతాన్ని ప్లే చేసింది. ఇది మారథాన్ అంతటా ప్రేక్షకులు ఉత్సాహంగా పాల్గొనటానికి వారు లీనం కావటానికి సహాయపడింది. పిల్లల నుండి సీనియర్ సిటిజన్ల వరకు 5కె, 10కె పరుగులో పాల్గొన్నారు.

మున్సిపాలిలకు ప్రత్యేక అధికారిగా ప్రతిభా సింగ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాలక వర్గాల పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. రంగారెడ్డి జిల్లాలో 12 మున్సిపాలిటీలకు, మూడు కార్పొరేషన్లకు ప్రత్యేక అధికారులను నియమించారు. అందులో భాగంగా ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం, పెద్దఅంబర్ పేట్, షాద్ నగర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీలకు, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లకు జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ప్రతిమా సింగ్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అదనపు కలెక్టర్ సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు.

దృష్టి మరల్చేందుకు బీఆరెస్, బీజేపీ కుట్రలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : అభివృద్ధి పథకాలు అమలు విషయంలో ప్రజల దృష్టి మరల్చేలా బీజేపీ బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని సీడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అన్వేష్ రెడ్డి విమర్శించారు. గద్దర్ విషయంలో నక్సలేట్ భావజాలం ఉన్న వ్యక్తి అన్న బండి సంజయ్ ముందు బీజేపీ పార్టీలో లెఫ్టిస్ట్ అని చెప్పుకునే ఈటల ఎలా చేర్చుకున్నారని నిలదీశారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అతనికి బీజేపీ అధ్యక్ష పదవి ఎలా ఇవ్వబోతున్నారని ప్రశ్నించారు. తెలంగాణలో గద్దర్ పాత్ర ప్రత్యేకం అణగారిన వర్గాల వారిని చైతన్య పరిచిన వ్యక్తి అంటూ అన్వేష్ రెడ్డి కొనియాడారు. వెంటనే బండి సంజయ్ తన మాటలు వినక్కి తీసుకోవాలని, కేంద్ర మంత్రి పదవిని బండి సంజయ్ అర్హుడు కాదన్నారు. గిరిజన సంక్షేమ కార్పొరేషన్ బెల్లయ్య నాయక్ కాంగ్రెస్ చేసే పథకాలు ప్రజల్లోకి పోతే తెలంగాణ లో ఏ రాజకీయ పార్టీకి పుట్టగతులు ఉండవని, అందుకే తెలంగాణలో మత రాజకీయాలు చేస్తున్నారన్నారు. మొన్నటి వరకు ఇందిరాగాంధీ తిట్టారు, ఇవ్వాళ గద్దర్‌ని విమర్శిస్తున్నారని తెలిపారు. బీజేపీ పార్టీ బండి సంజయ్ రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇందిరాగాంధీ దేశం కోసం ఎన్ని బుల్లెట్స్ తీసుకున్నారు మనకి తెలుసని అన్నారు. ఆరెస్సెస్ భావజాలం ప్రకారం నీవు ఎమ్మెల్యే మంత్రి పదవులకు అనర్హుడవని, కాంగ్రెస్ తెచ్చిన రాజ్యాంగం వల్లనే మోదీ కానీ అమితాషా బండి సంజయ్‌కి పదవులు వచ్చాయా నిలదీశారు.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

కమిషనర్ ఇలంబర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడంపై దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాల నుండి పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి కమీషనర్ ఇలంబర్తి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణి లో ఆయా విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా అందుతున్నందున వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ సంబందించిన క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పరిష్కారానికి కృషి చేయాలన్నారు అర్జీలను, ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఆయా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, జాప్యం చేయరాదని తెలిపారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సమస్య పరిష్కరించగలిగినదైతే వెంటనే పరిష్కరించాలని, పరిష్కరించలేనట్లైతే అందుకు గల కారణాలను అర్జీదారులకు వివరించాలని సూచించారు. ప్రజావాణిలో 73 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 41, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్ 8, హౌసింగ్ 4, ట్యాక్స్, ఫైనాన్స్, ల్యాండ్ అక్విజేషన్, వెటర్నరీ, యు.బి.డి విభాగాలకు మూడు చొప్పున, ఎలక్ట్రికల్ 2, శానిటేషన్, హెల్త్, ఎస్టేట్స్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయి. అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, సుభద్ర దేవి, నళిని పద్మావతి, పంకజ, గీతా రాధిక, సత్యనారాయణ, అశోక్ సామ్రాట్, రఘు ప్రసాద్, యాదగిరి రావు, అలివేలు మంగతాయారు, సిసిపి శ్రీనివాస్, సి.ఇ కోటేశ్వరరావు, యు.బి.డి డైరెక్టర్ వెంకటేశ్వర్, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, అడిషనల్ సి.సి.పి ప్రదీప్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, విజిలెన్స్ డి.ఎస్.పి సుదర్శన్, జె.సి రెవెన్యూ మహేష్ కులకర్ణి, హౌసింగ్ ఈఈలు పి.వి రమణ, రాజేశ్వర్ రావు, ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ మూర్తి రాజు, డిప్యూటీ సి.ఇ.ఓ పనస రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ వయోపరిమితి పెంపు ఆలోచన విరమించుకోవాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల వయోపరిమితిని పెంచే ప్రతిపాదనకు ప్రయత్నాలు చేస్తున్నదని, ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. హిమాయత్ నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరును ఖండించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగుల వయోపరిమితి వయస్సు పెంచాలనే ప్రతిపాదన వల్ల రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతందని వారు అన్నారు. గతంలో 58 సంవత్సరాలుగా ఉన్న రిటైర్మెంట్ వయస్సును 61 సంవత్సరాలకు పెంచారని, ఉద్యోగుల పదవి విరమణ వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందనే కారణంతో రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ఇప్పుడు రిటైర్మెంట్ వయస్సు పెంచాలనే ప్రతిపాదన సరికాదన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే ప్రధాన ధ్యేయమని ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, మరో వైపు నిరుద్యోగులను మోసం చేసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో సుమారు 45 లక్షల మంది నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రిటైర్మెంట్ అయిన ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్లు వేసి రిక్రూట్మెంట్ చేపట్టాలనీ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, పూర్తి స్థాయిలో భర్తీ చేయకుండా కాలయాపన చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఉద్యోగాల కల్పన చేయకుండా పాలకులు యువత శక్తి సామర్థ్యాలను నీరుగారుస్తున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఒకవేళ ఉద్యోగ వయోపరిమితి వయస్సును పెంచాలనే కుట్ర చేస్తే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్. బాలకృష్ణ, మజీద్, కళ్యాణ్, అనీల్, అరుణ్ పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆర్కే నగర్లో సొంత ఇల్లు లేకుండా కిరాయికి ఉంటున్న నిరుపేదలందరికీ ఇంటి స్థలంతో పాటు ఇల్లు కట్టించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సీపీఐ ఆర్కే నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆర్కే నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగా సభకి ముఖ్య అతిధులుగా హాజరు అయినా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యదిరెడ్డిలు మాట్లాడుతూ 76 ఏళ్ల గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న సందర్భంలో కొంత మంది మూర్ఖులు భారత రాజ్యాంగాన్ని మార్చాలని మాట్లాడుతున్నారు. అలాంటి వారి నుండి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని రాజ్యంగం పూర్తి స్థాయిలో అమలు కొరకు కృషి చేయాలని అన్నారు. ఆర్కే నగర్‌తో పాటు అనేక చోట్ల వేలాది మంది పేద ప్రజలు సొంత ఇండ్లు లేక కిరాయి ఇండ్లలో నివాసం ఉంటున్నారూ అలాంటి వాళ్ల అందరికీ ప్రభుత్వమే సొంత ఇంటి స్థలం, నిర్మాణం చేసి ఇవ్వాలని అన్నారు. బుధాన్ భూముల్లో గుడిసెలు వేసుకున్న నీరు పెద ప్రజలందరికీ పట్టాలతో పాటు ఇంటి నిర్మాణానికి సరిపడ ఆర్థిక సహకారం కూడా ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఏడాది పాటు జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశంలో కులం పేరుతో మతం పేరుతో జరిగే దాడులకు, స్త్రీల మీద జరిగె అన్ని రకాల హింసలకి వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. సీపీఐ పార్టీ నిరంతరం పెద ప్రజల పక్షాన కొట్లాడే పార్టీ అని ఇప్పటికే ముడు చోట్ల గుడిసెలు వేసి విజయం సాధించాం భవిష్యత్‌లో కూడా ఇండ్ల స్థలాలు ఇండ్లు లేని పెదాల కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆర్కే నగర్ శాఖ కన్వీనర్ బైరగోని రాజు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో 12వ వార్డ్ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్, ప్రజా నాట్య మండలి వేణు, సీపీఐ ఆర్కే నగర్ శాఖ సభ్యులు నర్సింహ, ఉప్పలయ్య, గోపీ, శోభన్ బాబు, జామిళ, కనకమ్మ, అనసూయ, శ్రీలత, గంగా, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల వసతులు సమకూర్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఈ విషయంలో ఇప్పటి నుంచే పరీక్ష కేంద్రాలకు సంబంధించి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి అన్నారు. మార్చి 5 వ తేదీ నుంచి మార్చి 25వ తేదీ వరకు జరగనున్న పరీక్షల నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు థియరీ, ఎథిక్స్, ఎన్విరాన్మెంటల్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రాక్టికల్స్ పరీక్షలు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రెండు సెషన్లలో మూడు స్పెల్స్‌ జరుగుతాయని దీనికి గాను జిల్లా వ్యాప్తంగా జనరల్, ప్రాక్టికల్స్, ఒకేషనల్ కోర్సులకు పరీక్షలు ఉంటాయని అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు గాను జిల్లాలో ప్రథమ సంవత్సరంలో జనరల్ విభాగానికి సంబంధించి 62829 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులో 1278 మంది... మొత్తం 64107 మంది పరీక్షలు రాస్తారని... అలాగే ద్వితీయ సంవత్సరంలో జనరల్లో 61286 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులో 1,030 మొత్తం 62,316 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో జనరల్ విభాగానికి సంబంధించి మొత్తం 1,24,115 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులో మొత్తం 2,308 మంది మొత్తంగా 1,26,423 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఇంటర్మీడియట్ పరీక్షలకు గాను జిల్లా వ్యాప్తంగా 150 పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను, పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, అవసరమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను, పరీక్షా కేంద్రాల నుండి జవాబు పత్రాలను పగడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ సహకరించాలని, ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. దీనికి సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.కిషన్, కళాశాలల ప్రిన్సిపాల్స్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబం వల్లే పాలమూరు వెనుకబాటు : కాంగ్రెస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : గడిచిన పదేళ్ల పాటు అదుకారంలో ఉండి కీలక పదవుల్లో ఉన్న కేసీఆర్ కుటుంబం అడ్డుకోవడం వల్లనే వారు పాలమూరు జిల్లాను నిర్లక్ష్యం చేయడం వల్ల జిల్లా వెనుకబడి పోయిందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలు విమర్శించారు. పాలమూరు జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది బీఆర్ఎస్ పార్టీనే అంటూ మండిపడ్డారు. సోమవారం సీఎల్పీలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీమంత్రి హరీష్‌రావు పాలమూరు జిల్లాపైన పచ్చి అబద్దాలు ఆడుతున్నాడని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేస్తానని కేసీఆర్ గతంలో చెప్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ కాళేశ్వరం పైన ప్రత్యేక శ్రద్ధ చూపించి పూర్తి చేసిన కేసీఆర్ పాలమూరు రంగారెడ్డిని గాలికి వదిలేశాడని ఆరోపించారు. పాలమూరును పచ్చగా చేస్తే జిల్లాలోని 12 సీట్లలో బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయిందని నిలదీశారు. కాంగ్రెస్ హయాంలో మొదలుపెట్టిన కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ లను పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. ప్రాజెక్ట్ ల చివరల్లో పూలు చల్లి, నీళ్లు తడుపుకొని మేమే కట్టామని హరీష్ రావు, నిరంజన్ రెడ్డి షో చేశారు తప్ప జిల్లాకు ఓరగపెట్టింది ఏమీ లేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు 28 వేల కోట్లు ఖర్చు పెట్టామని చెపుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం 28 ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదున్నారు. ఎన్నికల కోసం నార్లాపూర్ లో ఒక పంప్ ఆన్ చేసి కేసీఆర్ షో చేశాడని కానీ కేసీఆర్ ఆన్ చేసిన గంటకే పంప్ ను ఆఫ్ చేశారన్నారు. పాలమూరు రంగారెడ్డిని ప్రారంభిస్తున్నట్లు 600బస్సుల్లో జనాన్ని తీసుకువచ్చి మభ్య పెట్టారు తప్ప చేసిందేమీ లేదన్నారు. పాలమూరు రంగారెడ్డిని మా ప్రభుత్వం పూర్తి చేస్తుందని, ఇప్పటికే మా సీఎం రేవంత్ రెడ్డి ఐదు సార్లు సమీక్ష చేశారన్నారు. 2017లో కొయిల్ సాగర్‌కు హరీష్‌రావు వచ్చి 50 వేల ఎకరాలకు అదనం గా నీళ్లు ఇస్తామని చెప్పాడు కానీ ఇప్పటి వరకు ఒక్క ఎకరానికి కూడా అదనంగా నీళ్లు ఇవ్వలేదన్నారు. దమ్ముంటే హరీష్ రావు తడిబట్టలతో కురుమూర్తి దేవాల యానికి రావాలని సవాల్ విసిరారు. మంగళవారం నేను, మా ఎమ్మెల్యేలు కురుమూర్తికి వచ్చి ప్రమాణం చేస్తాం మరి 10 యేళ్లలో పాలమూరు జిల్లాలో ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇచ్చారో చర్చకు మేం సిద్ధమా అని నిలదీశారు. హరీష్‌రావుతో చర్చకు మా ముఖ్యమంత్రి అవసరం లేదని, జిల్లా ఎమ్మెల్యేలు చాలన్నారు. పాలమూరు జిల్లాకు తీరని అన్యాయం చేసింది హరీష్‌రావే అని, కేసీఆర్ కు పాలమూరు జిల్లా ప్రజలు రాజకీయ బిక్ష పెడితే మోసం చేశాడని ధ్వజమెత్తారు. కేటీఆర్ కు మైండ్ దొబ్బందని, సంక్షేమ పథకాల పైన మతి లేకుండా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. కేటీఆర్ కు ఎర్రగడ్డ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించాలని ఆరోగ్య శాఖ మంత్రిని కోరుతున్నామని వ్యాఖ్యానించారు. కుట్ర కు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ పార్టీ అని, గ్రామసభల్లో అల్లర్లు చేయడానికి కార్యకర్తలకు బీఆర్ఎస్ మద్యం తాపించి పంపించిందని ఆరోపించారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పై నేను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా అని స్పష్టం చేశారు. 10 యేళ్లు బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇష్టానుసారంగా దోచి పెట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో పేదలకు సంక్షేమ పథకాలు అందలేదని కేవలం ముఖ్య కార్యకర్తలు, గ్రామ పెద్దలు కలిసి అర్హుల జాబితా తయారు చేయాలని నేను మాట్లాడానని ఇపుడు కూడా తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా అని అన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై హైకోర్టులో పిల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చెప్పటిన 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం పై హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. నారాయణపేటకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ సోమవారం పిటిషన్ వేశారు. భూమి లేని రైతు కూలీలలకు ఏటా రూ.12వేలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం రూపొందించిందని పేర్కొన్నారు. అయితే మున్సిపాలిటీల పరిధిలో ఉన్న రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదని పిటిషనర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 129 మున్సిపాలిటీల్లో 8లక్షల మందికి పైగా రైతు కూలీలు ఉన్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోర్టుకు తెలిపారు. గ్రామాల్లో ఉన్న రైతు కూలీలకు ఇచ్చి మున్సిపాలిటీల్లోని వారికి ఇవ్వకపోవడం సరికాదన్నారు. రైతు కూలీలు ఎక్కడ ఉన్నా అందరూ సమానమేనని చెప్పారు. కేవలం గ్రామాల్లో ఉన్న రైతు కూలీలకే ఈ పథకం వర్తింపజేయడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమన్నారు. విషయంలో హైకోర్టు స్పందిస్తూ 4 వారాల్లో మున్సిపాలిటీల్లోని రైతు కూలీలను 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకంలోకి తీసుకోవాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది.

గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలు సిగ్గు చేటు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజా గాయకుడు గద్దర్‌పై కేంద్రమంత్రి బండిసంజాయ్ చేసిన వ్యాఖ్యాలు సిగ్గుచేటని, ఇది ఓ విధంగా తెలంగాణ ప్రజలను కించ పరిచినట్లే అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా వాగ్గేయ కారుడు గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం, పద్మశ్రీ, పద్మ భూషణ్‌లల్లో తెలంగాణ రాష్ట్ర పై వివక్షనే చూపారని ఆరోపించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి తెలంగాణ రాష్ట్ర చారిత్ర పైన అవగాహన లేదని విమర్శించారు. గోరెటి వెంకన్న, గద్దర్, అందెశ్రీ, తెలంగాణ రాష్ట్ర చరిత్ర కు మూల స్తంభాలనే విషయం గ్రహిస్తే మంచిదని సూచించారు. కాషాయం కండువా కప్పుకున్న వాళ్లకే పద్మ శ్రీ అవార్డులు ఇచ్చారని ధ్వజమెత్తారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌కు కేంద్ర మంత్రిగా ఉండే అర్హత లేదన్నారు. పద్మశ్రీ, పద్మ భూషణ్ అవార్డులో రాష్ట్ర ప్రభుత్వ సిఫారాస్ ను అమలు చేయకపోవడం సిగ్గు చేటు అన్నారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తున్నారని అనడానికి ఇదే నిదర్శనమన్నారు.

ధనలక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులకు ప్రమాద బీమా పథకం అమలు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులకు ప్రమాద బీమా పథకం అమలు చేయాలి కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డి.ధనలక్ష్మి అనే మహిళ ఘట్కేసర్ మండలంలోని రాజీవ్ గృహకల్ప ప్రైమరీ స్కూల్లో మధ్యాహ్న భోజన వర్కర్స్‌గా పని చేస్తుంది. డి.ధనలక్ష్మి డిసెంబర్ 17న వంట చేస్తుండగా కాలు మీద నిప్పులు పడి కాలు కాలింది. తరువాత ఘట్కేసర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి ట్రీట్మెంట్ తీసుకున్నది. కాని కాలు ఇన్ఫెక్షన్ వచ్చింది. ఇప్పటికి 40 రోజులు గడిచింది. అప్పటి నుండి తన కుటుంబం ఇబ్బందులకు గురవుతున్నది. కుటుంబ పోషణ కూడా ఇబ్బందికరంగా మారింది. కావున డి.ధనలక్ష్మికి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో మదన కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని యూనియన్ నాయకులు ఉన్నికృష్ణ అందజేశారు. అదే విధంగా స్కూల్లో గ్యాస్ సౌకర్యం కూడా కల్పించాలని కోరారు.

ప్రజావాణి సమస్యలను తక్షణం పరిష్కరించాలి: ఉప కమిషనర్ రాజు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 5 ఫిర్యాదులు అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ గోదుమల రాజు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి సమస్యలపై కాలయాపన చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణలో నాలుగేళ్ల తర్వాత మళ్ళీ ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టనున్నారు. సోమవారం నాడు ఆర్టీసీ యాజమాన్యానికి ఉద్యోగ సంఘాల ఆర్టీసీ కార్మికులు ఆర్టీసీ ఎండీ.సజ్జనర్ కు సమ్మె నోటీస్ ఇచ్చారు. 21 డిమాండ్లతో ఆర్టీసీ యూనియన్ నేతలు నోటీసు అందజేశారు. ఇందులో ముఖ్యంగా ఆర్టీసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ సమ్మె నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సమ్మె నోటీసులు ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలైనా ఉద్యోగుల సమస్యలు పట్టించుకోలేదని ఆర్టీసీ జేఏసీ ఆరోపించింది.

ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలకే అవార్డులు ఇవ్వాలని రాజ్యాంగంలో ఉందా

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలకే అవార్డులు ఇవ్వాలని రాజ్యాంగంలో ఉందా అని కేంద్రమంత్రి బండి సంజయ్ కి టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నాడు ప్రజా యుద్ధ నౌకను ఆలింగణం చేసుకున్నప్పుడు భావజాలం గుర్తుకు రాలేదా అని బండి సంజయ్‌ను ఆయన ఓ ప్రకటనలో నిలదీశారు. బీజేపీ భావజాలం ఉన్న వారికే పద్మ అవార్డులు ఇస్తాము అంటూ కేంద్ర హెూమ్ సహాయ మంత్రి చేసిన వ్యాఖ్యలు చాలా అభ్యంతరకరమని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలను సమాజం ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. మోడీకి రాజ్యాంగ సూత్రాల మీద అవగాహన ఉంటే బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సూచించారు. బీజేపీ నేతలు ఒప్పుకున్న ఒప్పుకోకపోయినా ప్రజా యుద్ధ నౌక గద్దర్ పేరు చిరస్మరణీయమన్నారు. కరసేవకుల మీద కాల్పులు చేయించిన నేతలకు అవార్డులు ఇచ్చినపుడు భావజాలం సోయి ఎటుపోయిందంటూ మండిపడ్డారు. లెఫ్టిస్ట్ భావజాలం ఉన్న వ్యక్తులు బీజేపీలో లేరా, అదే నిజమైతే నక్సలిజం నా ఎజెండా అని చెప్పిన ఈటెల రాజేందర్‌ను పార్టీలో చేర్చుకొని ఎలా ఎంపీ పదవి ఏమైందంటూ నిలదీశారు. నక్సలైట్లు మా దేశ భక్తులు అన్న ఎన్.టి.ఆర్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోలేదా అని ప్రశ్నించారు.

2024 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎంతమంది బీజేపీ భావజాలం ఉన్న వారు పార్టీ టికెట్‌పై పోటీ చేశారన్నారు. ఇటీవల కొత్తగా ఎన్నికైన బీజేపీ మండల అధ్యక్షుల్లో ఎంతమంది మీ భావజాలం నుంచి వచ్చిన వ్యక్తులు ఉన్నారని చెప్పారు. బీజేపీ నేతలు సిద్ధాంతాలకు, భావజాలానికి ఎప్పుడో తిలోదకాలు ఇచ్చేశారన్నారు. బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవికి ఎక్కువ కార్పొరేటర్ పదవికి తక్కువ అంటూ ఎద్దేవా చేశారు. త్వరలో తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్ష రాబోతున్నాడని, పార్టీలో తన ప్రాధాన్యత తగ్గిపోతుందని సంజయ్ ఫ్రస్టేషన్లో మాట్లాడుతున్నాడన్నారు.

పోస్టుల సంఖ్యను పెంచాల్సిందే...

రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాల్సిందే

రెండవ ఏఎన్ఎంల ధర్నాలో సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) పరీక్ష నోటిఫికేషన్‌కు సంబంధించి ఖచ్చితంగా పోస్టులు పెంచాల్సిందేనని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ శాసనసభ్యులు చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులను పెంచడంతోపాటు పరీక్షకు అర్హతలేని వారికి 10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్‌తో పాటు, 100శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని రెండవ ఏఎన్ఎంలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కమీషనర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రెండు దశాబ్దాలుగా వీరితో పని చేయించుకున్న ప్రభుత్వాలు చివరకు రిటైర్మెంట్ సమయంలో వట్టి చేతులతో ఇంటికి పంపించడం ఏమాత్రం సమంజసం కాదని ఆయన ఉద్ఘాటించారు. నూతన ఆర్థిక విధానాలతో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వంటి పేర్లతో ఉద్యోగాలను సృష్టి అరకోరా జీతాలు ఇస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఉద్యోగాన్ని వదులుకోలేక మరొకవైపు చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని పోషించుకోలేక కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నారని ఆయన ఆరోపించారు. 2021వ సంవత్సరంలో పిఆర్సి అమలులోకి వస్తే ఇప్పటివరకు పిఆర్సి బకాయిలు చెల్లించకపోవడం అధికారుల లోపమేనన్నారు. గత ప్రభుత్వ కాలంలో రెండవ ఏఎన్ఎంలు తమను బేషరత్‌గా రెగ్యులర్ చేయాలని పోరాటం చేశారని, అది సాధ్యం కాదని అప్పటి ప్రభుత్వం తేల్చి చెప్పిన కారణంగా కనీసం 100శాతం గ్రాస్ శాలరీ నైన ఇవ్వాలని తాము కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ తర్వాత కార్మిక నాయకులతో జరిగిన చర్చల్లో భాగంగా గ్రాస్ శాలరీ అమలు తీరుకొరకు త్రిషభ్య కమిటీని వేశారని, కానీ ఇంతవరకు దాన్ని అమలు చేయకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. ఇప్పటి ప్రజా ప్రభుత్వమైనా స్పందించి వీలైనంత త్వరగా సెకండ్ ఏఎన్ఎంలకు 100 శాతం గ్రాస్ శాలరీని ఇవ్వాలని ఆయన కోరారు. కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సాగే ఏ పోరాటానికైనా సిపిఐ మద్దతిస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. పోస్టుల పెంచడం వీరు రెగ్యులర్ అయ్యే అవకాశం ఉందని కనుక ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో వీలైనంత త్వరగా వాటిని గుర్తించి పోస్టలను పెంచి నియమాంకాలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జక్కుల పద్మ, బోయిని శ్యామల, ఉపాధ్యక్షులు పి.జయమ్మ, శీలం నాగ శేషమ్మ, సుమతి, గోపక్క, రాణి, సంధ్యా రాణి, సరోజిని, సహాయ కార్యదర్శిలు తస్వీరు సుల్తానా, రత్నకుమారి, రజిత, రాజేశ్వరి, స్కైలాబ్ రాణి, కృష్ణవేణి, లతా, పార్వతి, రాష్ట్ర నాయకురాలు గుణవతి, స్వరాజ్య లక్ష్మి, గిరిజా రెడ్డి, దేవయాని, హుస్సేన్ బీ, తదితరులు పాల్గొన్నారు.

మతిలేని మాటలు మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు అవుతున్న సంక్షేమ పథకాలను చూసి బీఆరెస్ నాయకులు మతిలేని మాటలు మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం సీఎల్పీలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 600 గ్రామాల్లో నాలుగు సంక్షేమ పథకాల అమలు విజయవంతంగా ప్రారంభమైందన్నారు. 10 ఏళ్లు కళ్లు కాయలు కాచేలా జనం రేషన్ కార్డుల కోసం ఎదురు చూశారని పేర్కొన్నారు. హరీష్ రావుకు అసలు మెదడు ఉందా అంటూ వ్యాఖ్యానించారు. డమ్మీ చెక్ ఇచ్చామని హరీష్ రావు మాట్లాడడం విడ్డురంగా ఉందని, అసలైన డమ్మీలు మీరే అని 10 ఏళ్లు లక్ష రూపాయల రుణమాఫీ కూడా సరిగా చేయమని మీరు డమ్మీలు అంటూ ధ్వజ మెత్తారు. పార్టీలో, ప్రభుత్వంలో అందరిని డమ్మీ చేసి మీ నలుగురు అవినీతి అక్రమాలు చేసి దోచుకున్నారని విమర్శించారు. మా ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, బీఆర్ఎస్ నాయకులు దు:ఖంలో ఉన్నారన్నారు. పదేళ్ల కాలంలో ప్రజల దరఖాస్తులకు బూజు పడితే వాటిని దులిపి లబ్దిదారులను మేం ఎంపిక చేస్తున్నామని చెపుకొచ్చారు. రూ.7 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని ఆర్థికంగా నాశనం చేసినా మేం పథకాలను అమలు చేస్తున్నామన్నారు. భూమి లేకున్నా ధరణిలో సృష్టించి బీఆర్ఎస్ కార్యకర్తలకు కోట్లాది రూపాయల రైతు బంధు ఇచ్చారని మండిపడ్డారు. దద్దమ్మలు, సన్నాసులు, డమ్మీలు, దగాకోరులు బీఆర్ఎస్ నాయకులే అని, బీఆర్ఎస్ నాయకుల చెత్త వాగుడిని ప్రజలు పట్టించుకోవద్దన్నారు. రైతు కూలీల గురించి కలలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ అవమానించారని ధ్వజమెత్తారు. గద్దర్ తెలంగాణ వాది అని, తన ఆట పాటతో తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది చైతన్యపర్చారని గుర్తు చేశారు. గద్దర్‌కు పద్మ అవార్డు ఇవ్వొద్దని అనడం సరైనది కాదని, వారి పార్టీ ఎంపీగా ఉన్న ఈటెల రాజేందర్ కూడా వామపక్ష భావజాలం నుంచి వచ్చిన నాయకుడే అని అలాంటపుడు ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి అనర్హుడా అని ప్రశ్నించారు. వామపక్ష భావజాలం ఉన్న నాయకులను బీజేపీ చేర్చుకొని ఎంపీలు, ఎమ్మెల్యేలు చేయలేదా అని నిలదీశారు. గతంలో గద్దర్‌ను ప్రగతి భవన్ దగ్గర ఎండలో కూర్చోబెట్టి కేసీఆర్ అవమానించాడని, ఇప్పుడు బండి సంజయ్ అదే ధోరణితో మాట్లాడుతున్నాడని దుయ్య బట్టారు. బీఆర్ఎస్, బీజేపీ భావజాలం ఒక్కటే రెండు పార్టీలు అంతర్గత ఒప్పందంతో పనిచేస్తున్నామని విమర్శించారు.

రాజేశ్వరరావును కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర - బషీర్‌బాగ్: హెబ్రోన్ చర్చిలో అవినీతి, అంతర్గత గొడవలకు కారణం అవుతున్న మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావును కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని దళిత క్రైస్తవ ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రిస్టియన్ నేతలు రెవరెండ్ షావులా జోసెఫ్, ఆర్.మోజస్, స్టీఫెన్ సన్, సునీల్, థామస్, జేడీ వెస్లీలతో కలిసి బిషప్ భాస్కర్ మలకాల మాట్లాడారు. 1957 లో గోల్కొండ ప్రాంతంలో భక్తసింగ్ హెబ్రోన్ చర్చ్ ను స్థాపించాలన్నారు. దీని పరిధిలో ప్రపంచలో 20,000 చర్చిలు, వేల కోట్ల ఆస్తులు తెలిపారు. ప్రస్తుతం చర్చ్‌లోకి మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు చొరబడి క్రైస్తవ సోదరుల మధ్య గొడవలకు కారణం అవుతున్నాడని తెలిపారు. ఈనెల 21న రాజేశ్వరరావు చర్చిలోకి ప్రవేశించి చర్చికి చెందిన వీరాచారిని బయటకు గెంటేసాడు అని తెలిపారు. తనకు రాజకీయ పలుకుబడి ఉన్నం దున తనను ఏమీ చేయలేరని ట్రస్ట్, సొసైటీ సభ్యులను బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గత మూడు నెలలుగా సోదరులు సమర్పిస్తున్న కానుకలు చర్చికి అందటం లేదని వాపోయారు. కనుక క్రైస్తవుల హెబ్రోన్ చర్చ్ విషయంలో రాజేశ్వరరావు ఆగడాలను అరికట్టాలని వారు కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దళిత క్రైస్తవ ఐక్యవేదిక పోస్టర్‌ను ఆవిష్కరించారు.

హుస్సేన్ సాగర్ బోట్ ప్రమాదంలో గాయపడిన టూరిజం కార్మికులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : హుస్సేన్ సాగర్ వద్ద జరిగిన హారతి కార్యక్రమంలో ఫైర్‌వర్క్స్ కార్యక్రమం మూలంగా గాయపడిన టూరిజం ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉచితంగా వైద్య సహాయం అలాగే సెలవులు ఇవ్వాలని వాటితో పాటు గాయపడిన ప్రతి కార్మికుడికి నష్టపరిహారం రూ.10లక్షలు ఇవ్వాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు వి.యస్.బోస్, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి డిమాండ్ చేశారు. అలాగే హుస్సేన్ సాగర్‌లో జరుగుతున్న ఏలాంటి ఈవెంట్స్ అయినా వాటిలో ఫైర్‌వర్క్స్ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. ఈ ప్రమాదంలో మహేందర్ అనే కార్మికుడు ప్రాణాలకు తెగించి ధైర్యంతో స్పీడ్ బోట్‌ను నడిపి అనేక మందిని కాపాడటంలో అతను చూపిన చొరవకు అభినందనలు తెలిపారు. మహేందర్, ప్రేం అనే కార్మికుడు గాయాలతో ఔట్ పేషెంట్స్‌గా చికిత్స పొందుతుండగా, ప్రణీత్, సునీత్ అనే కార్మికులు యశోధ సికింద్రాబాద్ హాస్పటల్‌లో ఇన్‌పేషెంట్స్‌గా చికిత్స పొందుతున్నారని అన్నారు. వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని, ఫైర్‌వర్క్స్ కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తికి 90శాతం కాలి చావుతో పోరాడుతున్నాడని, అదే విధంగా కాంట్రాక్ట్ తరఫున ఫైర్‌వర్క్స్‌కు వచ్చిన ఒక వ్యక్తి అసలు జాడ తెలియటం లేదన్నారు. ఇలాంటి సంఘటనపై టూరిస్టు యాజమాన్యం అలాగే రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా యూనియన్‌గా డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించటానికి హుస్సేన్ సాగర్‌లో ఫైర్ కార్యక్రమాలను, ప్రైవేటు వ్యక్తులను నిషేధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడిసి యాజమాన్యం ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వరాదని విజ్ఞప్తి చేశారు.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (67) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందరర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-51, ఇతర శాఖలు-16, మొత్తం 87 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమన్వయ సమావేశంలో జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నాలుగు పథకాల వివరాలు గ్రామ పంచాయతీల వారీగా, మున్సిపాలిటీల వార్డుల వారీగా నమోదు చేయాలన్నారు. రానున్న ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలలో, హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాలని అన్నారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి జిల్లా ఉత్తమ స్థానంలో నిలిచే విధంగా ప్రణాళిక రూపొందించుకొని ముందుకెళ్ళన్నారు. గణతంత్ర దినోత్సవం వేడుకల్లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులందరు సమన్వయంతో పని చేసి విజయవంతం చేసినందుకు అధికారులను కలెక్టర్ అభినందించారు. అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మేయర్, కార్పొరేటర్లను సన్మానించిన కమిషనర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ప్రజా సేవకుడు, అనునిత్యం ప్రజలకు అందుబాటులో వుంటూ 25వ డివిజన్‌ని అభివృద్ధి చేసి ప్రజలందరికి సేవ చేసి విజయవంతంగా అయిదు సంవత్సరాల పదవి కాలం ముగియడంతో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం కమీషనర్ త్రిలేశ్వర్ హరిశంకర్ రెడ్డి సన్మానించి, షీల్డ్, శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, బి.ఆర్.ఎస్ నాయకులు మహేష్, మాధవి రఘుపతి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాదియాజావీద్ ఖాన్, రవీందర్ రెడ్డి, రామాంజనేయ రెడ్డి, జవహర్ రెడ్డి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ యాదయ్యకు సన్మానం

విశాలాంధ్ర - ఆమనగల్లు : ప్రజలతో మమేకమవుతూ బాధ్యతతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని, పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగే విధంగా పని చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, గుర్రం కేశవులు తెలిపారు. ఆమనగల్లు పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న యాదయ్యకు ఎస్ఐగా ప్రమోషన్ రావడం చాలా సంతోషకరంగా ఉందని వారు అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఆయనను స్థానిక నాయకులతో కలిసి పూలమాల శాలువాతో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూపం వెంకట్ రెడ్డి, గాజుల శ్రీనివాస్, సింగిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతి ఉద్ధరణ కోసమే బీజేపీని ఆశ్రయించా : మంద కృష్ణ మాదిగ

విశాలాంధ్ర - హైదరాబాద్ : సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత కూడా రాష్ట్రంలో వర్గీకరణను అమలు చేయడం లేదని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. నా జాతి ఉద్ధరణ కోసం బిజేపి ఆశ్రయించామేగాని కదువాలు కప్పుకోలేదన్నారు. ఎస్.సి.వర్గీకరణను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారన్నారు. వర్గీకరణను అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఆర్డినెన్స్ తీసుకొచ్చి, దేశంలోనే తెలంగాణ మొట్టమొదలుగా అమలు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వర్గీకరణను అమలు చేయకుండా కాంగ్రెస్ మాల సామాజికవర్గం ప్రజాప్రతినిధులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను శాసిస్తున్న మాల సామాజిక వర్గం పత్తిళ్లకు తలొగ్గిన సిఎం రేవంత్ రెడ్డి వర్గీకరణను అమలు చేయడం లేదన్నారు. అందుకే హైదరాబాద్ ఫిబ్రవరి 7వ తేదీన 'లక్ష డప్పులు-వేల గొంతుల' సాంస్కృతిక కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. తాను ఎప్పటికీ కండువా మార్చనని, ఏ రాజకీయ పార్టీలో చేరను అని కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్ తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూజె) ఆధ్వర్యంలో సోమవారం 'లక్ష డప్పులు-వేల గొంతుల' కార్యక్రమంపై మీట్ ది ప్రెస్ నిర్వహించారు. టియుడబ్ల్యూజే అధ్యక్షులు కె.వీరహత్ అలీ మీట్ ది ప్రెస్‌కు సమన్వయ కర్తగా వ్యవహరించగా, టియుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ హాజరయ్యారు. జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు మందకృష్ణ మాదిగ సమాధానమిచ్చారు. గత సంవత్సరం ఆగస్టు 1న సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిందని, నాలుగు నెలల 26 రోజులు గడుస్తున్న రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వర్గీకరణను అమలు చేయడం లేదని మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. అందరికంటే ముందే తెలంగాణలో అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సిఎం రేవంత్ రెడ్డి వెనక్కి తగ్గారన్నారు. వర్గీకరణను చేయకుండానే ఉద్యోగ నోటిఫికేషన్లను జారీ చేస్తున్నారని, గ్రూప్-1, 2, 3 అమలు భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. వర్గీకరణ జరగకుండానే ఇప్పటికే టీచర్ పోస్టులు భర్తీ చేశారన్నారు. ఈ మూడు మాటాలకు రేవంత్ రెడ్డి కట్టుబడి ఉంటే తాము రోడ్డు ఎక్కాల్సిన అవసరం ఉండేదికాదన్నారు. అందుకే తాము సాంస్కృతిక, వాయిద్యా ఉద్యమాన్ని చేపడుతున్నామని వివరించారు. వర్గీకరణపై సమాజం ఎటువైపు ఉండాలనే అంశంపై ప్రస్తుతం చర్చ జరుగుతుందన్నారు. సమాజమంతా వర్గీకరణ న్యాయమైందని, వర్గీకరణకే మద్దతు ఇస్తుందని తెలిపారు.

అభివృద్ధికి కృషి చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర-దుండిగల్: కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి కృతజ్ఞతా భావంగా స్పెషల్ ఆఫీసర్ చంద్రమోహన్‌ను కోరారు. నియోజకవర్గం కొంపల్లి పురపాలక సంఘ పాలకవర్గం పదవీకాలం పూర్తి కావడంతో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.15 ఆదేశం మేరకు సోమవారం కొంపల్లి పురపాలక సంఘం స్పెషల్ ఆఫీసర్‌గా చంద్రమోహన్‌ను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీహరి ఆయనకు ఘనంగా స్వాగతం పలికి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చంద్రమోహన్ కొంపల్లి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ విధంగా కమిషనర్ శ్రీహరి స్పెషల్ ఆఫీసర్ చంద్రమోహన్‌తో వివిధ సెక్షన్ల అధికారులచే సమీక్ష సమావేశాన్ని నిర్వహించి వివిధ సెక్షన్ల అధికారులను, వర్డ్ అధికారులను, సిబ్బందిని పరిచయం చేశారు. అదే విధంగా వివిధ వార్డులలో పారిశుద్ధ్య పనులు నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, ఎల్ ఆర్ ఎస్ సర్వే, అడ్వర్ టైస్మెంట్ పన్నుల వసూలు, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్స్, ఆన్-అస్సెస్డ్, అండర్ అస్సెస్డ్ ప్రాపర్టీ టాక్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజాసేవలో భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : పదవీకాలం ముగిసినా ప్రజా హిత సేవలో భాగస్వాములై ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పేట్ బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇటీవల పదవీ కాలం పూర్తి చేసుకున్న నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు ఎమ్మెల్యే కెపి వివేకానంద్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ పదవులతో సంబంధం లేకుండా నాయకులు ప్రజల్లో తిరిగినప్పుడే రాజకీయంగా భవిష్యత్తు ఉంటుందని ఆయన వెల్లడించారు. అనంతరం నిజాంపేట్ కార్పొరేషన్ అభివృద్ధికి ఎమ్మెల్యే కెపి వివేకా నంద్ వెచ్చించిన నిధులు, చేసిన సంక్షేమం గురించి కార్పొరేటర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సహాయ, సహకారాలతో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పలు అభివృద్ధి పనులు చేశామని, పదవులు ఉన్నాలేకున్నా ప్రజల కోసమే పని చేస్తామని తెలిపారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న బిఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్‌లను ఎమ్మెల్యే కేపీ వివేకానంద శాలువాతో సత్కరించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు ప్రణయ ధనరాజ్ యాదవ్, రజిత రవికాంత్, రవి కిరణ్, గాజుల సుజాత, ఆగం రాజు, కాసాని సుధాకర్ ముదిరాజ్, పైడి మాధవి, రాఘవేంద్రరావు, బొర్రా దేవి, చందు ముదిరాజ్, కో-ఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్ రెడ్డి, సయ్యద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ కమిషనర్‌గా త్రిలేశ్వర్‌రావు ఎంపిక

విశాలాంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ నగరపాలక సంస్థ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు బెస్ట్ కమిషనర్‌గా ఎంపికైన సందర్భంగా సోమవారం ఉదయం మాజీ మేయర్ అమర్‌సింగ్, భీమ్‌రెడ్డి నవీన్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సేవలను ప్రశంసిస్తూ నగర అభివృద్ధికి ఆయన అందిస్తున్న కృషిని ప్రత్యేకంగా గుర్తించారు.

శ్రీసాయి నగర్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : తుర్కాయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 22వ వార్డు శ్రీ సాయినగర్ కాలనీ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కామిశెట్టి రమేష్, ఉపాధ్యక్షులు మునగపాటి మురళి, జనరల్ సెక్రటరీ టి.నాగేశ్వరరావు (మమత) కోశాధికారి కోట్ల కీర్తి, చంద్రశేఖర్ రెడ్డి, సెక్రటరీలుగా కేశవులు, ప్రవీణ్ కుమార్, గౌరవ సలహాదారులు సురేష్ రెడ్డి, రవీంద్ర కుమార్, రాములు, నవీన్, రామాంజనేయులు, ఉత్సవ కమిటీ సభ్యులుగా భరత్, ప్రభావతి, నవీన్ రెడ్డి, శ్రీశైలం, దీక్షిత్, రాంప్రకాష్, సాయి, గణేష్, లింగయ్య, నరహరి రెడ్డి ఎన్నికయ్యారు.

స్పెషల్ ఆఫీసర్‌గా సాయినాధ్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-దుండిగల్ : తెలంగాణ ప్రభుత్వం పాలకమండలి గడువు పూర్తయిన సందర్భంగా రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలకు నూతన స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. అందులో భాగంగా సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీకి నూతన స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ డైరెక్టర్‌గా సాయినాథ్ భాద్యతలు స్వీకరించారు. అనంతపురం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు డిప్యూటీ డైరెక్టర్ సాయినాధ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మయ్య, రెవిన్యూ ఆఫీసర్ ప్రభాకర్, మున్సిపల్ ఇంజనీర్ సురేందర్ నాయక్, వార్డ్ ఆఫీసర్ల మున్సిపల్ లిస్ట్ ఆఫ్ పాల్గొన్నారు.

కురుమ సంఘం అధ్యక్షులుగా చిగుళ్ల శ్రీనివాస్

విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ కురుమ సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా చిగుళ్ల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఎలక్షన్ కమిటీ మెంబర్లు సుర్ణం రాజేష్, బెల్లం గట్టయ్య, బెల్లం బక్కయ్య, కంది రాములు, నాగ మల్లేష్, కొమురయ్య, రాజు, ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చిగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కురుమ సంఘం మల్లాపూర్ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కుల సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు. కురుమ కులస్తులను ఏకతాటిపై తెచ్చి మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు శక్తి వంచన లేకుండా పని చేస్తానని తెలిపారు.

కదం తొక్కిన కష్టజీవులు

- పేదల స్థలాలు, సాగు భూములకు పట్టాలివ్వాలి
- జల్లి విల్సన్, సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: నిరుపేద కుటుంబాలు సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ కష్టజీవులు కదంతొక్కారు. రోడ్లపైకి వచ్చి పెద్దఎత్తున నిరసన తెలిపారు. 30 ఏళ్లుగా తమ బతుకులు మారలేదని, తమకు భూహక్కులు కల్పించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘాల అధ్వర్యంలో సోమవారం ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలంలో పాత సినిమా హాల్ సెంటర్ నుంచి రెవెన్యూ తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎర్ర జెండాలు, బ్యానర్లు చేతబట్టి పెద్దపెట్టున నినాదాలు చేశారు. 20 గ్రామాల నుంచి వచ్చిన వేలాది మంది పేదలతో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ గ్రామాలలో 3 సెంట్ల ఇంటి స్థలం, నిర్మాణ ఖర్చు రూ.5 లక్షలు ఇవ్వాలని, 30ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇస్తానన్నారని, దీనిని తక్షణమే అమలు చేయాలని, సమీక్షలంటూ కాలయాపన వద్దని సూచించారు. పేదవాడికి ఇంటి స్థలం, సాగు భూములు ఉంటేనే ఆత్మగౌరవం, సామాజిక భద్రత ఉంటుందని అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం నియోజకవర్గంలో సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించిన భూ పోరాటాల వేలాది ఎకరాలు పేదలు సాధించుకుని 30 సంవత్సరాలుగా అనుభవిస్తున్నప్పటికీ వీటిని సాగు లెక్కలలో రాసి పట్టాలు ఇవ్వడానికి ఏ ప్రభుత్వం పూనుకోకపోవడం దారుణమన్నారు. రెవెన్యూ లెక్కల్లో పేర్లు నమోదు చేసి తక్షణమే అర్హులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల అధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. ఈనెల 27 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు ఆందోళన చేస్తామని తెలిపారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, మైలవరం నియోజకవర్గం కార్యదర్శి బుడ్డి రమేశ్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు దుర్గా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పేదలు ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయలేరు కాబట్టే ప్రభుత్వం వాటిని సమకూర్చాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ జె.సుశీలదేవికి పేదలు వ్యక్తిగత ఇంటి దరఖాస్తులను సమర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అడపా సుబ్బారావు, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు నమ్మిక శ్రీనివాస రావు, కట్టా సుబ్బారావు, బి.చంటి, పోతురాజు సాంబయ్య, మట్టికొయ్య సుబ్బారావు, మహిళా సమాఖ్య నాయకులు సందిపాము గోవర్ధన్, సగ్గుర్తి సంతోషం, కౌవ్వూరి నాగమణి, పి.రమాదేవి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల జీవో జారీ హర్షణీయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇవ్వడం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు గ్రామాల్లో 1.5 సెంట్లు, పట్టణాల్లో 1 సెంటు చొప్పున ఇచ్చిన ఇళ్ల స్థలాలు... ఒక కుటుంబం నివసించడానికి అనుకూలంగా ఉండవని సీపీఐ ఏనాడో చెప్పిందని... పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. అయినప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం సీపీఐ విజ్ఞప్తిని పెడచెవిన పెట్టిన ఫలితంగా గత ఎన్నికల్లో వైసీపీ ఓటమి చవిచూసిందన్నారు. ప్రజల ఆకాంక్షలను, సీపీఐ విజ్ఞప్తిని గమనంలోకి తీసుకున్న ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు జీవో ఇవ్వటాన్ని ఆయన స్వాగతించారు. అలాగే గత జగన్ ప్రభుత్వం హయాంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల లే అవుట్లలో కూడా మార్పు చేసి గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున కేటాయించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు

దుర్గాభవానీ డిమాండ్

విశాలాంధ్ర-మచిలీపట్నం: అర్హులకు ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గాభవానీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు పార్టీ పిలుపులో భాగంగా మచిలీపట్నం శాఖ అధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక బెల్ కంపెనీ ఆడిటోరియం నుంచి ర్యాలీగా బయలుదేరి నార్త్ తహసీల్దార్ వి. నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ 76వ గణతంత్ర దినోత్సవంలోకి అడుగిడు తున్న తరుణంలో బలహీన వర్గాలకు చెందిన అనేకమంది మన రాష్ట్రంలో ఉన్నారని, కనీసం ఉంటానికి ఇళ్లు కూడా ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి మేనిఫెస్టో ప్రకారం... పట్టణంలో పేదలకు రెండు సెంట్లు, గ్రామీణులకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామన్నా హామీ నిలబెట్టుకో వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆవాస్ యోజన పథకం కింద ఇంటి నిర్మా ణానికి రూ.1.80 లక్షలతో పాటు రాష్ట్రం రూ.లక్ష ఇస్తుందని అన్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఫిబ్రవరి 10వ తేదీ వరకు రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కంట్రోలర్ కమిటీ సభ్యుడు మోదుమూడి రామారావు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ. ఐదు లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయాలని కోరుతూ 24, 25, 28, 46, 50 డివిజన్లలోని సచివాలయాలలో వినతిపత్రాలు ఇచ్చినట్టు వివరించారు. పార్టీ నియోజవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ మాట్లాడుతూ... పేదలు అద్దె ఇళ్లలోనే మగ్గుతున్నారన్నారు. ప్రభుత్వం త్వరితగతిన ఇళ్లు మంజూరు చేయని పక్షంలో పార్టీ తరపున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. పార్టీ నియోజవర్గ సహాయ కార్యదర్శి ఓడుగు చైతన్య కుమార్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఒంటి పులి లక్ష్మణరావు, యర్రంశెట్టి ఈశ్వరరావు, మహిళా సమాఖ్య నాయకురాలు ఓడుగు రత్నకుమారి, బలగం మహేష్, బోయిన బాబి పాల్గొన్నారు.

సీపీఐ నేత యిర్మియా హఠాన్మరణం

విశాలాంధ్ర-సత్తెనపల్లి/పెదకూరపాడు: పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి యిర్మియా ఆదివారం రాత్రి గుండెపోటుతో మరణించారు. యిర్మియాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామంలో యిర్మియా భౌతికదేహం వద్ద పార్టీ నేతలు, కార్యకర్తలు నివాళులర్పించారు. సోమవారం సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి. యిర్మియా అనేకమంది విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దిన మంచి మాస్టర్‌గా పేరు గడించారు. మంచి చిత్రకారుడు, బుక్ రీడర్, సాహిత్యం పట్ల మక్కువ. దొడ్లేరు గ్రామంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, నాయకులు మునుగోడు శ్రీనివాసరావు, కొమ్మాలపాటి శరత్, రాయబారం శేషయ్య, తాండవ కృష్ణ, కంబాల శీను, పవన్ కుమార్, షేక్ చిన్న జాను సైదా తదితరులు నివాళులర్పించారు. పార్టీ నాయకులు నరసింహారావు, మస్తాన్, విద్యార్థి సంఘం మాజీ నాయకులు నరిశేటి తాండవకృష్ణ తదితరులు యిర్మియా కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి సంతాపం వ్యక్తం చేశారు. యిర్మియా ఆకస్మిక మరణం పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటని న్యాయవాది, సామాజిక కార్యకర్త నరిశేటి వేణుగోపాల్ అన్నారు.

నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు యిర్మియా: ముప్పాళ్ల

సత్తెనపల్లి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పి.యిర్మియా నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నేత అని, ఆయన మరణం సత్తెనపల్లి ఏరియా సీపీఐకి తీరని లోటని ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొంటూ అనేకమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత కామ్రేడ్ యిర్మియా దన్నారు. అనేక సంవత్సరాలుగా కార్మిక ఉద్యమంలో పనిచేసి సీపీఐ సత్తెనపల్లి ఏరియా నాయకునిగా ఎన్నికయ్యారని కొనియాడారు. వారి కుటుంబానికి సంతాపాన్ని, సానుభూతి తెలిపారు.

రాష్ట్రాభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర -నూజివీడు: గత ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లో కుదేలైన రాష్ట్రాన్ని పునరుజ్జీవింప చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సీఎంతో పాటు మంత్రి లోకేశ్ దావోస్ పర్యటించి రాష్ట్రానికి పెట్టుబడులు తేవడంలో విజయం సాధించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, పారిశ్రామిక పాలసీలకు ఆకర్షితులైన పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాన్ని వృద్ధిలోకి తీసుకువెళ్లడానికి చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రపంచ దిగ్గజాలు సైతం చంద్రబాబు విజన్‌ను మెచ్చుకున్నారని, రాష్ట్రానికే కాక దేశంలో పెట్టుబడులు పెట్టడానికి సైతం పారిశ్రామికవేత్తలు మొగ్గుచూపారన్నారు. సహజ వనరులను వినియోగించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు విజన్ కారణంగా రాష్ట్రానికి రూ.ఐదు లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నాయని చెప్పారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి కృషి

రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: బీసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బీసీ మంత్రులకు అభినందన సభలో ఆయన పాల్గొన్నారు.

మాజీ సీఎం నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించటం ద్వారానే పంచాయితీ కార్యాలయం మెట్లు కూడా ఎక్కని బీసీలు ఏకంగా పార్లమెంటులో అడుగు పెట్టే స్థాయికి ఎదిగారని అన్నారు. వెనుకబడిన తరగతుల వారంతా ఐక్యంగా ఉంటేనే అనుకున్న లక్ష్యాలు సాధ్యమవుతాయని రామ్మోహన్ నాయుడు చెప్పారు. మంత్రి కొలుసు పార్ధసారథి మాట్లాడుతూ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు తెచ్చేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. బలహీన వర్గాల వారు ఆర్థికంగా బలోపేతం అయితే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బీసీలకు ఉద్యోగ, ఉపాధి, సామాజిక, రాజకీయాలలో సమాన అవకాశాలు కల్పించేలా పూర్తి సహకారం అందిస్తామన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు తెచ్చే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ బీసీల రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మహ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల సీతారామాంజనేయులు, తెనాలి శ్రావణ కుమార్, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనగళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి అవసరమైన పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. బీసీ సాధికారిక కమిటీ అధ్వర్యంలో జరిగిన ఈ సభలో బీసీ ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్, మాజీ డిప్యూటీ మేయరు తాడిశెట్టి మురళీమోహన్ కార్యక్రమ నిర్వహణ కమిటీ కన్వీనర్ బండపల్లి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కిర్లంపూడి సొసైటీలో భారీ కుంభకోణం

- చనిపోయిన వారి పేరున రుణాలు
- రూ.104 కోట్ల అవకతవకలపై విచారణ

విశాలాంధ్ర-కిర్లంపూడి/జగ్గంపేట: కిర్లంపూడి సహకార పరపతి సంఘంలో భారీ కుంభకోణం బయటపడింది. గత పాలకవర్గంలో జరిగిన అవకతవకలపై అధికారులు సొసైటీ ఆవరణలో సోమవారం విచారణ చేపట్టారు. రూ.104.18 కోట్లు అవకతవకలు జరిగినట్లు అధికారులు వెల్లడించడంతో రైతులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు, గ్రామస్తుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. 10 ఏళ్ల క్రితం చనిపోయిన నా తల్లి పేరుతో పేరుతో రూ.8 లక్షల రుణం ఎలా ఇచ్చారని ఓ రైతు మండిపడ్డాడు. ఆమె పేరుతో రుణాన్ని కాజేశారని అన్నారు. తాము అన్నదమ్ములం అని ఉద్యోగరీత్యా వేరే చోట ఉంటున్నామని, తమ పేరుతో పొలం లేకపోయినా రుణాలు తీసుకున్నట్లు చెబుతున్నారని, తమకు రుణాన్ని ఏ ప్రాతిపదికన ఎవరికి ఇచ్చారు... ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అనంతరం పర్సనల్ ఇంచార్జ్ రంగనాయకులు మీడియాతో మాట్లాడుతూ అవకతవకలకు పాల్పడిన వారి నుంచి రికవరీతో పాటు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బినామీల నుంచి సొమ్మును తిరిగి వసూలు చేశాకే తాము రుణాలు చెల్లిస్తామని రైతులు అంటున్నారని, లేకుంటే మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారని, ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కృత్రిమ మేధను ఆదరించాలి

- ప్రతి కుటుంబంలో ఒక ప్రొఫెషనల్ ఉండాలి
- ఆర్టీజీఎస్ సమీక్షలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృత్రిమ మేధ (ఏఐ)ను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో ఒక ఏఐ ప్రొఫెషనల్ ఉండాలనే ఆశయంతో ముందుకెళుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆయన సోమవారం సచివాలయంలో ఆర్టీజీఎస్‌పై సమీక్ష నిర్వహించారు. ఒకప్పుడు ఐటీని ఆదరించాం... ఇప్పుడు ఏఐని ఉపయోగించుకుందాం... అద్భుత ఫలితాలు సాధిద్దామని పిలుపునిచ్చారు. సాంకేతికత వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతున్నామని చెప్పారు. 15-20 శాతం వృద్ధి సాధనే లక్ష్యంగా ప్రభుత్వ శాఖలన్నీ పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని శాఖలు టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుని పనితీరు మెరుగుపర్చుకోవాలని అన్నారు. గూగుల్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖలు ఆర్టీజీఎస్‌తో తమ డేటాను అనుసంధానం చేస్తే దాన్ని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా విశ్లేషించి ఆయా ప్రభుత్వ శాఖల్లో అమలు చేయదగ్గ విషయాలను గూగుల్ సంస్థ సూచిస్తుందని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవలు త్వరలోనే ప్రారంభించనున్నామని తెలిపారు. జనన-మరణ ధృవీకరణ పత్రాలు కూడా వాట్సాప్ ద్వారా పౌరులు పొందవచ్చని చంద్రబాబు చెప్పారు. ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. దినేశ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల డాటా అనుసంధానం చేసే ప్రక్రియ వేగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేకరించిన డేటా ఆధారంగా ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేక ప్రొఫైల్ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వంలోని 40 శాఖలకు సంబంధించి వివిధ విభాగాధిపతుల వద్దనున్న డేటాను సేకరించి అనుసంధిస్తున్నట్లు వెల్లడించారు. ఆధార్ నమోదు చేసుకోని పౌరులను గుర్తించి వారి వివరాలు సేకరించామన్నారు. 2024 సెప్టెంబరులో రాష్ట్రంలో మొత్తం 1,67,53,812 మంది హౌస్ హోల్డ్స్ ఉంటే ఆ సంఖ్య 2025, జనవరికి 1,69,63,228కి పెరిగిందన్నారు. రాష్ట్ర జనాభా 2024, సెప్టెంబరుకు 4,90,83,312గా ఉంటే, 2025, జనవరికి 5,12,45,147కు చేరిందన్నారు. 24 లక్షల మంది రాష్ట్రంలో వలస వెళ్లారని, అలాంటి వారి డేటాను కూడా సేకరించి అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 1.69 కోట్ల కుటుంబాలకుగాను 1.39 కోట్ల కుటుంబాలను జియో ట్యాగింగ్ చేసినట్లు దినేశ్ కుమార్ చెప్పారు. ప్రభుత్వానికి చెందిన సామాజిక ఆస్తుల జియో ట్యాగింగ్ ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. 12,996కిగాను 12,723 పంచాయతీల సామాజిక ఆస్తుల వివరాలు జియో ట్యాగింగ్ చేపట్టామన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ముఖ్యమంత్రి కార్యదర్శులు రాజమౌళి, పీఎస్ ప్రద్యుమ్న, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ పాల్గొన్నారు.

గుంతలు లేని రహదారులే లక్ష్యం

రూ.1,080 కోట్లతో 21,220 కి.మీ. మేర పనులు: మంత్రి జనార్దనరెడ్డి

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా రూ.1,080 కోట్లతో 21,220 కి.మీ మేర పనులు చేపట్టి 12,724 కి.మీ మేర గుంతలు పూడ్చినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్దనరెడ్డి తెలిపారు. స్థానిక రెవెన్యూ అతిథి గృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో రోడ్ల ప్రగతిని వివరించారు. రోడ్ల నాణ్యతా ప్రమాణాలపై థర్డ్ పార్టీ ద్వారా విచారణ చేయనున్నామన్నారు. నాణ్యత ప్రామాణాలు లోపిస్తే అధికారులపై చర్యలుతీసుకుంటామన్నారు. 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 11,468 కోట్లు ఖర్చుచేశామన్నారు. గత ప్రభుత్వం రూ.16,852కోట్లు కేటాయించి కేవలం 7,334 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్ హెచ్ ఏ1, మోర్త ద్వారా మొత్తం 133 ప్రాజెక్ట్ ల్లో రూ. 77,967 కోట్లతో 3,463 కి.మీ మేర జాతీయ రహదారి పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. రూ. 1149 కోట్ల వ్యయంతో కొత్త రోడ్లను నాబార్డు నిధులతో చేపట్టనున్నట్లు వెల్లడించారు. రూ. 33 కోట్ల వ్యయంతో 23,521 కి.మీ మేర జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టామన్నారు. ఏలూరు జిల్లాలో రూ. 98 కోట్లతో 174 రోడ్ల మరమ్మతు పనులను చేపట్టినట్టు చెప్పారు. వరదల్లో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో పెదవాగుయ వరద నీటి మూలంగా దెబ్బదిన్న రహదారులు మరమ్మతులకు నూజివీడులో పెద్దచెరువు గండి వలన పాడైన రహదారి మరమ్మతులకు రూ. 4 కోట్లు మంజూరు చేశామన్నారు. సీఆర్ఎఫ్ నిధుల కింద రూ. 43.05 కోట్ల తో పనులు జరుగుతున్నాయన్నారు. షెడ్యూల్ ట్రైబ్ కాంపోనేట్ కింద రూ. 34.50 కోట్లతో బూర్గంపాడు- అశ్వారావుపేట రహదారి పనులు, ఏలూరు-మేడిశెట్టివారిపాలెం, సిద్ధాంతం-పెదఎడ్లగాడి, భీమవరం-గుడివాడ రహదారి పనులు జరుగుచున్నాయన్నారు. రూ. 15 కోట్లతో ఏలూరు శనివారపుపేట వద్ద బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు రూపొందించినట్టు వివరించారు. నూజివీడు బైపాస్‌కు భూసేకరణ జరుగుచున్నదని, దాని నిర్మాణం కొరకు రూ. 25 కోట్లు మంజూరు చేశామన్నారు. రైల్వే ఎల్‌సీ నెం.351 వద్ద ఆర్‌ఓబి నిర్మాణానికి రూ. 40 కోట్లతో పరిపాలన ఆమోదం దశలో ఉందన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఏలూరు శాసన సభ్యుడు బడేటి రాధాకృష్ణయ్య(చంటి), దెందులూరు శాసన సభ్యులు చింతమనేని ప్రభాకరరావు, డీఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, ఆర్అండ్‌బి ఎస్ఈ జి. జాన్ మోషే, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, తహసీల్దారు జి.వి. శేషగిరి పాల్గొన్నారు.

సమగ్ర యువజన విధానంతోనే ఉపాధి

పరుచూరి రాజేంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: సమగ్ర యువజన విధానంతోనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు అన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఏఐవైఎఫ్ బాపట్ల జిల్లా ప్రథమ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరయిన ఆయన ప్రసంగిస్తూ, ప్రధాని మోదీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని అమలు చేయకపోవడంతో దేశంలో నిరుద్యోగం రికార్డు స్థాయిలో రోజు రోజుకూ పెరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ మూసివేస్తూ ప్రైవేటీకరణ చేస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువత ఉద్యమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఉద్యోగాలు కల్పించాలని కోరిన నిరుద్యోగులపై లాఠీచార్జి చేస్తూ అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటని అన్నారు. దేశ సంపదను అదానీకి దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. మోదీ రాజ్యాంగ మార్పు కోసం కుట్ర చేస్తున్నారని, కేంద్ర హోం శాఖ మంత్రి భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. లౌకిక రాజ్యం ద్వారానే బలహీన వర్గాలకు ఉపయోగం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి రాయితీలు తీసుకొని కోట్లాది రూపాయలు ప్రజల సొమ్మును దోచుకుంటున్న ధనవంతుల సంపదను ప్రజలకు పంపిణీ చేయాలన్న నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సుభాని మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేసి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు మాట్లాడుతూ ఏఐవైఎఫ్ 22 రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళం నగరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 6న వేలాదిమంది నిరుద్యోగులతో ప్రదర్శన, బహిరంగ సభ, 7,8,9 తేదీల్లో ప్రతినిధుల మహాసభ నిర్వహిస్తామన్నారు. మహాసభల్లో సమగ్ర యువజన విధానం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్లు, వివిధ అంశాలపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఏఐవైఎఫ్ బాపట్ల జిల్లా కన్వీనర్ బిజిలీ బాబు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ ఏఐవైఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఏసుబాబు, పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.